ORIENTAL RESEARCH INSTITUTE
LIBRARY

ACCESSION No. 108815

T

CALL No. 86.073 T

SRI VENKATESWARA UNIVERSITY
TIRUPATI

10881/5

శ్రీ రామానుజ కీర్తి కౌముది

తిరుమల తిరుపతి దేవస్థానముల వారిచే సంభావింపఁబడిన

శ్రీ వైష్ణవ ధర్మ విజ్ఞాన సర్వస్వము

స చి త్ర ము

రె ం డ వ భా గ ము



సంపాదకుఁడు :

విద్యాభూషణ

ఉపన్యాసక రత్న - కవితా విశారద

ధ న కు ధ ర ం వ ర దా చా ర్యు లు

ప్రకాశకులు :

శ్రీ రామానుజ కీర్తి కౌముదీ గ్రంథమాల

శ్రీ లక్ష్మీనారాయణ పురము

గుంటూరు - 522 006

శ్రీ రామానుజ కీర్తి కౌముది

రెండవ భాగము

రెండవ ముద్రణము

వేయి ప్రతులు

విభవ - వైకుంఠ ఏకాదశి

డిశంబరు - 1988

108815

రామానుజ శకము ౯౭౧౦

మూల్యము :-

రూ 25/-

ముద్రణము :-

వెల్‌కమ్ ప్రెస్ ప్రైవేటు లిమి

ప్రొడీపేట :: గుంటూరు

సమాలోచన సమితి

మహాకవి - సరస్వతీపుత్ర – కళాప్రపూర్ణ - పద్మశ్రీ
డాక్టర్ : పుట్టపర్తి నారాయణాచార్యులు
కడప

*

వ్యాకరణ విద్యాప్రవీణ - భాషా ప్రవీణ
శ్రీమాన్ శ్రీభాష్యం అప్పలాచార్యులు, M. A.
విశాఖపట్టణము

*

భాషా ప్రవీణ - విద్వాన్ - లలిత కవి
శ్రీమాన్ కొమాండూరు రామానుజాచార్యులు
కందుకూరు తాలూకా రచయితల సంఘాధ్యక్షులు
ఉలవపాడు

*

న్యాయ విద్యాప్రవీణ
డాక్టర్ : యస్. బి. రఘునాథాచార్యులు, M. A; Ph. D.
సంస్కృత రీడర్ : శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయము
తిరుపతి

*

శ్రీమాన్ చిలకపాటి విజయరాఘవాచార్యులు, M. A; B. Bd.
లెక్చరర్ : ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ కాలేజి
నాగార్జున సాగర్ – విజయపురి సౌత్

*

శ్రీమాన్ శ్రీపెరుంబూదూరు శ్రీరంగాచార్యులు, M. A.
ఉపన్యాసకులు : శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ ప్రాచ్య కళాశాల
పాలెమ్

*

కవికోకిల - విద్వత్కవి - కావ్యకళానిధి
శ్రీమాన్ వేముగంటి నరసింహాచార్యులు
సాహిత్య వికాస మండలి అధ్యక్షులు
సిద్దిపేట

*

డాక్టర్ : చించాపట్టణం శ్రీరంగాచార్యులు, M. A; Ph. D.
ఆంధ్రోపన్యాసకులు :- ప్రభుత్వ కళాశాల
[M. V. S. Govt. Arts & Since College]
మహబూబ్‌నగర్

*

మహోపాధ్యాయ - ఉభయవేదాంత శిరోమణి
శ్రీమాన్ మరింగంటి శ్రీరంగాచార్యులు
సంస్కృతోపన్యాసకులు :-
శ్రీ వేంకటేశ్వర వివేకవర్ధినీ సంస్కృత కళాశాల
హైదరాబాదు

*

కవిశాబ్దికకేసరి - ఉభయవేదాంత విద్వాన్
శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్యులు
వరంగల్

*

విద్యాప్రవీణ - భాషాప్రవీణ - ఉభయవేదాంత శిరోమణి
శ్రీమాన్ కిడాంబి శ్రీనివాస రామానుజాచార్యులు
ప్రిన్సిపాల్ :- వేద సంస్కృత కళాశాల
నెల్లూరు

*

సాహిత్య విద్యాప్రవీణ
డాక్టర్ : తట్టా విజయరాఘవాచార్యులు, M. A; Ph. D.
ఉపన్యాసకులు :- విశిష్టాద్వైత విభాగము
కేంద్రీయ సంస్కృత విద్యాపీఠము
తిరుపతి

శ్రీనివాసాయ నమః

శ్రీమతే రామానుజాయ నమః

నివేదనము

శ్రీ వైష్ణవ వాఙ్మయము సంస్కృతమునందును, ద్రవిడము నందును అపారముగా నున్నది. ఇతర భాషలందును కొంత కాన వచ్చును. అట్టి వాఙ్మయమునందలి విశేషములను సులభ సుందర మైన తెలుఁగు భాషలో వెలయించి, ఆంధ్ర మహా జనులకు ఆత్మ సంతర్పణము గావింపవలెనని మా సంకల్పము. అందులకే 'శ్రీ రామా నుజ కీర్తి కౌముది' ఆవిర్భవించినది. ఇయ్యది - పదు నాఱు భాగ ములలో - పదు నాఱు కళలుగా వెలయఁ గలదు. ఇట్లు షోడశ కళా పరిపూర్ణ మగు ఈ కౌముది - శ్రీ వైష్ణవ ధర్మ విజ్ఞాన సర్వస్వముగా రూ పొంది, ఆంధ్ర మహాజనులకు బ్రహ్మానంద సంధాయకము కాఁగలదు.

మా పర్యవేక్షణలో ఇంతకుమున్ను వెలువడిన శ్రీ రామా నుజ కీర్తి కౌముది - మొదటి భాగము పండితులకే గాక, సహృద యులు - రసజ్ఞులు నగు పాఠక మహాశయు లెల్లఱకు సంతృప్తిఁ గల్గించినట్లు గుర్తించి, మే మెంతయు సంతసించుచున్నాము.

ఇవు డిది విదియ. ఈ రెండవ కళలో - సుప్రసిద్ధు లైన కవి పండితులచే సంతరింపఁబడిన ఆఱు విశిష్ట రచనలు పొందుపఱుపఁ బడినవి. కావున, ఇదియు - చతుర పాఠక చకోరములకు తుష్టిని, పుష్టిని చేకూర్చ గలదనియే సంభావింతుము.

— ప్రకాశకులు

విషయానుక్రమణిక

౧. శ్రీ వేంకటేశ్వర స్తవ రాజము 1.

డాక్టర్ : వానమామలై వరదాచార్యులు

౨. భాగవత మత వైభవము 17.

శ్రీమాన్ ని. కం. గో. శ్రీభాష్యకారాచార్యులు

భగవంతుడు - భాగవతులు

భాగవత లక్షణము

భగవద్భక్తి విహీనుల లక్షణము

మత శబ్దార్థము

పాంచరాత్ర మతమే భాగవత మతము

భాగవత మత వైశిష్ట్యము

భాగవతులు - భక్తి మార్గములు

భాగవతుల వైశిష్ట్యము

3. మోక్ష సాధనములు - ప్రపత్తి దర్శనము 33

శ్రీమాన్ చెలమచెర్ల రంగాచార్యులు

పురుషార్థ చతుష్టయము

కర్మ యోగము

జ్ఞాన యోగము

భక్తి యోగము

ప్రపత్తి యోగము

ప్రపత్తి - ఆర్చావతారము

౪. పన్నిద్ద రాళ్వారులు - నాలాయిర దివ్య ప్రబంధము 70

శ్రీమాన్ ధనకుధరం వరదాచార్యులు

ప్రణామాంజలి

ఆళ్వారులు - పరమార్థము

ఆళ్వారుల వైశిష్ట్యము
ఆళ్వారుల రచనా వ్యాసంగము

౫. ఆళ్వారుల భక్తి సిద్ధాంత ప్రాశస్త్యము 98_120

డాక్టర్ : జి. టి. గోపాలకృష్ణ నాయుడు

ఆళ్వారుల తత్త్వ పరిశీలనము
శ్రీ విశిష్టాద్వైత సిద్ధాంత బీజములు
ఆళ్వారుల తత్త్వ సిద్ధాంతము
ఆళ్వారులు - తత్త్వ శాస్త్రము
ఆళ్వారుల శ్రీసూక్తులు
నిగమనము

౬. శ్రీ విష్ణుచిత్తుల కవితా వైశిష్ట్యము 121_155

డాక్టర్ : పుట్టపర్తి నారాయణాచార్యులు

పరిచయము
విష్ణు చిత్తుల వైశిష్ట్యము
పెద్ద తనము
అవతారము
కాల నిర్ణయము
స్వామి సేవా కైంకర్యము
విశేషణములు - విశేషములు
శైందమిళము
సెల్వనంబి యభిమానము
భగవ దనుగ్రహము
తిరుమంత్ర ద్వయ చరమములు -
విష్ణు సహస్ర నామము
సుగుణములు

పక్షపాతము
విశిష్ట విశేషము
వాత్సల్య భావములు
భాషా సౌందర్యము
అలంకారములు
శృంగారము
ముక్తకములు
వర్ణన విశేషములు
పుణ్య భూమి
భక్త్యావేశము
ప్రేమ భక్తి
యశోదమ్మ భావనలు
గోపికలు – గోపకులు
గోపాల కృష్ణుడు
వేణు గానము
ఉపదేశములు - సందేశములు
వేణు గాన మాధుర్యము - కవితా గాన మాధుర్యము



శ్రీ పద్మావతి

శ్రీ వేంకటాచలపతి

శ్రీ వేంకటేశ్వర స్తవ రాజము

మహాకవి

వాచస్పతి - కళాప్రపూర్ణ

డాక్టర్ : వానమామలై వరదాచార్యులు

—❋—

శ్రీకర శేషశైల వర శృంగ తటోద్భవ భక్త కల్పనా
నోకహ ! సుస్మితాంచిత మనోజ్ఞ ప్రసన్న కృపావలోకనా
నేక సుమాభిరామ ! యఘ నిర్హర ణాభయ హస్త పర్ణ ! ది
వ్యాకృతి ! దాస వాంఛిత నిజాంఘ్రి ఫల ప్రద ! వేంకటేశ్వరా !

శ్రీ లక్ష్మీ రుచిరాననోత్పల శశీ ! శ్రీవత్స చిహ్నాంకితా !
నీలాంబోధి మనోజ్ఞ గాత్ర విలస న్నీ రేజ పత్రేక్షణా !
బాలార్క ప్రతిభా సమాన వద నాపధ్వాంత నిర్వాపణా !
త్రైలోక్యాభయ దాన భద్ర కర ముద్రా ! వేంకటాద్రి ప్రభో !

శ్రీ రమణీ మణి ప్రణయ చిత్త సరోరుహ భృంగ ! మార వి
స్ఫార ధనుర్విముక్త శత పత్ర ప్రవర్ష దపాంగ ! భక్తి కూ
పార నిమగ్న చిత్త నిజ భక్త వరేక్షణ చాతకోల్లస
న్నీరద సుందరాంగ ! రమణీయ కళాంగజ ! వేంకటేశ్వరా !

శ్రీ దయితా మనోహర ! విశిష్ట గతి న్నిను బాడు నా చతు
ర్వేద నినాదముల్ విపుల విశ్రుత దార్శనిక ప్రమాణ సం
వాదములున్ జతుర్ముఖ శివ ప్రముఖాఖిల భక్తకోటి మీ
పాదములే శరణ్య మని పల్కుచు నున్నవి వేంకటేశ్వరా !

నీదు పదమ్ములుం గడుగు నీరము లౌటనె కాదె గంగ బ్ర
హ్మాది సురల్ నుతింప, గరళాశనుఁ డౌదలఁ దాల్చ, గల్మష
చ్ఛేదకమై, భగీరథ విశిష్ట తపః ఫల సారమై, ప్రజా
మోదకరంబునై, సగర ముక్తిదమై మను వేంకటేశ్వరా !

శ్రీ ధరణీ మనోభవ ! యశేషత నిన్నొనియాడ నోడరే !
వేద పురాణ శాస్త్ర కృతి వీథుల శర్వ పితామహాదులం
చే దిగు లందనేల ? జల మెల్లయుఁ ద్రాపక నీదు పాద గం
గోదక మాత్మ తర్పమును నోసరఁ జేయదె వేంకటేశ్వరా !

పాద యుగంబు కల్ప తరు పల్లవ పుష్ప కృతంబు - స్వచ్ఛ గం
గోదక సన్నిధంద కృత యోగి జనేక్షణ భృంగ సమ్మదో
త్పాద కరంబు - నిత్య నిజ భక్త మహోగ్ర భవాబ్ధి తారక
శ్రీదవహిత్ర యుగ్మ మనఁ జెల్వమరున్ ధర వేంకటేశ్వరా !

సుందర రూప ! నీదు పద శోభల గ్రోలెడి కంటి పాప లిం
కెంద రవేమి జెప్పినను నెందును గాంచవు ! తల్లి చన్నులన్
విందులు గ్రోలు పాప లవి వీడు మటన్నను నేడ్వకుండగా
నుందురె ! తావకాంఘ్రి విడ నొప్పదు నా మది వేంకటేశ్వరా !

దివి భువులం బద ద్వయ మితిం దగ గొల్చు త్రివిక్రమాకృతీ !
భవ దమలాంఘ్రి యుగ్మమును బాయక కొల్చెడి భక్తకోటి, వై
భవ యుత భుక్తి ముక్తు లన బాణితలామలకంబులై చనున్
రవి శశి దివ్య దీధితుల రాజిల కుండునె వేంకటేశ్వరా !

నవ సంధ్యారుణ శోభలం బదము క్రిందం ద్రొక్కు - సుస్నిగ్ధ వై
రవ నీలాంబుజముల్ పదాల బడుచున్ రాజేయు — నక్షత్ర వై
భవ సర్వస్వము గోట మీటు నని మీ భవ్యాంఘ్రికిన్ దృష్టి దో
ష వినుర్మక్తి కీడు న్నివాళి మణి భూషల్ వేంకటాద్రి ప్రభో !

హరి యుష్మ న్నృదు గుల్భ యుగ్మ రమణీ యాకార రేఖాద్యుతుల్
హరియించున్ హరి నీల సన్మణి మనోహారి ప్రభా పూరమున్
మొఱయించున్ సుమరాళ మంజుల గుణామోఘ శ్రుతుల్, చారు నూ
పుర మంజీర విభూషణ ధ్వనుల నెప్డున్ వేంకటాద్రి ప్రభో !

కమఠమ్మైన మంథర నగ మ్మిటు జంఘిక లంఘ్రు లంటుచున్
క్రమ గతి మంథన మ్మొలయగా జనియించు సుధా రసమ్ము నా
సమర ఝరిన్ సృజింప కనకాంబర డంబర చారుతాబిలో
సుమ శర ముద్దరమ్ము లన శోభిలుచున్నవి వేంకటేశ్వరా !

శ్రీసతి తావకీన మృదు శ్రీపద సేవ లొనర్ప నేర్పుమై
నోసరకన్ బదాబ్జముల నొత్తగ జంఘులపై మనోజ్ఞతన్
భాసిలు తత్సతీ పరమ పావన దివ్య కరారుణాంగుళుల్
భాసుర మేఘు సంగతులఁ బర్వు తటిద్గతి వేంకటేశ్వరా !

కోమల గూఢ జత్రువులకున్ బయి నొప్పెసలారు నూరువుల్
శ్రీ మహితంబులై మఱియు శ్రీ లలనా సహితంబులున్ స్ఫుర
ద్భూ మహిళా యుతం బయి విభూతులు రెంటికి నీ వొకండవే
స్వామి వటంచు ని భ్భువిని చాటుచు నుండెను వేంకటేశ్వరా !

ఊర్వశి తావకీన రుచిరోరు తటమ్మున బుట్టుటంగదా
సర్వ జగంబులున్ బొగడు ! చక్కని చుక్క యనన్ వెలింగె ! దు
ర్ధర్వము మీర రంభ తమ కాళులకున్ సరిరా దలంచి యీ
యుర్వి శిరమ్ము క్రిం దగుచు నొప్పగ నిల్చెను వేంకటేశ్వరా !

ప్రావృ ట్కాల విసీల నీరద శరీరా ! తార్క్ష్య పృష్ఠోపరిన్
శ్రీ వామామణి నంకమం దిడి నభ స్నీమం బ్రయాణించుచోన్
నావర్ణాభరణా ప్తహీర సవిధాంచ స్నీల రత్నాకృతిన్
సేవింతున్ మహనీయ విగ్రహు నినున్ శ్రీ వేంకటాద్రి ప్రభో !

విష్ణు కళా ! త్వదీయ కటి విశ్వ విహార సమస్త భూత వ
రిష్ణు జీవకోటి పరివేష్టిత రాజ దజాండ పిండ మం
ధ్రోష్ణ కరంబు హాటక సముజ్జ్వల వర్ణ దుకూల కాంతి భా
జిష్ణు మటంచు స్వాంతమున జింతన సేసెద వేంకటేశ్వరా !

హరి నీలాభ మృ దూదరావని గభీ రావ ర్త నాభి ప్రహ్లాదాం
తర సంజాత మనోహరాబ్జ సుఖ సద్మం బందు వా గ్భ ర్త బం
భరమై వేద మరందపాన రతి నున్మత్తుండునై నేయు సు
స్వర సామ ప్రతితిం దృప్తి గాంతువె పరేశా ! వేంకటాద్రి ప్రభ

కాస్తుభ రత్న చంద్ర సువికాసకమై, సరస ప్రపూర్ణమై,
నిస్తుల హీర మా క్తిక వినిర్మిత నిర్మల హార పూరమై
శ స్న నవాంబుద ద్యుతి విసారి భవ ద్గురు వక్ష పీఠి దా
విస్తృతి వెల్గ నబ్ధి యని వీడదు నిన్ రమ వేంకటేశ్వరా !

అతులిత రామణీయక మహార్ణవమందున బుట్టి, రత్న సం
తతులను జుట్టి, లక్ష్మి కయిదండల నండగ నుండి, వేద సం
గతి గొను నీ గళంబు వర కంబువుకే సతతంబు సద్గుణ
ప్రతతులఁ జెప్పుచుం బ్రణవ పాతము నేర్పదె వేంకటేశ్వరా !

శ్రీప ! స్వభ క్త మట్పద సుసేవ్య భవ ద్వదనారవింద సం
దీపిత మంజులాధరము - నిస్తుల భోగ రమానురాగ ని
క్షేపము - దంత పంక్తులు విశిష్ట శుచిస్మిత కుంద కుట్మలా
క్షేపక కాంతి నాశ్రితు లసిల్ గుటిరుల్ దునుమున్ రమాధవా

భాసుర భ్రూ యుగమ్మ్ సుమ బాణుని దివ్య శరాసనమ్మ్రుగా
నాసికయున్ దరస్మితము నాట్య దపాంగము ల య్యనంగ బా
ణాసన ముక్త చంపక సుహార కృతార్జున మల్లి కాంబుజ
ప్రాసములై జగ న్నయన పర్వములై మను వేంకటేశ్వరా !

సీ టగు పద్మరాగ హరి నీల హరి ణ్మణి హీర తార సత్
కూట మహోజ్వలార్క మణి గుంఫితమై, పదియారు వన్నె మే లో
హాటక రత్న దీప్తి దనరారు కిరీటము ప్రాఙ్ముగాగ్ర స
ద్వాటి జయించు భాస్కరుని భాతి వెలుంగును వేంకటేశ్వరా !

నిం డగు చెల్వపుం గొలని నీరజ శోభల నొప్ప నేత్రముల్
మండిత రత్న దర్పణ సమద్యుతి గ్రాలు కపోల పాలి నీ
రెండలు గాయ, కర్ణ భృత హీర మసార రుచి ప్రపూర న
త్కుండల యుగ్మ మర్యమ విధు ప్రభ లీనెడి వేంకటేశ్వరా !

నీల కళా విలాస ముఖ నీరజ ! చందన మార్ద్ర బిందు శో
భా లలితోర్ధ్వపుండ్ర యుత ఫాల మపార కృపా రసాబ్ధిలో
బాల శశాంకుడై యెసగఁ బల్మరు నాట్యము లాడు ముంగురుల్
మేలము లాడు చంద్ర రత మేఘు చయమ్మును వేంకటేశ్వరా !

మానుగ శేష పీఠమున మా సతి, భూ సతి చేరి కొల్వగా
జానువు లంటు హస్తములు చారు మదేభ కరాభ శోభలన్
గానబడన్ ద్వదీయ సువికాస విలాస వరావతారముల్
మానస గోచరమ్ము లగు మార్గము జూపవె వేంకటేశ్వరా !

బాహువు లొప్ప జేవరకు పంచ శిరోరగ దివ్య శోభకున్
బోహదమై, వినీల మృదు దో ర్యుగమందున శంఖ చక్రముల్
మోహన శ్రీ కరాంగుళుల ముద్దిడు జానువు లంట ప్రేలు మీ
బాహు యుగమ్మునం దమరుఁ బద్మ గదాదులు వేంకటేశ్వరా !

సురుచిర దృ క్సరోజముల సూన శరుం బ్రసవించు మించు శ్రీ
హరి యగు శ్రీనివాసు ప్రణయామృత పూర్ణ మన స్సరోవర
స్ఫురిత తరంగ డోలికల సొంపుగ దూగెడు రాజ హంసి నీ
దరి యలిమేలు మంగఁ గొని దర్శన మీయవె వేంకటేశ్వరా !

పరమ పదమ్మునం దలర భక్త జనాళికి దర్శనమ్మొ దు
ష్కర మగు ధారుణిన్ వసతిగాఁ గొన నిర్జర పాళి దూరమా
సుర నర తిర్యగాళి దయఁ జూడగ నుండెద నందుబాటులోఁ
దిరుమల నంచు నీ కొలువు దీర్చితివా యిట వేంకటేశ్వరా !

తానక దివ్య మంగళ సుధామయ విగ్రహ దర్శనమ్మునన్
భావనమయ్యె జన్మ; భవ బంధము లూడె; మహోఘవారి కీ
నావ లభించె; ఘోర మగు నారక బాధ నశించె; ముక్తికిన్
ద్రోవ జనించె; నిన్ను కను దొన్నెలఁ ద్రావెద వేంకటేశ్వరా !

సలువ శయింప సోమకుఁడు నాలుగు వేదములన్ హరించి, యా
జలనిధిలోన దాగిన ఋషభ మ్మయి వానినిఁ బట్టి చంపి మి
న్నక లజ్జన కిచ్చినా వటులె కోల్పడు జ్ఞానము నా కొసంగి, సం
సరణ మహాబ్ధి నుత్తరణ శక్తి నొసంగవె వేంకటేశ్వరా !

అమర జనావనార్థము మహామృతపాన మొసంగ వార్ధిలో
కమఠమ వౌచు మందర నగమ్మును మూపున దాల్చినాఁడ వీ
కుమతియు నాది కర్మ కుల గోత్ర భరమ్ము కరమ్ము నోర్చి న
న్నమరుని జేసి బ్రోవ బరువా ! కరుణామయ వేంకటేశ్వరా !

అదివరాహ రూపమున నబ్ధిని మున్ని కలంగునట్టి యి
మ్మేదిని ముస్తె చందమున మేదుర దంష్ట్రిక నుద్ధరించినా
వే ! దురితాబ్ధిలో మునిఁగి యెంతయు వందురుచుంటి నన్ను నో
శ్రీదయితా ! సముద్ధరణఁ జేయవె పాయక వేంకటేశ్వరా !

నరసింహాకృతితో హిరణ్య కశిపున్ నాశంబు గావించి, శ్రీ
వర ప్రహ్లాదుని తావకీన పద సద్భక్తాగ్ర గణ్యున్ దయా
పరతన్ బ్రోచితి, వాసుకీ ప్రకృతి తద్భంగిన్ శ్రమ ల్వెల్లుఁ ద్వ
చ్చరణాహ్లాదుని నన్ను బ్రోవ వదె శ్రీశా ! వేంకటాద్రి ప్రభో !

అఁ బలిచక్రవర్తి త్రిపదావని నీయఁ ద్రివిష్టపమ్ములన్
గొలిచి త్రివిక్రమాకృతి నకుంఠ గతిన్ ద దహంకృతిన్ రసా
తల మడుగార ద్రొక్కితివి త ద్దత మామక దుష్ట గర్వమున్
బలిగొని నీ పద మ్మొనగి పావను జేయవె వేంకటేశ్వరా !

పరశువు కేల దాలిచి యపార విపక్ష కుల క్షయమ్ముగా
నిరువది యొక్కమారులు నిహీన నృపాలుర చెండి యి వ్వసుం
ధరను జయించి మించితివి; తద్గతి నా మతి నాక్రమించి స
చ్చరితము రూపు మాపు రిపు షట్కము ద్రుంపవె వేంకటేశ్వరా !

దశవదనుండు జానకిని తస్కరణ మ్మొనరించి యేగ నా
పశువును సంహరించి సతి బంధ విముక్తి నొనర్చినా వహో
దశరథ రామ ! నన్నటులె దర్ప మెలర్ప దశేంద్రియమ్ములున్
వశ మొనరించె నేల భవబంధము బాపవు వేంకటేశ్వరా !

కురుసభ దున్న సేనుఁ డతి క్రూరతఁ జీరలు లాగువేళ దు
ర్భర గురు దుఃఖ తప్త యయి ద్రౌపది కృష్ణ యటంచు వేడ నం
బరముల నక్షయ మ్మొనగి మానము గాచితి వట్టులే జరా
మరణ భయాతిరిక్త తను మండితు జేయవె వేంకటేశ్వరా !

సర్వజ్ఞుండవు సర్వసాక్షివయి యో స్వామీ ! జగన్నాథ ! యీ
యుర్విన్ ధర్మపథమ్ములన్ నడపగా నూహించి భక్తాళికిన్
నిర్వాణమ్ము నొసంగి, సర్వ సమతన్ నిర్మించి బుద్ధాకృతిన్
నిర్వేదమ్మును బాపి యేలితివి తండ్రీ ! వేంకటాద్రి ప్రభో !

కలిని కరాళ హేతిఁ గొని కాపురుషాధమ జాతు లందరన్
బలిగొనఁ గల్కిరూపి వయి వైదిక ధర్మము నుద్ధరింపఁగా
వెలసెద వంట నా హృదయవీథుల నల్లె యధర్మ తండముల్
కలతలు వెట్టు ; వాని నెటు ఖండనఁ జేతువొ వేంకటేశ్వరా !

ఫల జల పత్ర పుష్ప సమవాయము గైకొని పూజ సేయఁగా
దలఁచి సుపర్ణ నిష్క రజత ప్రవిదత్త ధనాలి గాదె లో
పల నిడి నీ ఋణమ్ములను బాపఁగ నెంచితి భూసతీ రమా
లలనలు నీదు భార్య లని లక్ష్య మొనర్పక వేంకటేశ్వరా !

ధన గర్వంబున కొన్ని నాళ్ళు, యువతీ తారుణ్య భోగాఢ్య యౌ
వన గర్వంబున కొన్ని నాళ్లు, పదవీ ప్రాశస్త్య గర్వాహతిన్
ఘన విద్యా కుల పుత్ర మిత్ర వసుధా గర్వాంధతన్ మిమ్ము నే
గనులం గానక యుంటి నస్థిర సుఖానుప్రాప్తి శేషాద్రిపా !

భాగ్యము స్వప్న సమ్మిత జపా కలికాకృతి నేగఁ, జిత్త చాం
చల్యముఁ గొల్పి యౌవన వసంతమునున్ మధుపాన మత్త తా
తుల్యత నేఁగె, వార్ధకము దోచె, నొక క్షణ మాత్ర పుష్ప ని
ర్మాల్యము రీతి ని న్నొలుచు మా తరుణ మెన్నఁది వేంకటేశ్వరా !

కలిలో నీ సరి దైవతం బెచటనుం గానంగ రాదంచు భూ
వలయం బంతట డప్ప గట్టుకొని శేవం జాటగా నేల ? తి
ర్మల సరోన్నత పీఠ మీ యనతి ప్రేమన్ భక్త లోకంబు నీ
చరణాబ్జమ్ముల స్వర్ణ వృష్టి గురిపించన్ వేంకటాద్రి ప్రభో !

కొమ్మలపై రమించు పెను కోతి మన మ్మతి చంచలమ్ము, గే
హ మ్మరిషట్క వర్గమున కౌర దశేంద్రియ సంతతుల్ లులా
యమ్ములు పల్వ లాభ విషయాల్ప సుఖమ్మున మున్న నేగి, మా
ర్గమ్మును దప్ప నెప్పగిది గమ్యము జేర్తువొ వేంకటేశ్వరా !

పుస్తక మంటు శబ్దముల పోలిక భూతము లొప్ప శబ్ద వి
న్యస్తములైన యర్థము లనన్ సకలాత్మలు వెల్గ నర్థ భృ
న్నిస్తుల మోద కారక వినిర్మల మూర సరూప మొందు త
త్పుస్తక సార మీవె యని బుద్ధి గ్రహింతును వేంకటేశ్వరా !

ఏ నొక ప్రక్క నా దనెడి డెల్లయు నిం కొక ప్రక్కనుంతు నే
దైన వరింపు మీ వనుట లర్థనుఁ డెంతో వివేక దృష్టితో
నే నను నీవె నాకు వరణీయుఁడ వంచు జయమ్ము గాంచె న
న్నేనును నిన్నె కోరి వరియింతు జయమ్మును వేంకటేశ్వరా !

లీల యశోద స్తాళ్ళకు బలెం దమి పోతన స్రేళ్ళకున్ స్రబం
ధాలకు భక్తి కట్టుబడినాడవు, త్యాగయ భావ రాగ తా
నాలకునున్ వశుండ వయినాఁడవు, తద్గతి నాకు సాహితీ
లీలలు గాన డోలలును లే వెటు మెచ్చెదో వేంకటేశ్వరా !

కృపణుఁడు క్రూరచిత్తుఁడు నికృష్టచరిత్రుఁడు దుష్ట మిత్రుఁడున్
శ్వపచ క్రియా కలాపుఁ డెటు స తృప గాంచుట లంచు నెంచఁదే
యవుఁడె జనించు వత్స మలినాదిక మాపులు పొట్టఁ బెట్టి స
తృపఁ గని క్షీర వర్షములఁ దృప్తి నొసంగవె వేంకటేశ్వరా !

అణు గత శక్తియే యిటు లజాండమునం బరిణామ శీలమై
బొనరుచు వస్తు జాలమును బొందికగా ఘణువుల్ వికేంద్రతన్
దనర పదార్థ నాశ మగు తత్కృతి కర్తయె లే డటందు చే
తన గత సర్వ నామ పర తత్త్వ మెఱుంగను వేంకటేశ్వరా !

చిలుకకు వన్నె లందముల జిందెడి కన్నులు లేడి కౌర ! కో
కిలలకు గాన మాధురి, శిఖి ప్రకరమ్ముల నాట్య భంగిమల్,
పులికి మనోజ్ఞ చర్మ మిడి పొందిక నందములున్ వివేకమున్
గలిపి మనుష్య జాతి కిడ కాంచరు నిన్ను దలంచ రచ్యుతా !

ప్రకట మృగేక్షణాచల దపాంగ దరస్మిత వాగ్విలాస కృత్
సకల సుఖాలి మచ్చు లిడి సంస్కృతి జాలము లైన మానస
మ్మొక్క విహగమ్ముగా భ్రమల నొంది వలం దగఁ జిక్కి యేడ్చు ద
ర్పక మృగయావధీరితుఁడ, పాహి కృపార్ణవ ! వేంకటేశ్వరా !

నిను నీలాంబుద దేహధారు వికస స్మేర పత్రేక్షణున్
ఘనమాలాధరు శంఖ చక్ర కరు శ్రీవత్సాంకు పీతాంబరున్
ముని హృద్గోచరు మా మనోహరు కృపా పూర్ణావతారున్ సదా
కనులన్ మూసిన విప్పినన్ గనబడంగానిమ్ము శేషాద్రిపా !

తల్లియు తండ్రి యన్నయును దైవము తోడును నీడ సద్గురుం
డెల్లరు నీవ యంటి, నెద నెల్ల పుడున్ నిను నమ్మియుంటి, నీ
కల్ల ప్రపంచమందుఁ గల కారణ బాంధవులన్ ద్యజించి, నీ
సల్లలితారుణాబ్జ పద సన్నిధిఁ గంటిని వేంకటేశ్వరా !

శ్రీకర ! శ్రీనివాస ! సరసీరుహ లోచన ! పాప మోచనా !
ప్రాకట వైభవా ! వరద ! భక్త జనావన ! లోక పావనా !
ఓ కరుణా సముద్ర ! పురుషో త్తమ ! మాధవ ! దీన బాంధవా !
నా కెపు డిట్లు నిన్ బొగడు నాల్క నొసంగుము వేంకటేశ్వరా !

నీదు కృపా కటాక్ష రస నిర్భర వృష్టి నపేక్ష నేయకే
నా దగు పుణ్య కర్మములె నాక మహోసుఖ సద్విశేష న
మ్మోదము లొందజేయు నని బుద్ధి దలంచితి వృష్టి లేమి ని
మ్మోదిని ద్రాక్ష వృక్ష మిడ, మించి ఫలించునె వేంకటేశ్వరా !

ఏకాంతంబున నేను నీకయి ప్రియా ! యెంతే నిరీక్షింపఁగా
వీకన్ వచ్చిరి చోరు లారుగురు నా విత్తమ్ములం దోచఁగా
నేకాకికిన్ హరి ! నేను చచ్చితిని నీవే దిక్కనన్ నాదు యే
ర్పాక్షించి బిరాన వచ్చితివి నీవై వేంకటాద్రి ప్రభో !

భువి యుద్యానము, భూత కోటి తరువుల్, పూ లంతరంగమ్ములే
చవు లూరించు మరంద మీవె, యది యాస్వాదింతు తేం కొల్లల భ
క్త వరేణ్యుల్, పసరాకులం దినెడి నింద్యంబైన కీటంబు నే
ను, విహీనేంద్రియ సౌఖ్య కామి నయి యుందున్ వేంకటాద్రి ప్రభో !

జగ మొక నాటకం బటులె చంద్రుఁడు సూర్యుఁడు దివ్వెటీలు, దే
వగలు తీయు వేయు తెర పడతు, లాత్మలు పాత్ర లీ శరీ
ర గతులు వేష ధారణలు, రంగ ప్రవేశ విని ష్క్రమాదు లె
న్నగ జననావసానములు, నాటక మాడెదు వేంకటేశ్వరా !

క్షణ సంసార సుఖమ్ము నెంచ నొక మేఘ చ్ఛాయ, ఆద్యంత జీ
వనమో ఛిద్ర ఘటాంబుపూర, మిక లబ్ధ స్వల్ప సంతృప్తియో
ఘన వహ్నిం బడ వ్రేల్చు నాజ్యహుతి దుర్గర్వావహతిం ద్రెళ్ళు యీ
వనమో స్వప్నము, వార్థక మ్మరుచి, దేవా! వేంకటాద్రి ప్రభో!

తావక పాద వారి రుహ దాస్య విరోధులు తల్లి దండ్రులున్
బావనులౌ గురూ త్తములు భ్రాతలు బంధువులేని త్యాజ్యులే
సూవె యటం చనున్ భరతసూరి - సురారి కుమారుఁడున్ - బలి
క్ష్మావిభుఁడున్ - విభీషణుఁడు సారె వచింతురు వేంకటేశ్వరా!

ధరణి జనాలి సేవ కవతార మటుల్ ప్రథముండు పొల్చుఁ దా
బరుల స్వలాభసిద్ధికి సపర్యల దేల్చు ద్వితీయుఁ డన్యులన్
జెరిచి నగున్ దృతీయుఁ డొరు జెండు నసూయగుఁడై తురీయుఁడే
బరులను నొంచి నేఁ జెడెడి పంచముఁడన్ హరి! వేంకటేశ్వరా!

భ్రాంతాపాంగవిలాసహాససుమమై, భామారతస్వల్ప సౌ
ఖ్యాంతాపత్య ఫలాన్వితం బయి, యురోజాద్రి ర్వయోపేతమా
కాంతా మోహన రూప యౌవన లతా కాంతార మధ్యంబునన్
భ్రాంతిం జెందె మనః ప్లవంగ మెటు లప్పా! వేంకటాద్రి ప్రభూ!

సకల క్రియా కలాపముల సాక్షివి నీ వని కొంద రందు రే
యొక తృణ మేనియుం గదల నోపదు కర్తవు నీవు గాక యం
చొకరు వచింత్రు సాక్షి వయి యొప్పదొ కర్తవొ! నీరు వార్ధినుం
డి కదలకుండ, నాపగల నిత్యము పారును వేంకటేశ్వరా!

క్షీరములోని నీర మటు జేరి వసింతును నేను తావకా
కారములోన దుగములఁ గన్పడకుండఁగ వెల్లు వెన్నవై
వారక మామకాత్మ నొగి వర్తిలుచుండగ నీవునుం దిటుల్
శ్రీ రమణా! సమైక్య గతిఁ జేరి వసింతము వేంకటేశ్వరా!

నిను గనకున్న నా మనసు నిల్వదు — నా మది నిల్వకున్న నిన్
గనుట సు దుర్లభం బగును — కావున, పెండిలి గామి పిచ్చి
దన నిక పిచ్చి పోని దెటు లా నొక పెండిలినాఁ జెలంగఁ నీ
కనికర మిడ్డ హేతుకముగా వెలయింపుము వేంకటేశ్వరా !

నన్ను దురాత్మునిం దగ నొనర్చెడి ఐహిక భోగ భాగ్య వి
త్తోన్నతి తావకీన కరుణోల్లసితంబె యటంచు నెంతు నో
యన్నా ! త్వదీయ త్వ త్కృప నెదం బరికించిన నన్య హానికై
నిన్ను ప్రవించునట్టి యతి వృష్టిగ నెంచను వేంకటేశ్వరా !

నిను గని పారవశ్యమున నిస్తుల మోక్ష సుఖానుభూతితో
మని యజరామరంబుగ సమ స్థితి నుండెడి యాత్మ యిట్టు లీ
తనువును గూడి తాను భవతాపము నొందిన యట్లు నొచ్చెడిన్
ఇనుమును గూడి అగ్ని భరియించును భూతల వేంకటేశ్వరా !

నా తాపత్రయ మార్చు మేఘమవొ ? యన్నా ! నాదు కన్దో
శీతా నీల కలా ప్రకాశ మిడు స చ్చిద్రత్న దీపమ్ములవో ?
చేతోమోద మొసంగు దైవ ప్రకృతి శ్రీ ల్మేల్కొన జ్ఞేయు
స్ఫీతా గుర్వసితాభ్ర ధూపమవొ ? దీ ప్తిన్ వేంకటాద్రిప్రభ

లలి నదస ద్వివేక సువిలాస మతిన్ హృదయస్థ భావనల్
బలుకఁగఁ బూర్ణ శక్తి గల వాక్కును నాత్మ ప్రయోజనాలి
పొలయఁగఁ గూర్చ నింద్రియ సమున్నతి నిచ్చిన నేని నే నినున్
దలఁప నుతింప నర్చన మొనర్పను శ్రీకర ! వేంకటేశ్వరా !

త్రుప్ప కఠోర లోహమును రూపరజెసెడినట్లు తా నిలన్
తప్ప మనుష్య దేహమును తప్పక నాశము నొందజేయు నీ
ముప్పులు దప్ప నీ దగు నమూల్య కృపారసవారిఁ దేల్చి న
న్నెప్పుడు తప్ప త్రోవలకు నేగఁగ నీయకు వేంకటేశ్వరా !

పెక్కు-ర నన్య దై వముల వేమరు వేడిన బాధ మేమయా ?
నిక్కపు బంధ ముక్తి నిడు నిస్తుల దై వము వీవ యంచు నే
మ్రొక్కెద నీకె, నీరు తరుమూలమునం దిడకుండ మూర్ఖతన్
దక్కిన కొమ్మలం దడుప దాన ఫల మ్మెది వేంకటేశ్వరా !

అక్కర రాని లోభి ధన మట్టులు జ్ఞానధనమ్ము గల్గియున్
జక్కని సుప్రతాచరణ సాధన కై వినియోగ పెట్టమిన్
లెక్కకు వచ్చునే ప్రజకు నేర్పగఁగాక, తలల్ ధరించు పూల్
ముక్కులు సౌరభాంబు నిధి మున్గి సుఖించును వేంకటేశ్వరా !

గోవిందా ! హరి ! వడ్డికాసుల దొరా ! కో ట్యర్క సంకాశ ! ఓ
గోవిందా! హరి ! నిత్య మాపదల మ్రొక్కుల్ వొందు వెంకన్న ! ఓ
గోవిందా ! హరి యేడుకొండలదొరా ! కో టొక్క దండమ్ములో
మా విందా హరి ! శ్రీనివాస ! యలమే ల్మంగేశ ! శేషాద్రిపా !

స్వామి ! త్వదీయ దర్శనము సల్పుట కై ప్రజ లక్షలాది వి
శ్రామము లేక, యాలయపు ప్రాంగణ వీథుల రేఁ బవళ్ళు నో
కామిత దాత ! మా కనులు కాచెను కానరావె మా
నోముల పంట యంచు నిను నో రరుగన్ నుతి సేయు వేంకటా !

మేదిని వెల్గు వేల్పులకు మేరువు పూనవు నీవె యీట నే
నీదు బలమ్ము జూచుకొని నీచ కలిన్ లయ కాలునిన్ మదో
న్మాదుని దుర్విధిన్ బిలుకు మార్చఁగ నెంచెద, నీదు దాసుపై
కా దనబోక, సుంత యనుకంప వహింపవె వేంకటేశ్వరా !

రవ్వయు నేను నా యెడద రాజిలుచున్న యభీప్సితార్థముల్
మవ్వపు భక్తి మీ మును సమర్పణ సేయక ముందె సర్వమున్
నెవ్వగ నే నెరింగితిని నీవు వచింపఁగ నేల యం చిటుల్
నవ్వుచు నున్న యట్లు వదన మ్మగుపించును వేంకటేశ్వరా !

ఉదయమునన్ ప్రగుధారుణత నుర్వి ప్రజావళి సూర్య దృష్టులన్
గొదకొని కర్మ నీరతను నూల్కొనఁ జేయఁగఁ జూచి యట్లుతే
సదమల శీత దృష్టులను చంద్ర కళాళుల గాంచి నిద్దురన్
బొదవఁగజేసి నీ ప్రజలఁ బ్రోచుచు నుండెదు వేంకటేశ్వరా !

మనికి యశాశ్వత మ్మగుతి ప్రమాద కరంబులు నింద్రియమ్ములున్
మన మతి చంచలంబు, మతి మాన్య వివేక విహీన, మట్లు చే
తనమె యనాది కర్మ సముదాయ నిబద్ధము స్వామి ! నీ వినా
యనితర సాధ్య మీ జడ జనావన కార్యము వేంకటేశ్వరా !

ధర నొక కల్ప మేగిన సుధారసపానవిమత్త చిత్తులౌ
సరసిజ గర్భ శక్ర ప్రదశ ప్రభృతుల్ నశియింప్రతుగాని, నీ
చరణ సరోరుహస్మృతి రసాయన మత్తు లనన్య చిత్తుల
ప్పరమ పదంబునం దెపుడు భద్రత నుందురు వేంకటేశ్వరా !

'యస్య శరీర మాత్మ' యని, 'యస్య మహీ చ శరీర' మంచు ప్రశ
స్యాస్యమునన్ వచించిన మహా వచనమ్ము ల వన్నియున్ వృథా
హాస్యము లౌనె ? పృథ్వి భవ దంగమె యైన మను, దాననే శిలా
దాస్యము జేయ నీకును ముదావహమాఁగదె వేంకటేశ్వరా !

నే నిను గాంచినంతటనె, నీవు ననుం గృపజూచినంతనే
నేను త్వదీయ నేత్రముల నిల్చితి, నీవును నాదు నేత్రమై
కానఁగనైతి నీ యతుల కారుణికామృతమాను మత్తులో
నే నను మాట లే దగుదు వీవె సమస్తము వేంకటేశ్వరా !

ధనముల నెట్టి వస్తు సముదాయమునుం గొనవచ్చు, ప్రేమ సా
ధనమున సుందరీ పరిణయ ధాత్రిని నేలఁగవచ్చు, గో ఘృతే
ధనముల యజ్ఞ వహ్ని మదిఁ దన్పఁగ వచ్చునుగాని, భక్తి బం
ధనమునఁ దక్క నీవు వసుధన్ వశ మొందవు వేంకటేశ్వరా !

లలి భవదీయ సత్కృపకు లక్ష్యములై రహియించు యాత్మలున్
మెలఁగునె సంసృతిన్ మమత మేకొన, తిర్గి భవాబ్ధి మన్ననే ?
వెలి యయి నట్టి వెన్న పదివేల ప్రయత్నము లాచరించినన్
గలియునె మజ్జగన్ మునిఁగి కన్పడకుండఁగ వేంకటేశ్వరా !

సుర నర తిర్యగాదులు వసుంధరపై నిను జూడ నెంచి యో
హరి ! నిజ నప్త జన్మ సముపార్జిత పుణ్యము లేరి రాశి బో
సిరొ ? వరుసం ఫలాకృతిగ శ్రీపతి ! నిన్ దులఁదూచ, నవ్వియే
గిరులయి నీ నివాసముగ కీర్తి వహించెనొ ? వేంకటేశ్వరా ?

నిను గని నేను నాతృషిత నేత్ర పథమ్ముల హృన్ని వేశమం
దొనరగ ధ్యాన పీఠమున నుంచి వరించి మదాత్మనే సమ
ర్పణ మొనరించినాఁడ నెడఁబాయఁగ న్యాయమె ? దూరమైతి వీ
కనులకు గుండె వీడి చనఁగల్గుదు వెట్టులు ? వేంకటేశ్వరా !

శర్వ పితామహాద్యమర సంతతకిన్ ప్రియమూ రసాయన
మ్మార్వి సుధా రసాభ మయి యుగ్ర జరామయ జన్మ మృత్యు దు
ర్గర్వ మడంచు భేషజము గర్వయ వెచ్చయు లేక తీయనై
నిర్వృతిఁ గూర్చు నౌషధము నీ శుభనామమె వేంకటేశ్వరా !

కలువల చిన్నబుచ్చు మెఱుగౌ కనుదమ్ములఁ జూడ వేలనో ?
జలజములన్ హసించు ముఖచంద్రుని వాక్సుధ జిల్క వేల ? యా
నెలఁతలఁ దన్ని దూకిపడు నీపదతీర్థము నీయ వేల ? నా
తలఁపుల నెప్డు నీ చరణ ధారణ నీయవె వేంకటేశ్వరా !

పాప కలాప సంసరణ పంక ముఖమ్మున బుట్టి వచ్చి, పు
ణ్యాపగలోని కేగి, విమలాంబువులన్ దగ వీడి, కాంతి సం
దీపిత శూన్య సంగతి రతిన్ రవి గాంచి హసించు తమ్మినై
పాపము పుణ్యమున్ గడిగి భక్తి దరించెద వేంకటేశ్వరా !

కోపములో వివేకమును గోల్పడనీక, భయానకమ్ములౌ
యాపదలందు నోపికను నంచిత ధైర్యము నీడనీక, సం
దీపిత సర్వ సంపదల నీ పద భక్తి దొలంగనీక, నా
పాపపు నీవయై యెపుడు పాలన నేయవె వేంకటేశ్వరా !

నిత్యము నీవకీన పద నీరజ దాస్య ముపాస్య మంచు నే
భృత్యుఁ డొనర్చునో యతని భృత్యుల భృత్యుల భృత్య భృత్యుల
ద్భృత్యుల శేణి నంతిమపు భృత్యుఁడ నేఁ దరుమూలమున్ ఫల
మ్మత్యనురాగ దృష్టి విలపాంతములం దిడు వేంకటేశ్వరా !

ఆరయ ష డ్వికార మయమైన శరీరమె నే నటంచునున్
దార సుతా ప మిత్ర వసుధా పశువర్గము నాది యంచు సం
సారము సార యుక్త మని శాశ్వత మంచు దలంచు, నజ్ఞతా
భార మడంచి జ్ఞాన పరిపాక మొసంగవె వేంకటేశ్వరా !

నీ కరుణార్హతన్ గనిన నిక్కపు భక్తియె కాక వేరె యా
వ్యాకరణాది శాస్త్రము లవశ్యములే ? సుమన స్సుధా రుచుల్
లేకయు నీడ నీయక ఫలించకయున్ దులసీమహీరుహా
మ్మాకులతోనె సౌరభము లర్పణ నేయదె వేంకటేశ్వరా !

* * *

ఘోరాజ్ఞాన తమోంధకార మడగన్, గోపాలభక్త్యుత్కట
క్షీరాంభోనిధి పొంగ, జోడశకళా శ్రీల్ మేల్కొనన్, జ్ఞాన కా
సారావాస ప్రసన్న నేత్ర సుమన స్సౌగంధికామోదమై
శ్రీ రామానుజ కీర్తి కౌముది రహించెన్ వేంకటాద్రి ప్రభో !



శ్రీ భగవ ద్రామానుజులు

భాగవతమత వైభవము

'విద్యా ప్రవీణ - ఉభయ వేదాంత మహోదధి'

శ్రీమాన్

నిడమర్తి కందాడ గోవిందరాజ శ్రీభాష్యకారాచార్యులు

—❋—

భగవంతుఁడు - భాగవతులు

భాగవత మత వైభవము అను వాక్యము తిరుమంత్రము[1] వలె పద త్రయముతోఁ గూడి, సమస్తమున దశాక్షర పదమై యొప్పు చున్నది. అందు ముందుగ, భాగవత శబ్దార్థము విచారణీయము. 'భగవతి భక్తాః' అను వ్యుత్పత్తి వలన, భాగవత శబ్దము సిద్ధము. 'భగవతి' అను సప్తమ్యంత పదమునకు 'భగవంతుఁడు' అని యర్థము. ఈ యర్థము ఆ భగవంతుని షడ్గుణైశ్వర్య పరిపూర్ణతను సూచించు చున్నది.

భకారమునకు — పోషించువాఁడు, భరించువాఁడు అను అర్థములు రెండు.

గకారమునకు — కర్మ ఫలములను పొందువాఁడు, ప్రళయమందు జగత్తులను తనలో నిముడ్చుకొనువాఁడు, సృష్టి చేయువాఁడు అని మూఁడర్థములు.[2]

సముదాయమైన భగ శబ్దమునకు } అచట సకల భూతములు వసించు ననియు, ఆ భూతములయందుండువాఁడనియు అర్థము.

---

1. తిరు మంత్ర మనఁగా — అష్టాక్షరీ మహా మంత్రము.

2. "సంభర్తేతి తథా భర్తా భకారోఽర్థ ద్వయాన్వితః
నేతా గమయితా స్రష్టా గకారార్థ స్తథా మునే ।"

— (విష్ణు పురాణము : 6-5-73)

కాఁగా - షడ్గుణైశ్వర్య సంపన్నుఁడు, సకల భూతాధారభూతుఁడు, పరబ్రహ్మయు నగు వాసుదేవునకు - 'భగవాన్' అను శబ్దము వాచ్యము. భగవములు కలవాఁడు భగవానుఁడు. భ, గ, వ - అను అక్షరములకు అర పర్యంతము శక్తి. భగవంతునియందు ముఖ్య వృత్తి చే అర్థ బోధక మగు ఈ శబ్దము - పరావర జ్ఞాన సంపన్నులగు మహాత్ముల యెడ గూడ ఉపచార వృత్తిగ ప్రయోగింపఁబడుచున్నది. భగవానుఁ డనగా - జ్ఞాన శక్తి బల ఐశ్వర్య వీర్య తేజస్సు లను ఆరు గుణములు కలిగి, హేయ గుణములు లేనివాఁడు.* అట్టి నిఖిల హేయ ప్రత్యనీకుఁడు - సమస్త కల్యాణ గుణ విశిష్టుఁడు నగు పరమాత్మయందు భక్తి గలవారు భాగవతులు.

'యద్వా, భగవతా ప్రోక్తం భాగవతం - తచ్చ, తన్మతం చ భాగవత మతమ్.' అనగా - భగవంతునిచే ప్రతిపాదింపఁబడిన జ్ఞానము, శ్రీ పాంచరాత్ర శాస్త్రోదిత భగవ త్స్వరూపారాధనాదికము, తద్వైభవము భాగవత మత మని నిర్వచింపవచ్చు ఇది తాత్పర్యము.

'భగవతి భక్తాః భాగవతాః. తేషాం మతం భాగవత మతమ్.

---

*. "ఐశ్వర్యస్య సమగ్రస్య వీర్యస్య యశసః శ్రియః
జ్ఞాన వైరాగ్యయో శ్చైవ షణ్ణాం భగ ఇతీరయా
వసంతి సర్వ భూతాని భూ తాత్మ న్యఖిలాత్మని
సర్వ భూతే ష్వశేషేషు వకారోఽర్థ స్తతోఽవ్యయః
ఏవ మేష మహాశబ్దో మైత్రేయ భగవానితి
పరమబ్రహ్మభూతస్య వాసుదేవస్య నాన్యగః
తత్ర పూజ్య పదార్థోక్తి పరిభాషా సమన్వితః
శబ్దోఽయం నోపచారేణ అన్యత్ర హ్యుపచారకః
జ్ఞాన శక్తి బలైశ్వర్య వీర్య తేజాం న్యశేషతః
భగవచ్ఛబ్దవాచ్యాని వినా హేయై ర్గుణాదిభిః."

(విష్ణు పురాణము : 6-5-74 శ్లో॥ మొదలు 79 శ్లో॥వఱకు)

తస్య వైభవమ్ భాగవత మత వైభవమ్' అను పరిపూర్ణార్థ బోధక జ్ఞానవైభవము అనుట.

భాగవత లక్షణములు

"న చలతి నిజ ధర్మ వర్ణతో యు
స్సమ మతి రాత్మ సుహృ ద్విపక్ష పక్షే
న హరతి న చ హంతి కించి దుచ్చై
స్సిత మనసం తమవే హి విష్ణు భక్తమ్."

తన కుల ధర్మములను విడువక, స్వ పక్ష – సుహృ త్పక్ష - శత్రు పక్షములందు సమబుద్ధితో ప్రవర్తించుచు, ఇతరుల ద్రవ్యము నపహరింపక, పరులను హింసింపక, స్వచ్ఛ హృదయము కలిగియుండు వాడు భాగవతుడు.

"కలి కలుష మలీన యస్య నాత్మా
విమల మతే ర్మలినీ కృత న్న మేనమ్
మనసి కృత జనార్దనం మనుష్యం
సతత మవే హి హరే రతీవ భక్తమ్."

మనస్సునందు భగవద్భావన గలిగి, కలికాల మాలిన్యముచే నెవ్వని మనస్సు మలినము గాక, స్వచ్ఛమైన మనస్సు గలిగి, మోహ రహితుడగువాడు భాగవతుడు.

"స్ఫటిక గిరి శిలామలః క్వ విష్ణుః
మనసి నృణాం క్వ చ మత్సరాది దోషః
న హి తుహిన మయూఖ రశ్మి పుంజే
భవతి హుతాశన దీప్తిజః ప్రతాపః."

ఎవని మనస్సునందు స్వచ్ఛ మగు స్ఫటికమువలె నిర్మలుడైన విష్ణువు వసించునో, వానికి మాత్సర్యాది దోషము లంటవు. సూర్యుని తేజస్సు ముందు చీకటి చేరజాలదుగదా ! చంద్రకాంతిచే చల్లగ నుండుచోట, అగ్నివలనఁ గలుగు తాప ముండదుగదా !

"విమల మతి రమత్సరః ప్రశాంత
శ్శుచి చరితోఽఖిల సత్త్వ మిత్రభూతః
ప్రియ హిత వచనోఽనసూన మాయో
వసతి పదా తస్య వాసుదేవః."

ఎవఁడు నిర్మలమైన మనస్సు గలిగి, మాత్సర్య రహితుఁడై శాంతుఁడై, పవిత్ర చరిత్ర గలవాఁడై, సత్త్వవర్త గలిగి, సమస్త భూత మిత్రుఁడై, ప్రియ హిత వాక్కులు గలిగి, అహంకారము, మాయయు లేనివాఁడై యుండునో - వానియందు భగవంతుఁడు ఎల్ల వుడును వసించుచుండును.

"వసతి హృది సనాతనే చ తస్మిన్
భవతి పుమాన్ జగతోఽస్య సౌమ్య రూపః
క్షితి రస మతి రమ్య మాత్మనోఽతః
కథయతి చారుత యైవ సాల భోతః."

ఎవని హృదయమున సనాతనుఁ డగు భగవంతుఁడు వసించు చుండునో, అతఁడు రమ్య మగు భూతల పుట్టమైన తియ్యమామిడి గున్న వలె సౌమ్య రూపుఁ డగును.

"యమ నియమ విధూత కల్మషాణా
మను దిన మచ్యుత సక్త మానసానామ్
ఆప గత మద మాన మత్సరాణాం
వ్రజ తట దూరతరేణ మానసానామ్."

యమ నియమాది అష్టాంగ యోగములద్వారా కల్మషములను తొలగించుకొనినవాఁడును, నిరంతరము భగవంతునియందు లగింపఁ జేయఁబడిన మనస్సు గలవాఁడును, మద మాన మత్సరములను విసర్జించినవాఁడును అగు వతఁడు భాగవతుఁడు.

''కనక మపి రహస్య వేక్ష్య బుద్ధ్యా
తృణ మివ య స్సమవైతి వై పరస్వమ్
భగవతి చ భగవ త్యనన్య చేతాః
పురుష వరం త మవే హి విష్ణుభక్తమ్ ''

రహస్యమందైన బంగారము చూచినను - గడ్డిపోచవలె దలంచుచు, భగవ దాసక్త మనస్కుఁడగువాఁడు భాగవతుఁడు.

''కమల నయన వాసుదేవ విష్ణో
ధరణి ధరాచ్యుత శంఖ చక్రపాణే
భవ శరణ మి తీరయంతి యే వై
త్వ జభ టి దూరతరేణ తా నపాపాన్.''

కమల నయన ! వాసుదేవ ! విష్ణో ! అచ్యుత ! శంఖ చక్ర పాణే ! అని, భగవ న్నామమును సదా జపించుటచే, పాప రహితుఁడగువాఁడు భాగవతుఁడు.

భగవద్భక్తివిహీనుల లక్షణములు

''హరతి పర ధనం నిహ న్తి జన్తూ
న్వదతి తథా ఽనృత విష్ణురాణి యశ్చ
అశుభ జనిత దుర్మదస్య పుంసః
కలుష మతేర్వ్రజ తస్య వా స్త్యనంతః.''

పర ధనములను హరించువాఁడు, ప్రాణులను హింసించువాఁడు, అసత్య భాషణములు - నిష్ఠుర వచనములు పలుకువాఁడు, అమంగళ మనస్కుఁడు, మద మాత్సర్య యుక్తుఁడు, కలుషితమైన హృదయము గలవాఁడు భగవద్భక్తుఁడు కాఁడు.

''న నహతి పర సంపదం వినిందాం
కలుష మతిః కురుతే సతా మసాధుః
న యజతి న దదాతి యశ్చ పాతం
మనసి న తస్య జనార్దనో ఽధమస్య.''

ఇతరుల సంపదనుఁ జూచి సహింపఁజాలనివాఁడు, ఇతరులను దూషించువాఁడు, కలుషితమైన మనస్సు గలవాఁడు, సజ్జనులను దుర్జనులనుగా తలంచువాఁడు, భగవదారాధన చేయనివాఁడు, దానము చేయనివాఁడు అధముఁడు కావున, అతఁడు భగవద్భక్తుఁడు కాఁడు.

"పరమ సుహృది బాన్ధవే కళత్రే
సుత తనయా పితృ మాతృ భృత్య వర్గే
కృత మతి రుపయాతి యోఽర్థ తృష్ణాం
త మధమ చేష్ట మవే హి నాన్య భక్తిమ్."

మిత్రుఁడు, బంధువు, సతీ సుతులు, జనని జనకులు, సేవకులు మొదలగు ఆ ప్రులను ధనాశచే నెవఁడు హింసించుచుండునో — అట్టి యధముఁడు భగవద్భక్తుఁడు కాఁడు.

"అశుభ మతి రస త్రృవృ త్తి సక్తి
స్సతత మనార్య కుశీల సంగమ త్తఃః
అనుదిన కృత పాప బంధ సక్తిఃః
పురుష పశు ర్న హి వాసుదేవ భక్తఃః."

అమంగళ మనస్కుఁడు, దు ర్ప్రవ ర్తనయం దాస క్తి గల వాఁడు, నిరంతరము దుర్మార్గు లగువారితో — దుశ్చేష్టలు గలవా రితో సాంగత్యము చేసి మదించినవాఁడు, ప్రతిదినము పాపకృత్య ములు గావించుచుండు వాఁడు — 'పురుష పశువు' అనఁ జెల్లును. అట్టివాఁడు భగవద్భక్తుఁడు కాఁడు.

పై రీతిగా భాగవత లక్షణములను, భగవద్భక్తులు కాని వారల లక్షణములను యమధర్మరాజు తన భటునకు తెలియఁ జెప్పుచు, భగవద్భక్తులు కానివారలను తన లోకమునకు బట్టి తెమ్మని ఆజ్ఞాపించి యున్నట్లు పురాణ వక్కణ 4 కావున, ఇట్టి ప్రమాణములనుబట్టి, భాగవతుల ప్రభావము సులభ గ్రాహ్యము.

---

4. విష్ణు పురాణములో - తృతీయాంశ యందలి నప్తమో ఽధ్యాయమును చూడుఁడు.

భగవద్భక్తులైన అట్టి భాగవతుల మతమే భాగవత మతము. ఇఁక, మత మన నేమో — విచారింతము.

మత శబ్దార్థము

మత మనఁగా - జ్ఞానము. జ్ఞాన మన, తత్త్వ త్రయ జ్ఞానము, అర్థ పంచక జ్ఞానము అని చెప్ప నొప్పును. తత్త్వ త్రయ మనఁగా—

"భోక్తా భోగ్యం ప్రేరితారం చ మత్వా
జుష్ట స్తత స్తే నామృతత్వ మేతి."

అను ఉపనిష ద్వాక్యములో ప్రతిపాదితము లగు చిద చిదీశ్వర తత్త్వములు. ఆ తత్త్వములను శ్రోత్రియుఁడు, బ్రహ్మనిష్ఠుఁడు నగు ఆచార్యుని మూలమున అవికలముగా నెఱుంగుట. అర్థపంచక మనఁగా - స్వ స్వరూప, పర స్వరూప, ఉపాయ స్వరూప, పురుషార్థ స్వరూప, విరోధి స్వరూపములు.

"ప్రాప్యస్య బ్రహ్మణో రూపం
ప్రాప్తు శ్చ ప్రత్యగాత్మనః
ప్రాప్త్యుపాయం ఫల ప్రాప్తే
స్తథా ప్రాప్తి విరోధి చ."

అను సకల వేద ఇతిహాస పురాణాది చోదిత మగు జ్ఞానమే అర్థ పంచక జ్ఞానము. ఇట్టి జ్ఞానమే ముముక్షువునకు పరమావశ్యకము. ఇట్టి తత్త్వ త్రయ సిద్ధాంత నిపుల జ్ఞానమే భాగవత మతము.

'అథవా - భగవతా ప్రోక్తం భాగవతమ్. భాగవతం చ తన్మతం చ భాగవత మతమ్ — తస్య వైభవమ్ భాగవత మత వైభవమ్' అనియు నిర్వచింపవచ్చును.

పాంచరాత్ర మతమే భాగవత మతము

శ్రీ పాంచరాత్ర శాస్త్రము భగవన్ముఖోదితము. శాండిల్యాది మహర్షి – ప్రజాపత్యాది దేవ ప్రవర్తితము. పర వ్యూహ విభవాంతర్యామ్యర్చా రూప మగు భగవత్స్వరూప పంచక వివరణమునకు ప్రవృత్తమై, త దారాధనా రూప మగు కర్మలను విధించునదియై, పరమ విలక్షణముగ మహా భారతేతిహాసమున ప్రశంసింపఁబడినది. ఇట్టి మత నిష్ఠులే ముముక్షువులకు మార్గ దర్శకులు. వారి వైభవములు అతి విలక్షణములు. ఈ మతమే మన ప్రాచీనులగు శతకోపాది సూరి వరేణ్యులచే దివ్య ప్రబంధములలో ప్రపంచితమైనది. నాథ, యామున, రామానుజ, వరవరాది ఆచార్య వర్యులచే అనుష్ఠిత మగు ఈ మతమే లోకమునకు తారక మైనది. యామునాచార్యుల 'ఆగమ ప్రామాణ్యము', భగవ ద్రామానుజుల శ్రీభాష్యము నందలి 'ఉత్పత్త్య సంభవాధికరణము', వేదాంత దేశికుల 'పాంచ రాత్ర రక్ష' మున్నగు గ్రంథములు – శ్రీ పాంచరాత్ర శాస్త్రమందు ప్రతిపాదింపఁబడిన ఈ భాగవత మతమునే వే నోళ్ళ కొనియాడుచున్నవి.

"ఇదం శత సహస్రాద్ధి భారతాఖ్యాన వి స్తరాత్
ఆవిద్య మథి మంథానం దధ్నో ఘృత మి వోద్ధృతమ్
నవనీతం యథా దధ్నః ద్విపదాం బ్రాహ్మణో వరః
ఆరణ్యకం చ వేదేభ్యః ఓషధీభ్యో యథా ఒమృతమ్
ఇదం మహోపనిషదం పంచ వేద సమన్వితమ్
సాంఖ్య యోగ కృతాం తేన పంచరాత్రానుశబ్దితమ్
వేదాంతేషు యథా సారం సంగృహ్య భగవాన్ హరిః
భక్తానుకంపయా విద్వాన్ సంచిక్షేప యథా సుఖమ్."

సకల వేదాంత వేద్యుఁడగు భగవాన్ వాసుదేవుఁడు, పర బ్రహ్మ శబ్ద వాచ్యుఁడు, నిఖిల హేయ ప్రత్యనీక కల్యాణైక తా

నంత జ్ఞానానందా ద్యపరిమిత గుణోదార సముద్రుఁడు, సత్య సంక ల్పుఁడు అగు స్వామి - వర్ణాశ్రమ ధర్మ వ్యవస్థలను చెంది యుండు నట్టియు, చతు ర్విధ పురుషార్థ నిష్ఠులై యుండునట్టియు భక్తులను చూచి, అపరిమిత మగు దయ గలవాఁడై, భగవ త్స్వరూప రూప గుణ విభూతి భగవ దారాధన భగవ ద్ప్రాప్తి ఫల యాథార్థ్యావ బోధు లగు ఋగ్యజు స్సామాది వి ధ్యర్థ వాద మంత్ర రూపము లగు వేదములను బోధించియు, వాని యర్థ నిర్ణయమును తాను తప్ప, ఇతరు లెవ్వరును చేయఁజాల రని నిశ్చయించి, వేదములలో ప్రతిపాదింపఁబడిన లోకమునకు ప్రసాదించెను. కనుకనే, ఈ శాస్త్ర మునకు - 'భగవ చ్ఛాస్త్రము' అను పేరు ప్రసిద్ధమైనది.

భాగవత మత వైశిష్ట్యము

'భగవతి భక్తాః భాగవతాః' అను వ్యుత్పత్తిచే సిద్ధమైన 'భాగవత' పదములో - 'భక్తాః' అనునది - 'భక్తి రేషా మస్తీతి భక్తాః' అను వ్యుత్పత్తిచే సిద్ధమైనది. భక్తి యనఁగా - 'పూజ్యే ష్వనురాగో భక్తిః' అను సూత్రమునఁబట్టి, తన కంటెను విశిష్ట లగు మహనీయులపై గల భావ విశేషము. కావున, ఇచట - నిరస్త నిఖిల దోషుఁడును, అనంత కల్యాణ గుణ గణ పరిపూర్ణుఁడును అగు పరబ్రహ్మ విషయకముగా నేర్పడు భావ విశేష మని చెప్ప నగును. ఇట్టి భావ విశేషము - భక్తి శాస్త్రములలో కొన్ని తావుల యందు ఎనిమిది విధములుగను, మఱికొన్ని తావుల యందు తొమ్మిది విధము లుగను చెప్పఁబడినది.

"మద్భక్తి జన వాత్సల్యం పూజాయాం చానుమోదనమ్
మత్కథా శ్రవణే శక్తిః మద్ధ్యే దంభ వర్జనమ్

న్వయ మభ్యర్చనం చైవ స్వర నేత్రాంగ విక్రియా
మమాను స్మరణం నిత్యం యచ్చ మాం నోపజీవతి
భక్తి రష్ట విధా హ్యేషా యస్మిన్ మ్లేచ్ఛేఽపి వర్తతే
స విప్రేంద్రో ముని శ్రేష్ఠః స యతిస్స చ పండితః
తస్మై దేయం తతో గ్రాహ్యం స చ పూజ్యో యథా హ్యహం

అను ప్రమాణముచే, అష్ట విధ భక్తులు సూచితములు.

"శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనమ్
అర్చనం వందనం దాస్యం సఖ్య మాత్మనివేదనమ్."

అను ప్రమాణముచే, నవ విధ భక్తులు సూచితములు. ఇట్టి భక్తి నిష్ఠులే భాగవతులు. భాగవతుల వైభవము పురాణములలో బహు భంగులుగా వర్ణింపబడియున్నది. ఒక్కొక్క భక్తిమార్గమున ఒక్కొక్కరు పయనించి తరించినట్లు, ప్రాచీన చరిత్రలు మనకు బోధించుచున్నవి.

భాగవతులు - భక్తి మార్గములు

"శ్రీకృష్ణ శ్రవణే పరీక్షి దభవ దైవ్యాసకిః కీర్తనే
ప్రహ్లాద స్మరణే త దంఘ్రి భజనే లక్ష్మీ: పృథుః పూజనే
అక్రూర స్త్వభివందనే కపిపతి ర్దాస్యే చ సఖ్యే ఒర్జునః
దేవ స్యాత్మ నివేదనే బలి రభూ త్సర్వస్వ సంపూజనే."

శ్రవణముచే	పరీక్షిన్మహారాజు
కీర్తనముచే	శుకమహర్షి
స్మరణముచే	ప్రహ్లాదుడు
పాద సేవనముచే	లక్ష్మీదేవి
అర్చనముచే	పృథు చక్రవర్తి

వందనముచే	అక్రూరుఁడు
దాస్యముచే	హనుమంతుఁడు
సఖ్యముచే	అర్జునుఁడు
ఆత్మ నివేదనముచే	బలి చక్రవర్తి

తరించినట్లు, ఇందుమూలమున స్పష్టమగుచున్నది.

భాగవతుల వైశిష్ట్యము

"న శూద్రా భగవద్భక్తాః విప్రా భాగవతాః స్మృతాః
సర్వ వర్ణేషు తే శూద్రా యేఽన్యభక్తా జనార్దనే."

శూద్రులైనను - భగవద్భక్తులు శూద్రులు కారు. వారే విప్రులు - భాగవతులుగా చెప్పఁబడుచున్నారు. జనార్దనునియందు భక్తి లేనివారలు ఏ వర్ణమునకుఁ జెందిన వారైనను, శూద్రులుగనే పరిగణింపఁబడుదురు.

"మద్భక్తం శ్వపచం వా ఒపి నిందాం కుర్వన్తి యే నరాః
పద్మకోటి శతే నాపి న క్షమామి వసుంధరే."

ఎట్టి నికృష్ట జన్ముఁడైనను, భగవద్భక్తుఁడు గౌరవింపఁ దగిన వాఁడు. అట్టివానిని నిందించినచో నేను సహింపఁజాలను' అని, వరాహస్వామి వక్కాణించి యుండుటను బట్టి, భగవద్భక్తులగు భాగవతుల వైశిష్ట్యము సుస్పష్టము.

'విష్ణు ప్రాప్తి, యనెడి ఫలమును గోరు వైష్ణవుఁడు, భక్తియే యుపాయముగ గలవాఁడుగాని భక్తిని సాధనముగా స్వీకరించడు. శ్రీహరికి తాను దాసుఁడను బుద్ధి చూపుచు, స్వామి సేవచేయుచు, భగవత్పాదపద్మ ప్రపణుఁడగుచు, కాలమును భగవదనుభవమున

సద్వినియోగము గావించువారే భాగవతులు.5 వారి మతమే భాగవత మతము.

"రాగా ద్యపేతం హృదయం వాగదుష్టా ఽనృత వాదినా
హింసాది రహితః కాయః కేశవారాధనం త్రయమ్."

రాగ ద్వేష శూన్యత, సత్య ప్రియ వాదిత్వము, పరహింసా శూన్య చేష్ట అను మనో వా క్కాయ శుద్ధియే భగవ దారాధన మని చెప్పఁబడును.

"అహింసా ప్రథమం పుష్పం పుష్ప మింద్రియనిగ్రహః
సర్వ భూత దయా పుష్పం క్షమాపుష్పం విశేషతః
జ్ఞానపుష్పం తపఃపుష్పం ధ్యానపుష్పం తు సప్తమమ్
సత్య మష్ట విధం పుష్పం విష్ణోః ప్రీతి కరం భవేత్."

అహింస, ఇంద్రియ నిగ్రహము, భూతదయ, ఓరిమి, జ్ఞానము, తపము, ధ్యానము, సత్యము అనఁబడు అష్ట విధ పుష్ప పూజయే శ్రీ మహా విష్ణువునకు ప్రీతి కర మైన పూజ యని శాస్త్ర ములు బోధించుచున్నవి. కావున, ఏవం విధ పూజాకారులే భాగ వతు లని తెలియ నగును. ఇట్టి భాగవతుల సేవ, పరమ పురుషార్థ ప్రదము.

"న దూర మపి గంతవ్యం యత్ర భాగవతా స్థితాః
ప్రయత్నే నాఽపి ద్రష్టవ్యా స్తత్ర నన్నిహితో హరిః."

భాగవతులు ఎంత దూరమునం దున్నను, వారి కడ కేఁగి, వారిని తప్పక సేవింపవలెను. ఆ భాగవతులుండు తావున భగవంతుఁ డుండును.

---

5. ప్రపన్న పారిజాతమునందలి భగవ త్పరిచర్యా పద్ధతిని పరిశీలింపుఁడు.

"సాధూనాం దర్శనం పుణ్యం తీర్థ భూతాహి సాధవః
కాలేన ఫలతే తీర్థం సద్య స్సాధు సమాగమః."

సాధు దర్శనము పుణ్య ప్రదమైనది. సాధువులు పవిత్ర తీర్థ తుల్యులు. తీర్థము కాలాంతరమున ఫలము నిచ్చును. సాధువు లగు భాగవతుల సమాగమము సద్యఃఫలదాయకము.

"మహాత్మాన స్తు మాం పార్థ ! దైవీం ప్రకృతి మాశ్రితాః
భజం త్యనన్య మనసో జ్ఞాత్వా భూతాది మవ్యయమ్."

"సతతం కీర్తయంతో మాం యతంత శ్చ దృఢ వ్రతాః
నమస్యంత శ్చ మాం భక్తా నిత్య యుక్తా ఉపాసతే."

-(భగవద్గీత : 9-13-14)

ప్రయోజనాంతర శూన్య మనస్కులై, సకల చరాచర కారణ భూతుఁడును, నాశ రహితుఁడును అగు నన్ను, దైవీ నంప న్నిష్ఠ లగు మహాత్ములు తెలిసికొనినవారై, మన్నామస్మరణ కీర్తనా దికము లేక ధరించనివారై, నన్ను చెందు సాధనములందు దృఢ నిష్ఠ గలవారై, నా నామ స్మరణము లేక నిలువఁజాలక, నా నామ ములు స్మరించి పులకాంకితు లగుచు, నా దర్శన మాత్రముచే నాష్టాంగ దండ ప్రణామ శీలు రగుచు, సర్వదా నా యర్చనాదుల యందు సక్తులై, నన్ను సేవించుచుందురు' అని శ్రీకృష్ణ పరమాత్మ వెనుక చెప్పిన 'ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీ చ' అను చతుర్విధ భజన పరుల వైలక్షణ్యమును సూచించుచు, 'మహాత్మానః' అని నిర్ధా రించియున్నాడు. అట్టి మహాత్ములే భాగవతులు.

"తేషాం జ్ఞానీ నిత్య యుక్త ఏక భక్తి ర్విశిష్యతే
ప్రియోహి జ్ఞానినో త్యర్థ మహం న చ మమ ప్రియః."

"ఉదారా స్సర్వ ఏ వై తే జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్
ఆస్థిత స్సహి యుక్తాత్మా మామే వా నుత్తమాం గతిమ్."

"బహూనాం జన్మనా మంతే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే
వాసుదేవ స్సర్వ మితి స మహాత్మా సుదుర్లభః."

అని భగవద్గీత వక్కాణించునట్లు, భాగవతులకు ధారక - పోషక - భోగ్యము లన్నియు వాసుదేవుఁడే.

"ఉణ్ణుం శోర్ పరుకునీర్ తిన్నుమ్ విత్తిన్ఱియం ఎల్లాం కణ్ణన్."

అను దివ్యప్రబంధ వాక్యానుసారము - ప్రహ్లాద, లక్ష్మణ భరతాదులతో సామ్యము గల ప్రపన్న జనకూటస్థులవంటి సాధు పుంగవులు భాగవతులు.

"ప్రహ్లాద నారద పరాశర పుండరీక
వ్యాసాంబరీష శుక శౌనక భీష్మ దాల్భ్యాన్
రుక్మాంగదార్జున వసిష్ఠ విభీషణాదీన్
పుణ్యా నిమాన్ పరమభాగవతాన్ స్మరామి."

అను అభియుక్తోక్తి యందలి భాగవతులగు పరాశర - పారశర్యాది మహర్షులు - పురాణ సూత్రాది ముఖమున వే నోళ్ళ చాటిన -

"సత్యం సత్యం పున స్సత్య ముద్ధృత్య భుజ ముచ్యతే
వేద శాస్త్రా త్పరం నాస్తి న దైవం కేశవా త్పరమ్."

అను శ్రుతిస్మృతీతిహాస పురాణాదులు ప్రతిపాదించు మతమే భాగవత మతము.

"వ్యాళాలయద్రుమా హ్యేతే వ్యతిరి క్తాఖిల సంపదః
యే గృహా స్తీర్థ పాదీయ పాద తీర్థ వివర్జితాః
సర్వేషా మేవ పాపానాం ప్రాయశ్చిత్తం మనీషిభిః
నిర్ణీతం భగవ ద్భక్త పాదోదక నిషేవణమ్

తత్తీరం శిరసా ధార్యం తథాంగై శ్చతురాదిభిః
పేయ మంత ర్యథా సోమే తత్ర నాచమన క్రియాః.''

అను వచనానుసారము సకల పాప ప్రాయశ్చిత్త భూత పాద తీర్థ ప్రభావము గలవారు భాగవతులు. భగవ దతిరిక్త వస్తు వైతృష్ణ్యము, భగవ త్ప్రాప్తి కలిగి, కర్మణా - మనసా - వాచా సకల జగ ద్భ్రేయః కాములై, సకల సద్గుణ సంపన్నులై, తమ్ము చూచు వారియొక్కయు - తమతో భాషించువారియొక్కయు - తమ నను సరించువారియొక్కయు ఏ రీతిగనైన తమతో సంబంధము గల వారి నెల్ల తరింపఁజేయఁగల్గిన మహిమాన్వితులు భాగవతులు.

"అస్పోటయంతి పితరః ప్రనృత్యంతి పితామహాః
వైష్ణవో నః కులే జాత స్సచ నస్తారయిష్యతి.''

"పశు ర్మనుష్యః పక్షీ వా యే చ వైష్ణవ సంశ్రయాః
తే నైవ తే ప్రయాస్యంతి త ద్విష్ణోః పరమం పదమ్."

''య త్రాష్టాక్షర శ్చ సంస్మర్తా మహా భాగో మహీయతే
తత్ర సంచరిష్యంతి వ్యాధి దుర్భిక్ష తస్కరాః."

ఇత్యాది వచనములచే, భాగవతుల మహిమ ప్రతిపాదింపఁ బడినది. ఇట్టి వారికి ఈ మహిమ కలుగుటకు కారణము - వీరి సిద్ధాంత ప్రాశస్త్యమే. నారద, దాల్భ్య, పుల స్త్య, శౌనక, పరాశర, పారాశర్య, శుక, వసిష్ఠాది మహర్షులు - భరద్వాజాదులు బహు భంగులుగ శ్రీమన్నారాయణ పరత్వమును నిరూపించుచు, చేతనులు భగవ చ్ఛేషభూతుల లనియు, శ్రీమన్నారాయణుఁడు శేషి యనియు ఆతఁ డనన్య లభ్యుఁ డనియు, స్వస్యాపి పదస్య ప్రదాత యనియు బోధించిన పరమ విలక్షణము - శ్రుతి ప్రతిపాద్యము సకల స్మృతీతి హాస పురాణా ద్యుపబృంహితము నగు అర్థము నాశ్రయించుటచే,

భగవత్స్వరూప గుణ విభవైశ్వర్య జ్ఞానులు – పరమ కారుణికులు నగు పరాంకుశ, పరకాల, భట్టనాథాది పన్నిద్దరాళ్వారులు తమ దివ్య ప్రబంధములందు పలు తావులలో ఈ యర్థమును ప్రతిపాదించుటచే, వారి యందలి ప్రావణ్య మూలకముగ, పూర్వాచార్యులగు నాథ, యామున, రామానుజ, వరవరాదులు తమ యాచరణ ముఖమునను – గ్రంథముఖమునను ఈ యంశములను మనకు బోధించుటచేతను, ఆట్టి పరమ విలక్షణుల శ్రీ సూక్తులే తమ్ము తరింపఁజేయఁగల సాధనములని సంభావించి, ఆచార్య పరంపరాగత మగు అర్థముల నెల్ల వేళల ననుసంధించు పరమ ప్రామాణికులు – సాత్త్వికులు నగు వారి యనుష్ఠాన విశేషమే భాగవత మతము. ఇట్టి భాగవత మత వైభవము వర్ణనాతీతమై, సహృదయు లందఱిచేతను పలు విధములుగా ప్రశంసింపఁబడుచున్నది.

మోక్ష సాధనములు - ప్రపత్తి దర్శనము

శిరోమణి - విద్వాన్
ఆంధ్ర విద్యానాథ - బ్రాహ్మ భూషణ
శ్రీమాన్ చెలమచెర్ల రంగాచార్యులు

—❋—

పురుషార్థ చతుష్టయము

మానవు లభిలషించునవి పురుషార్థములు. అవి ధర్మార్థ కామ మోక్షములు నాలుగు. వీనిలో మోక్షము పరమ పురుషార్థము. జీవుడు జన్మ మృత్యువులు, జరా వ్యాధులు మొదలైన బహు క్లేశములతో నిండి యున్న యీ సంసార చక్రమునుండి తప్పించుకొని, పరమ పదమున సర్వేశ్వరుని సాయుజ్యమును పొంది, త ద్దివ్య మంగళ విగ్రహమును సేవించుచు, ఆనందించుటయే మోక్షము. అదియే బ్రహ్మ ప్రాప్తి. దీనివలన కలుగు ఆనందమే బ్రహ్మానందము. ప్రాణు లనుభవించు లౌకికానందము లన్నియు సాతిశయములు. అవి నశ్వరములు. ఇది శాశ్వతము. ఈ బ్రహ్మానంద ప్రమాణ మెట్టిదో నిరూపించుచు వేదము - నడి వయస్సు, మంచి ఆరోగ్యము, గొప్ప యైశ్వర్యము, సత్సంతానము, అడ్డు లేని అధికారము మున్నైనవి కలిగిన చక్రవర్తికి కలుగు ఆనందమును ఒక మానుషానందమునకు కొల గఱుగా పెట్టుకొనినచో - అట్టి నూరు మానుషానందములు ఒక మనుష్య గంధర్వానంద మగు ననుచు, క్రమముగా దేవ గంధర్వానందము, పితృదేవతానందము, ఆజాన దేవతానందము, కర్మదేవతానందము, దేవతానందము, ఇంద్రదేవతానందము, బృహస్ప

త్యానందము, ప్రజాపత్యానందము, హిరణ్యగర్భానందములను పేర్కొని, ఇవి పూర్వముకంటె ఉత్తరోత్తరము నూరేసి రెట్లు అధిక ప్రమాణము కల వగు నని చెప్పి, అట్టి హిరణ్యగర్భానందము కూడ అఖండ బ్రహ్మానందములో అల్పాల్పమైన యొక యంశముమాత్రమే యగునని తేల్చెను. ఇట్టి సర్వోత్కృష్టమైన బ్రహ్మానందమునుం బడయుటకు, జ్ఞాను లగు జీవులు తహ తహ పడుట యుక్తమే కదా !

మోక్ష పురుషార్థమును సాధించుటకు కర్మ యోగము, జ్ఞాన యోగము, భక్తి యోగము అనునవి సాధనములుగా సాధారణ పద్ధతిలో నిర్దిష్టము లగుచున్నవి. వీని స్వరూపాది వివేచన మిది :—

కర్మ యోగము

సత్కర్మానుష్ఠానము ప్రతి వ్యక్తికిని ఆవశ్యకముగా కర్తవ్య మైనది. విధి విహితములైన కర్మలను శ్రద్ధతో అనుష్ఠింపవలసినదిగా శాస్త్ర మాజ్ఞాపించుచున్నది :-

"నియతం కురు కర్మ త్వం కర్మజ్యాయో హ్యకర్మణ: "
— (భగవద్గీత : 3 - 8)

"తస్మా చ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్య వ్యవస్థితౌ
జ్ఞాత్వా శాస్త్రవిధానో క్తం కర్మ కర్తు మిహార్హసి."
— (భగవద్గీత : 16 - 24)

తద్విదుల ఉపదేశానుష్ఠానములచేతను, శ్రుతి స్మృతి మీమాంసాది రూపమైన శాస్త్రముచేతను కర్తవ్య మేదియో, అకర్తవ్య మేదియో తెలిసికొని, కర్తవ్యములైన నిత్య నైమిత్తిక కర్మములను మానవుఁడు కామ క్రోధాదులను దరి జేరకుండగను, నిష్ఠతోను ఆచరింపవలయును. అట్టి కర్మయోగి - మోక్షమును పొందును.

"ఏతై ర్విముక్తః కౌంతేయ ! తమో ద్వారై స్త్రిభి ర్నరః
ఆచర త్యాత్మన శ్శ్రేయ స్తతో యాతి పరాంగతిమ్."

— (భగవద్గీత : 16 — 22)

స్వధర్మాచరణము భగవ దారాధనమే యని నిశ్చయించి, తన్మూలమున ముక్తి పొంద నగు ననుచున్నది గీతా శాస్త్రము.

"స్వే స్వే కర్మ ణ్యభిరత స్సంసిద్ధిం లభతే నరః
స్వ కర్మ నిరత స్సిద్ధిం యథా విందతి తచ్ఛృణు."

"యతః ప్రవృత్తి ర్భూతానాం యేన సర్వ మిదం తతమ్
స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః."

— (భగవద్గీత : 18 - 45, 46)

జీవుల ఉత్పత్త్యాది సమస్త వ్యాపారములును ఏ పరమాత్మవలన కలుగుచున్నవో, ఎవనిచే ఈ చరాచరాత్మకమైన జగత్తంతయు వ్యాపింపఁబడినదో, అట్టి సర్వేశ్వరుని - విహిత విధిచే పూజించి, మానవుఁడు సిద్ధినిఁ బడయు నని తాత్పర్యము.

స్వ కర్మానుష్ఠాత యెట్లు ముక్తి నొందఁగలడో ఆచార్యులు వివరించిరి.

"అవిద్యయా మృత్యుం తీర్త్వా - విద్యయా ఽ మృత మశ్నుతే."

అను యజుర్వేద వాక్యమును వ్యాఖ్యానించుచు, విద్య యనఁగా జ్ఞాన మనియు - అవిద్య యనఁగా తత్సాధనమైన సత్కర్మాచరణ మనియు స్పష్ట పఱచి, సత్కర్మానుష్ఠానమున జ్ఞానమును, దానివలన భగవద్భక్తియు, దానిచే భగవదనుగ్రహమును, తత్ఫలితముగ మోక్షమును లభించు నని వారు ప్రకటించిరి.

మఱి - కర్మలు బంధ హేతువులు కదా ! అట్టివి తమ స్వభావమునకు విరుద్ధముగా ముక్తికి కారణము లెట్లు కాఁగలవు ? అన్నచో

"యజ్ఞార్థాత్కర్మణో ఒన్యత్ర లోకో ఒయం కర్మబంధనః
తదర్థం కర్మ కౌంతేయ ! ముక్త సంగ స్సమాచర."

— (భగవద్గీత : 3 - 9)

భగవదర్పణ బుద్ధితో నిష్కామముగా ఆచరించు సత్కర్మ మెల్లయు యజ్ఞ మనఁబడును. అట్టి యజ్ఞ రూపములైన కర్మలు బంధహేతువులు కావు -' అని సమాధానము. ఫల తృష్ణతో కర్మల నాచరించు వానిని గీత - 'కృపణాః ఫల హేతవః' అని దీనులనుగా చిత్రించి, గర్హించినది. ఫలాపేక్ష విడిచి, సత్కర్మానుష్ఠానము చేయు వారిని ప్రశంసించి, వారు మోక్ష ఫలమును చూఱగొందు రనియు వెల్లడించినది.

"కర్మజం బుద్ధియుక్తా హి ఫలం త్యక్త్వా మనీషిణః
జన్మబంధ వినిర్ముక్తాః పదం గచ్ఛం త్యనామయమ్."

— (భగవద్గీత : 2 - 51.)

జ్ఞాన యోగము

"న హి జ్ఞానేన సదృశం పవిత్ర మిహ విద్యతే
తత్ స్వయం యోగ సంసిద్ధః కాలే నాత్మని విందతి."

— (భగవద్గీత : 4 - 38.)

జ్ఞానముతో సాటి వచ్చు పావనమైన సాధనము వేఱే లేదు. నిష్కామ కర్మయోగి కాల క్రమమున ఆ జ్ఞానమును తాను బడయును' అని జ్ఞాన యోగ ముగ్గడింపఁబడినది.

దేనివలన వస్తు తత్త్వము తెలియునో - అది జ్ఞానము. 'జీవుడు, ప్రకృతి, పరమాత్మ' - అను తత్త్వముల స్వరూప స్వభావ పరిజ్ఞానము లెస్సగాఁ గల జ్ఞానికి స్వకర్తవ్యము సుబోధ మగును. జీవునకు పరమ కర్తవ్యము పరమాత్మానుగ్రహ సంపాదనము. ఆ పరిజ్ఞానము లేనివారికి దేహమందు ఆత్మ బుద్ధి, అల్పజ్ఞుఁడగు తనయందు

సర్వజ్ఞత్వ మతి - మొదలైన భ్రాంతులు పొడమును. వానిచే అహంకారాదులు కలిగి, అసుర వృత్తికి దారి తీసి, కడపటికి వానిని పతితుని గావించును.

కర్మ నిష్ఠ, జ్ఞాన నిష్ఠ యను రెండును భగవంతునిచే తొల్లి ఉపదేశింపఁబడినవి. యోగులకు కర్మ నిష్ఠయు, సాంఖ్యులకు జ్ఞాన నిష్ఠయు విహితములు. జ్ఞాన యోగమును సృష్ట్యాది కాలములో పరమాత్మ సూర్యున కుపదేశించె నఁట. ఆ సూర్యుఁడు మనువునకు, మనువు ఇక్ష్వాకునకును ఉపదేశించిరి. అట్లు క్రమముగా జ్ఞాన యోగము లోకమునకు వ్యాపించెను. ఈ సంప్రదాయము కొంత కాలమునకు మఱుగున పడిపోయినది. కాఁగా - ఆ భగవానుఁడే శ్రీ కృష్ణస్వామిగా అవతరించి, అర్జునున కుపదేశించి, లోకము ననుగ్రహించెను. ఈ భావము —

"లోకే ఒస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయా ఒనఘ !
జ్ఞాన యోగేన సాంఖ్యానాం కర్మ యోగేన యోగినామ్."

— (భగవద్గీత : 3-3.)

"ఇమం వివస్వతే యోగం ప్రోక్తవా నహ మవ్యయమ్
వివస్వాన్ మనవే ప్రాహ మను రిక్ష్వాకవే ఒబ్రవీత్
ఏవం పరంపరా ప్రాప్త మిమం రాజర్షయో విదుః
స కాలే నేహ మహతా యోగో నష్టః పరంతప !
స ఏవాయం మయా తేఒద్య యోగః ప్రోక్తః పురాతనః."

— (భగవద్గీత : 4 - 2,3.)

అను భగవద్గీతా వాక్యములలో వ్యక్తీకరింపఁబడినది. సర్వేశ్వరుని సర్వజ్ఞత్వ సర్వ కర్తృత్వాదులను, జీవుని అల్పజ్ఞత్వాదులను ప్రకృతి స్వరూపమును ప్రత్యక్షముగా తేట తెల్లము చేయుటకే శ్రీకృష్ణ భగవానుఁడు తన విశ్వరూపమును అర్జునున కనుగ్రహ పూర్వకముగా ప్రదర్శించెను.

ఈ జ్ఞాన మనునది కేవలము ఆయా తత్త్వ స్వరూప నిరూపణ పరము లగు వేద వేదాంత దర్శన పురాణాదులందు ప్రోక్తములైన ఆధ్యాత్మిక వాక్యముల తాత్పర్యావబోధ పర్యవసన్నమైనంత మాత్రమునసే చాలదు. ఆ వాక్య జ్ఞానము ముముక్షువైన యా సాధకునకు ప్రబోధకమై, భగవదుపాసనా రూపముగ పరిణమించు మహా నిష్ఠ కావలెను. ఈ విషయమును తత్త్వ విదులు పలువురు వక్కాణించిరి. భగవద్రామానుజ పూజ్య పాదులు వివరించిన యీ క్రింది వాక్యములు - ఈ ప్రకరణమున గమనించదగి యున్నవి :-

"అతో వాక్యార్థ జ్ఞానా దన్య దేవ ధ్యానోపాసనాది శబ్ద వాచ్యం జ్ఞానం వేదాంత వాక్యై ర్విధిత్సితమ్."

"తస్మా దనాది కర్మ ప్రవాహ రూపాజ్ఞానమూలత్వా ద్బంధస్య తన్నిబర్హణ ముక్తి లక్షణ జ్ఞానా దేవ."

— (శ్రీభాష్యము)

ధ్యానము, ఉపాసన మొదలైన పదములచే చెప్పబడునట్టిదే ఉపనిషత్తులలో ప్రతిపాదింపబడిన జ్ఞానము. వట్టి వాక్యార్థ జ్ఞానముకాదు. అట్టి జ్ఞానమువలననే అజ్ఞానము నశించి, సంసార బంధము విచ్ఛిన్నమగును -' అని తాత్పర్యము. 'ఉక్త లక్షణ జ్ఞానా దేవ' అను శ్రీభాష్య పంక్తిని శ్రుతప్రకాశికాకారులు - 'ఉపాసనాత్మకా దేవ= ఉపాసనా రూపమైన జ్ఞానముచేతనే' అని వివరించిరి.

ఆర్తుడు, జిజ్ఞాసువు, అర్థార్థి, జ్ఞాని - అనువారు తన్ను భజింతురనియు, అట్టి వారిలో జ్ఞాని సర్వ శ్రేష్ఠుడనియు భగవద్గీత యిట్లు ప్రశంసించినది :-

"చతు ర్విధా భజంతే మాం జనా స్సుకృతినో ఽర్జున !
ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ !"

— (భగవద్గీత (: 7 -16)

ఆర్తుడు తనకు కలిగిన ఆపద తొలఁగువఱకును, అర్థార్థి అభిలషిత ఫలము లభించువఱకును మాత్రమే స్వామిని భజింతురు. కావున, నిత్యయుక్తులు కారు. అందుచే, వారు క్రింది తరగతికి చెందిన భక్తులు. జిజ్ఞాసువు అంతకన్న కొంచెము నయము. ఇంక జ్ఞానియో – నిత్య యుక్తుడు. కామ్య ఫలాసక్తుడు కాడు. సమస్త కర్మజాలము శ్రేయఃపతి కైంకర్యమే యను భావముతో ఆచరించువాఁడు. కాబట్టి, జ్ఞాని అందఱికన్న మిన్న. ఈ భావమే శ్రీ కృష్ణ భగవానునిచే –

"తేషాం జ్ఞానీ నిత్య యుక్త ఏక భక్తిర్విశిష్యతే
ప్రియో హి జ్ఞానినోఽత్యర్థ మహం స చ మమ ప్రియః."

– (భగవద్గీత : 7 – 17)

"జ్ఞానీ త్వాత్మైవ మే మతిః."

– (భగవద్గీత : 7 – 18)

వీరిలో, అనన్య భక్తితో నన్ను నిత్యము సేవించు జ్ఞాని – విశిష్టుఁడు. జ్ఞానికి నేను అయినవాఁడను. జ్ఞాని నాకు కావలసినవాఁడు. వేయేల ! జ్ఞాని నాకు ప్రాణమే' అని చాటఁబడెను.

పవిత్రమైన ఈ జ్ఞానము లభించు టెట్లు ? శ్రుతి స్మృతి పురాణాదుల పఠనమువలన ఈ జ్ఞానము కలుగును గాని, అట్లుగా అనన్య భక్తితో ఉపాసన కావించుట ఏ కొంత మంది విద్వాంసులకో గాని, అందఱికును సాధ్యము కాదు. పైగా, అట్టి గ్రంథ జన్య పఠనమైన జ్ఞానము సాధకుల సంశయ గ్రంథుల నన్నింటిని తొలఁగింపలేకపోవచ్చును. రాజ విద్యయు, గుహ్య తమము అయిన తత్త్వ మగుటచే, అంతంత మాత్రమున బోధపడునది కాదు. అందుచే, జ్ఞాన ధనమును సంపాదించవలెను.

'ఆచార్యవాన్ పురుషో వేద' అని శాస్త్రము. ఉత్తమ గురువు నాశ్రయించినవాఁడే ఆధ్యాత్మిక విద్యా రహస్యము లెఱుఁగ సమర్థుఁ డగును.

"తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా
ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానిన స్తత్త్వదర్శినః."

– (భగవద్గీత : 4.34)

అను గీతా వాక్యముకూడ, గురు శుశ్రూషాదుల మూలమునఁ జేసే ఆత్మ జ్ఞానము పొందదగునని యుపదేశించుచున్నది.

ఈ ప్రస్తావములో గుర్తింపవలసిన యొక విశేష మిది :–

"లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయాఽనఘ!"

అని, కర్మజ్ఞాన నిష్ఠలు రెండును వేరు వేరుగా చెప్పఁబడినట్లు స్థూల దృష్టికి కనుపించినను, యదార్థమునకు ఈ రెండు యోగములును ఫలితాంశమున ఒక్కటే. వీనిలో ఏ యొక్క యోగము నాశ్రయించినను, వే ఱ్ఱే అయిన వని విద్వాంసు లనరు. అపరిణత బుద్ధు లగువారే యివి భిన్నము లని తలంతురు. గీతలోనే యీ విషయ మిట్లు స్పష్టము చేయఁబడినది :–

"సాంఖ్య యోగౌ పృథగ్బాలాః ప్రవదంతి న పండితాః
ఏక మప్యాస్థిత స్సమ్య గుభయో ర్విందతే ఫలమ్."

– (భగవద్గీత : 5-4)

నిష్కామముగా ఆచరించు కర్మయోగము – జ్ఞాన యోగములోనే పర్యవసించునని తాత్పర్యము.

భక్తి యోగము

సేవార్థకమైన భజ ధాతువువలన నిష్పన్నమైన భక్తి పదము మైన భగవత్సేవ యని విశిష్టార్థము. ప్రకరణాను

గుణము, మోక్ష సాధనములలో భక్తికి విశిష్టమైన స్థానము కలదు. అన్య విషయములయందు ప్రీతి, ఆసక్తి, రతి – అనబడుచు ఒప్పారెడి చిత్త వృత్తిని మరల్చి, భగవత్స్వరముగా లగింపఁ జేసినచో – అది భక్తిగా పరిణమించును. అట్టి భక్తి – మోక్ష సాధన సామాగ్రిలో శ్రేష్ఠతమమైన దని – 'మోక్ష సాధన సామగ్ర్యాం భక్తి రేవ గరీయసీ' యను శాస్త్రీకి తెల్లము చేయుచున్నది. ఆ భక్తి – కాదాచిత్కమైన చాలదు. అది యెడతెగనిదై సాగవలెను. తైలధారవలె భక్తి యవిచ్ఛిన్నమైనదై యుండవలెను. సర్వేశ్వరుని అఖిల హేయ ప్రత్యనీక కల్యాణ గుణములను కీర్తించుట, తన్మంగళ మూర్తిని దర్శించుట, అర్చించుట మొదలైనవి భక్తి వెలయించు కృత్యములు.

"ఆత్మావారే ద్రష్టవ్యః శ్రోతవ్యో నిధి ధ్యాసితవ్యః."

అను బృహదారణ్యక వాక్యము – ఈ భక్త కృత్యములనే తెలుపుచున్నది. ధ్యాన స్వరూపమును వివరించుచు శ్రీ భాష్యకారులు –

"ధ్యానం చ తైల ధారావ దవిచ్ఛిన్న స్మృతి సంతాన రూపమ్."

అన్నారు. మానసికముగా ధ్యానము, వాచికముగా కీర్తనము కాయికముగా అర్చనము – ఇట్లు త్రికరణములతోను అవిచ్ఛిన్నముగా శ్రీయఃపతిని సేవించు భక్తునకు మోక్షము కరతలామలకము. ఇతర సాధనములచే మోక్షమును సాధించుట మిక్కిలి క్లేశకరము భక్తి యోగముచే అది సుకరము. భక్తి యోగ మాహాత్మ్యమును శ్రీమద్భాగవత పురాణ మిట్లు ముక్తకంఠముగా ప్రకటించినది :-

"యత్కర్మభిర్యత్తపసా జ్ఞాన వైరాగ్యత శ్చ యత్
యోగేన దాన ధర్మేణ శ్రేయోభి రితరై రపి
సర్వం మద్భక్తి యోగేన మద్భక్తో లభతేఽంజసా."

– (భాగవతము : 11- 20 - 32, 33.)

కర్మ జ్ఞానాదులగు పెక్కు సాధనములచే క్లేశ పడి, యేది సాధించునో - అది యంతయు భక్తి పరుండు అనాయాసముగాను, శీఘ్రముగాను పొందఁగలుగును' అని భావము. సర్వ పాపములను బోగొట్టి, సాధకు నుద్ధరించు మహిమ భక్తికే కల దను మాట వ్యాస ప్రోక్తమే.

"యథాగ్నిః సుసమిద్ధార్చిః కరో త్యేధాంసి భస్మసాత్
తథా మ ద్విషయా భక్తి రుద్ధవైనాంసి కృత్స్నశః."

- (భాగవతము : 11 - 14 - 19)

ఉద్ధవా ! నిప్ప కట్టెలను కాల్చివేయునట్లు, భక్తి - పాప ముల నెల్ల దహించివేయును'- భక్తియే భగవంతుని వశపఱచుకొన గలిగినది. 'భక్తి వశః పురుషః' 'భక్తి రేవైనం గమయతి.' పర మాత్మ భక్తికే లభించువాఁడు. భక్తియే భగవానుని పొందించునది'- మొదలైన వాక్యములు నిత్య సత్యములు.

భక్తిశూన్యములైనచో - తపస్సు, జ్ఞానము, ధర్మము వీయు పవిత్రుని చేయఁజాలవు; ఉద్ధరింపను లేవు.

"ధర్మః సత్య దయోపేతః విద్యా వా తపసాన్వితా
మద్భ క్త్యపేత మాత్మానం న సమ్యక్ ప్రపునాతిహి."

- (భాగవతము : 11- 14 - 22)

అను శ్రీమ ద్భాగవత సూక్తి ఇచట స్మరింపఁ దగినది.

దృఢమైన భక్తి - కర్మచే ఎట్టి పాపి నైనను, జాతిచే ఎట్టి నికృష్టు నైనను పవిత్రునిఁ జేసి ఉద్ధరించును.

"భక్త్యాహ మేకయా గ్రాహ్యః శ్రద్ధయాత్మా ప్రియ స్సతామ్
భక్తిః పునాతి మ న్నిష్ఠా శ్వపాకా నపి సంభవాత్."

- (భాగవతము : 11 - 14 - 21

ఉద్ధవునితో శ్రీకృష్ణ భగవానుఁడు నుడివిన యీ మాట యెంత యథార్థమో - భక్తి చరితము లెఱిఁగినవారికి వేఱుగా చెప్పనక్కరలేదుగదా !

అద్భుతశక్తి సంపన్నమైన యీ భక్తి కలుగుట యెట్లు ? దీనికి సాధనము లెవ్వి ? అన్నచో - భక్తి తత్త్వ విద్రాగేసరులగు శ్రీమద్రామానుజాచార్యవర్యులు సాధక సప్తకమును తెలిపిరి :-

''తల్లబ్ధిః వివేక వివిమో కాభ్యాస క్రియాకల్యాణా నవసాదా నుద్ధర్షేభ్యః సంభవా స్నిర్వచనా చ్చ.''

- (శ్రీభాష్యము)

భక్తి కలుగుటకు - వివేకము, వివిమోకము, అభ్యాసము, క్రియ, కల్యాణము, అనవసాదము, అనుద్ధర్షము అను ఏడును సాధనములు. వీని వివరణ మిది :-

౧. **వివేకము :-**

''ఆహార శుద్ధౌ సత్త్వ శుద్ధిః సత్త్వ శుద్ధౌ ధ్రువాస్మృతిః.''

అను ఛాందోగ్య వాక్యానుసారము - సాత్త్వికాహార సేవనము మొదలైన వానిచే శరీరమును పరిశుద్ధమైన దానినిగా చేసికొనుట.

౨. **వివిమోకము :-**

ప్రాణికోటియందు ప్రేమయు, ఆర్తులయందు కనికరమును, పుణ్య కర్మాచరణము చేయుటయందు సంమోదమును, దుర్జనుల యందు ఉపేక్షా భావమును అలవఱచుకొనుచు, కామ క్రోధములను చేరనీయక, హృదయమును నిర్మలమైనదిగా నుంచుకొనుట.

3 **అభ్యాసము :-**

ఆచార్యోపదిష్టమైన మార్గమును భగవదనుగ్రహ ప్రాప్తికి సాధనములైన మంత్ర జపాదులను నిరంతరముగా కావించుచుండుట.

౪. క్రియ :-

ఆశ్రమ విహితములైన కర్మలను ఫలాపేక్ష లేకుండ, భగవదారాధన బుద్ధితో - శ్రద్ధాళువై యాచరించుట.

౫. కల్యాణము :-

సత్యము, దానము, దయ, అహింస మున్నగు లోక కల్యాణ హేతువులైన ధర్మములను సర్వదా పాటించుచుండుట.

౬. అనవసాదము :-

ఉపక్రమించిన సాధన కార్యమునుండి విరమింప కుండుట. 'శ్రేయాంసి బహు విఘ్నాని' అనునట్లు - మంచి పనికి పలు విఘ్నములు ఎదు రగుట సహజమే. అనారోగ్యము, కుటుంబ కష్టములు, దారిద్ర్యము - మొదలైనవానిచే, సాధకుని సాధనకు ఆటంకము లేర్పడుచుండును. అయినను - సాధకుడు చలింపక, ఓర్పు సడల నీయక, పట్టుదలతో సాధనను సాగించుట.

౭ అనుద్ధర్షము:-

సాధన ప్రభావమువలన సాధకునకు ఏవియో కొన్ని సామాన్య జనులకు లేని శక్తులు కలుగవచ్చు. పలువురు తన చుట్టును చేరవచ్చును. మహాత్ముడని కీర్తింపవచ్చును. ఉత్సవములు, పాద పూజలు సలుపవచ్చును. ఇట్టివానివలన, సాధకుని హృదయములో — నే నెంత గొప్పవాడను! అను ఒక అహంకారము పొడముటకు అవకాశము కలదు. అట్టి స్వాతిశయ భావమే ఉద్ధర్ష మనబడును. ఇది పతన హేతువు. కాబట్టి, యీ భావమును దరి జేరనీయకుండ వలెను. 'తద్దాస దాస చరమావధి దాస దాసః' అనునట్లు - వినయ సంపన్నుడై మెలగుటయే అనుద్ధర్ష మని నిష్కర్షార్థము. ఈ సాధన సహకముచే కలిగిన భవలన మానవుడు భగవదనుగ్రహ పాత్రుడై, ముక్తిని బడయును.

"మాం చ యో ఽవ్యభిచారేణ భక్తి యోగేన సేవతే
సగుణాన్ సమతీత్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే."
— (భగవద్గీత : 14 – 26)

దృఢమైన భక్తి యోగముచే తన్ను సేవించువాఁడు పునర్జన్మకు కారణభూతములగు సత్త్వ రజ స్తమస్సులను జయించి, మోక్ష పదమును పొందు నని గీతాచార్యు లానతిచ్చిరి.

ఈ సాధన సౌకర్య రహస్యమును గుర్తించినవా రెల్లరును తమ కీ భక్తియే భగవంతుఁ డనుగ్రహింపవలసిన దని యాకాంక్షించిరి. భక్తాగ్రగణ్యు లగు కులశేఖరాళ్వారులు —

"నాస్థా ధర్మే న వసు నిచయే నైవ కామోపభోగే
యద్యద్భవ్యం భవతు భగవన్ ! పూర్వ కర్మానురూపమ్
ఏత త్ప్రార్థ్యం మమ బహు మతం జన్మ జన్మాంతరేఽపి
త్వ త్పాదాంభోరుహ యుగ గతా నిశ్చలా భక్తి రస్తు."
— (ముకుందమాల – 5)

నా పూర్వ కర్మానుఁ బట్టి ధర్మార్థ కామ భోగము లేవైన కానిమ్ము – నేను పట్టించుకొనను. ఒకటిమాత్రము నేను ప్రార్థింతును. ఓ స్వామీ ! జన్మ జన్మలకును అచంచలమైన నీ పాద భక్తిని అనుగ్రహింపుము.'

అధిగత నిఖిలాగమ తత్త్వజ్ఞు లగు యామున యోగీంద్రులు –

"అవబోధితవా నిమాం యథా
మయి నిత్యాం భవ దీయతాం స్వయమ్
కృపయైవ మనన్య భోగ్యతాం
భగవన్ ! భక్తి మపి ప్రయచ్ఛ మే."
— (స్తోత్ర రత్నము : 54)

నిచ్చలును నేను నీవాఁడనే యని గుర్తించితిని. ఓ దేవ దేవా! దయతో నీయం దనన్య భోగ్య మగు భక్తినిఁగూడ కలుగనీయవే' అనియు, ఆచార్య శేఖరు లగు భగవద్రామానుజులు -

"అఖిల భువన జన్మ స్థేమ భంగాది లీలే
విసత వివిధ భూత వ్రాత రక్షైక దీక్షే
శ్రుతి శిరసి విదీప్తే బ్రహ్మణి శ్రీనివాసే
భవతు మమ పరస్మిన్ శేముషీ భక్తి రూపా."

- (శ్రీ భాష్యారంభ మంగళాచరణము)

జగముల కెల్ల సృష్టి స్థితి లయ కారుఁడును - ప్రపన్నుల కేడు గడయు - పాపల్కుల తలపూవై వెలయువాఁడును - పరబ్రహ్మయు అగు శ్రీనివాసునియందు నాకు భక్తి కుదురుగాక! అనియు విన్న వించుకున్నారు.

ఆ భక్తి తొమ్మిది విధములై యుండు ననియు, ఈ నవ విధ భక్తితోను పురుషోత్తము నారాధించి సాధకుఁడు ముక్తి నొందవలె ననియు, ఇదియే సమస్త విజ్ఞాన సార మనియు తత్త్వ విదులు వక్కాణింతురు. భక్తాగ్రేసరుఁడగు ప్రహ్లాదుఁడు - 'గురువుల వలన నీ వేమి నేర్చితి' వని యడిగిన తండ్రి కిట్లు చెప్పెను :-

"శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనమ్
అర్చనం వందనం దాస్యం సఖ్య మాత్మనివేదనమ్
ఇతి పుంసార్పితా విష్ణౌ భక్తి శ్చేన్నవ లక్షణా
క్రియతే భగవత్యద్ధా తన్మన్యేఽధీత ముత్తమమ్."

- (భాగవతము : 7 - 5 - 23, 24)

శ్రవణాదు లగు తొమ్మిది ప్రకారములలో శ్రీహరిని సేవించుట సమస్త విద్యల సారము. ఇదియే నేను నేర్చినది.'

ప్రపత్తియోగము

మోక్ష ప్రాప్తికి ప్రపత్తికి మించిన సాధనము లేదని పరమ భాగవత సిద్ధాంతము. సాధకుఁడు సర్వాత్మనా తనను సర్వేశ్వరునకు సమర్పించుకొనుటయే ప్రపత్తి యోగము. ఇదియే ఆత్మ నివేదన పరమైన భక్తి ప్రకారము. దీనికి శరణాగతి యని ప్రసిద్ధ నామము. న్యాసము, సన్న్యాసము, భర న్యాసము, సాధ్య భక్తి, త్యాగము మొదలైనవి దీనికే పర్యాయ పదములు. భాగవత ధర్మమైన యీ ప్రపత్తిదర్శనము – వేదము, ఉపనిషత్తులు, పురాణములు, భగవద్గీత, భగవచ్ఛాస్త్రము మనఁబడు పాంచరాత్రాగమము మున్నైన ప్రామాణిక గ్రంథము లన్నింటిలోను ప్రతిపాదితమైనది. బ్రహ్మ, నారద, మహర్షి, కపిలాచార్యుఁడు వంటి పలువురిచే అనుష్ఠింపఁబడినది. ఆళ్వార్లచే, ఆచార్యులచే ఆదరముతో ఆచరింపఁబడినది.

వేదము :

ప్రపత్తి ధర్మము వేద ప్రతిపాదితము.

"తం పత్నీభి రనుగచ్ఛేమ దేవాః
పుత్రైర్భ్రాతృభి రుతవా హిరణ్యైః
వాకం గృష్ణానాః సుకృతస్య లోకే
తృతీయే పృష్ఠే అధిరోచనే చ."

– (యజుర్వేదము : 15 - 50)

పుణ్య భాజను లగు మహా భక్తులకే ప్రవేశింప నలవి యైనదియు – స్వర్గాది లోకముల కెల్ల పైన దివ్య కాంతులతో విలసిల్లుచు – త్రిపాద్విభూతి యనఁబరగుచుండు నీ సన్నిధిని, పరమ పదమును పొందుటకై ఓ స్వామీ ! మా స్త్రీలతోను, మా సంతానముతోను, మాకు గల సర్వ సంపదలతోను నిన్నే శరణు వేడుచున్నాము అను భావ మిచ్చు ఈ వేద వాక్యములో – ముముక్షు వగు మానవుఁడు

తన సర్వస్వమును భగవ దర్పణము గావించి, శరణాగతి చేయవలె నను ఉపాయ ముపదిష్ట మైనది.

తైత్తిరీయారణ్యకము :-

బ్రహ్మ విద్య, పురుష విద్య అను పేళ్ళతో ప్రసిద్ధి కెక్కిన ఆత్మార్పణ రూపమైన ఈ న్యాస విద్య - తైత్తిరీయారణ్యకములో మిక్కిలి స్పష్టముగా నిరూపింపబడినది :-

ప్రజాపతి పుత్రుడైన ఆరుణి యను తత్త్వ జిజ్ఞాసువు - ఆత్యోద్ధరణమునకు సాధనములెవ్వి ? ' యని తన తండ్రిని ప్రశ్నించెను. అందులకు అతని తండ్రి ప్రజాపతి - సత్యము, తపము, దమము, శమము, దానము, ధర్మము, ప్రజోత్పత్తి, అగ్నిపూజ, అగ్నిహోత్రము, యజ్ఞము, మానసోపానము, న్యాసము అనునవి ఆత్యోద్ధరణమునకు సాధనములు అని చెప్పెను. ఆ మాట విని ఆరుణి - ' పండ్రెండు సాధనములలోను శ్రేష్ఠమైన దేది ? అని తిరిగి యడిగెను. అంత ప్రజాపతి -

"తాని వా ఏతా న్యపరాజి పరాంసి న్యాస ఏ వాచరేత్."

- (తైత్తిరీయోపనిషత్తు : 16-78)

'నాయనా ! ఈ చెప్పిన సత్యము మొదలు - మానసోపానము వఱకు గల పదు నొకండు సాధనములును సహకార సాధనములే. న్యాస మనెడి భగవ చ్ఛరణాగతియే ముక్తికి ముఖ్యోపాయముగా గుర్తింపుము' అని తత్త్వార్థమును బోధించెను.

తైత్తిరీయమునసే మఱి యొకచో ఈ న్యాస విద్య యిట్లు చెప్పబడినది :-

"ఓం వసురస్యే విధూరసి ప్రాణే త్వమసి నందాతా. బ్రహ్మన్ త్వమసి విశ్వ ధృత్. తేజోదాస్త్వమసి పర్చోదాస్త్వమసి చంద్రమస ఉపయామ గృహీతోఽసి బ్రహ్మణే త్వా మహసే."

"ఓ మిత్యాత్మానం యుంజీత. ఏతద్వై మహోపనిషదం దేవానాం గుహ్యం: య ఏవం వేదః బ్రహ్మణో మహిమాన మాప్నోతిః తస్మా ద్బ్రహ్మణో మహిమానమ్."

(తైత్తిరీయోపనిషత్తు : 10-12)

'ఓ పురుషోత్తమా! నీవు తేజోమయుండవు; సువర్ణ స్వరూపుండవు; సర్వ వ్యాపకుండవు; జీవి లోకమునకు శక్తి ననుగ్రహించువాండవు; ఈ విశ్వము నెల్ల నీవే ధరించువాండవు; అగ్నికి తేజస్సును, చంద్రునకు కాంతిని ప్రసాదించునట్టి వాండవు. అట్టి నిన్నే ముక్తికై శరణు వేడుచున్నాము.'

'ఓం' అను ప్రణవార్థమును గుర్తించి, తనను పరమాత్మకు సమర్పింపవలెను. ఇదియే సర్వోపనిషత్తుల సారము. ఇది దేవతలకు గూడ గుహ్య మైనది. ఈ న్యాస విద్య నెఱిగిన సాధకుడు ముక్తి నొందును.

ఈ పై వేద వాక్యములలో - పరబ్రహ్మ స్వరూప స్వభావములును లెస్సగా ప్రస్తుతింపబడినవి. జీవ లక్షణము నిర్దిష్ట మైనది. జీవునకు కర్తవ్య మైన శరణాగతి యుపదిష్ట మైనది. తదనుష్ఠాన ప్రక్రియయు ప్రదర్శిత మైనది. ప్రణవానుసంధానముననే ముముక్షు వీ ప్రపత్తి తత్త్వము గుర్తింపఁగలఁడని సూచింపఁబడినది. అయినచో ప్రణవార్థ మేమి ? ఆచార్యులు ప్రణవార్థము నిట్లు వివరించిరి:-

"అకారార్థో విష్ణుః జగ దుదయ రక్షా ప్రలయ కృత్
మకారార్థో జీవః త దుపకరణం వైష్ణవ మిదమ్
ఉకారోఽనన్యార్హం నియమయతి సంబంధ మనయోః
త్రయీ సార స్త్రోత్మా ప్రణవ ఇమ మర్థం నమదిశత్."

- (అష్ట శ్లోకి 1.)

అ+ఉ+మ్=ఓమ్. అకారము, ఉకారము, మకారము అను మూడక్షరములు చేరి ప్రణవ మైనది. ఇందలి అకారము విష్ణు వాచకము. ఆ మహా విష్ణువే జగములకు సృష్టి స్థితి లయములకు కర్త. సర్వేశ్వరుడు అను విష్ణ్వర్థమును అకారము బోధించుచున్నది. మకారము జీవ వాచకము. ఈ జీవ సముదాయము, జగత్తు అంతయు శ్రీమన్నారాయణునకు భోగ్య వస్తువు. ఇది యంతయు అతనిదే యను భావమును తెలుపుచున్నది. ఉకారము అవధారణార్థకము. 'ఈ జీవకోటియు, జగత్తును ఆ పరమాత్మదే. ఇతరుల దే మాత్రము కాదు' అను తాత్పర్యమును ప్రకటించుచున్నది. కాగా, దీని సారాంశము - శ్రీమన్నారాయణుడే సర్వజగత్స్వామి, జీవాత్మదారుడు. స్వామి యైన యా శ్రీ హరికే అతనిదే యైన ఆత్మను సమర్పించుకొనుట యుక్తము. జీవ స్వరూపమున కనురూపమైన ధర్మము' అని పండితార్థము. ఇదియే న్యాస విద్య.

ముండకోపనిషత్తు :-

సాధకుడు ప్రణవముతో అనుష్ఠింపవలసిన ఈ న్యాస విద్యను ముండకోపనిషత్తులో ధానుష్కుడు లక్ష్య వేధనమునకు గావించు నట్టి శర ప్రయోగముగా రూపించి చిత్రించెను.

"ప్రణవో ధనుః శరో హ్యాత్మా, బ్రహ్మ తల్లక్ష్య ముచ్యతే
అప్రమత్తేన వేద్ధవ్యం, శరవ త్తన్మయో భవేత్."

— (ముండకోపనిషత్తు : 2 - 4)

'ఓంకారమే విల్లు. జీవాత్మయే అమ్ము. పరమాత్మయే గుఱి. సాధకుడను విలుకాడు మిక్కిలి మెలకువతో ఆ గుఱిని కొట్టవలెను. అమ్ము వెళ్ళి, గుఱిలో చొచ్చుకు పోయినట్లు జీవాత్మ పరమాత్మను చేరును' — అని భావము.

శ్వేతాశ్వతరోపనిషత్తు :-

మోక్షేచ్ఛ గల సాధకులు శ్రియఃపతినే శరణు వేడుకొనవలసి యున్న దను పరమార్థమును శ్వేతాశ్వతరోపనిషత్తు కూడ ఇట్లు నిర్దేశించినది :-

"యో బ్రహ్మాణం విదధాతి పూర్వం
యో వై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై
తగ్ంహ దేవ మాత్మ బుద్ధి ప్రకాశం
ముముక్షుర్వై శరణ మహం ప్రపద్యే."

'లోక నిర్మాణమునకు సాధనముగా తొలుత చతుర్ముఖ బ్రహ్మను సృష్టించి, తత్సృతికి హేతు వగు ధర్మమును ప్రదర్శించు వేదములను వెలయించి, ఆతని కనుగ్రహించి, సర్వాత్మ ప్రకాశకుఁడుగా వెలుఁగు చున్న ఆ దేవ దేవుని, ము క్తిని గోరి శరణు పొందుచున్నాను.' అ ట్లనుట – ముముక్షు ధర్మ మైన శరణాగతి యిందు వాచ్యముగనే తెలుపఁబడినది.

భగవ చ్ఛాస్త్రము :-

భాగవత ధర్మమునకు ప్రధాన ప్రమాణములలో ఒకటి యైన పాంచరాత్రాగమ శాస్త్రము – ఆత్మన్యాసము మోక్ష సాధనము లలో ఉత్తమమైనదిగా వా కొన్నది.

"ప్రపత్తిం తపసా మేషాం న్యాసాఖ్యా మాహు రుత్తమామ్
సన్యాస స్త్యాగ ఇ త్యుక్తిః శరణాగతి రిత్యపి."
— (విష్వక్సేన సంహిత : 4-8)

మోక్ష సాధన రూపములైన నిష్ఠ లన్నింటిలో – న్యాస మనునదియే మేటి. సన్న్యాసము, త్యాగము, శరణాగతి అనునవి దీనికే నామాం తరములు – అని శాస్త్రము.

లక్ష్మీ తంత్రమున కూడ ఈ ప్రపత్తివిద్యా స్వరూపము విపులముగా వర్ణింపఁబడినది. ప్రణవములో చేయఁదగు న్యాస రూప యజ్ఞము ఈ తంత్రములో ఇట్లు వివరింపఁబడినది :-

"జీవాత్మానం హవిః కృత్వా తచ్ఛరీరం మహీయసి
బ్రహ్మాగ్నౌ జుహుయా దోమి త్యనే న్నామ్నాయ రూపిణా
ఇతి ప్రపత్తే రాఖ్యాతః ప్రయోగః ప్రణవాత్మనా
తస్యైవ విదుషో యజ్ఞం శరీరే తత్ర కల్పితః."

జీవాత్మ యను హవిస్సును, పరమాత్మ యను అగ్నిలో - ప్రణవ మంత్ర మగు ఓంకారముతో హోమము చేయవలెను. ఇదియే ముముక్షు వగు సాధకునకు వేద హితమైన ప్రణవ యజ్ఞ రూప మైన ప్రపత్తి యోగము.'

భగవద్గీత :-

ప్రపత్తి దర్శనమునకు గీతాశాస్త్రము విజయ ధ్వజము వంటిది. భక్తశేషుఁడగు అర్జునుని వ్యాజముగా గొని, యోగీశ్వరుఁడగు శ్రీకృష్ణ భగవానుఁడు ముముక్షువుల కెల్ల పరమోపాదేయ మైన ప్రపత్తి ధర్మమును సవిస్తరముగా గీతలో ఉపదేశించెను.

"యచ్ఛ్రేయస్స్యా న్నిశ్చితం బ్రూహి తన్మే
శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్."

— (భగవద్గీత : 2 - 7.)

'నా కేది మేలో తెలియ కున్నది. స్వామీ ! నిన్నే శరణు పొంది నాను. నీ శిష్యుఁడను, నాకు మే లేదియో తెలియఁ జెప్పుము' - అనుచు పార్థుఁడు చేసిన ప్రపత్తితో ప్రారంభమైనది గీత. నడుమ నడుమ పెక్కు సందర్భములలో ప్రపత్తి ప్రస్తుతమైనది.

"యే యథా మాం ప్రపద్యంతే
తాం స్తథైవ భజా మ్యహమ్."

– (4-11.)

'ఎవ రెట్లు నన్ను పాసింతురో – వారికి నే నట్లే ఫల ప్రాపకుడ నగుదును.'

"మా మేవ యే ప్రపద్యంతే
మాయా మేతాం తరంతి తే."

– (7-14)

'నన్ను ప్రపత్తితో కొల్చినవారు ఈ సంసార సంబంధి యగు మాయను దాటి, ముక్తి నొందుదురు.'

"మాం హి పార్థ వ్యపాశ్రిత్య యేఽపి స్యుః పాప యోనయః
స్త్రియో వైశ్యా స్తథా శూద్రా స్తేఽపి యాంతి పరాంగతిమ్."

– (9-32)

'నన్ను శరణు బొందినవా రెవరైనను ముక్తిని బడయుదురు.'

"తతః పదం త త్పరిమార్గితవ్యం
యస్మిన్ గతా న నివర్తంతి భూయః
త మేవ చాద్యం పురుషం ప్రపద్యే
యతః ప్రవృత్తిః ప్రసృతా పురాణీ."

– (15-4.)

'చిరంతన మగు మాయా శక్తి ఏ పరమాత్మనుండి బయలు దేరినదో, ఆ పరమాత్మను శరణు పొందెదను – అను భావముతో, పున రావృత్తి రహితమైన ముక్తి పదమును పొందుకొనలెను.'

"త మేవ శరణం గచ్ఛ సర్వ భావేన భారత!
త త్ప్రసాదా త్పరాం శాంతిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్."

– (18-62.)

'మనో వా క్కాయ కర్మలతో ఆ పరమాత్మనే శరణు పొందుము ఆ సర్వేశ్వరుని యనుగ్రహమున నీవు ముక్తి నొందుము.'

కడపట గూడ గీతాచార్యులు ప్రపత్తి ధర్మమునే యిట్లు బోధించిరి :-

"సర్వ ధర్మాన్ పరిత్యజ్య మాం మేకం శరణం వ్రజ
అహం త్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః."
– (18-66)

'సకల కర్మ ఫల త్యాగము చేసి, నన్నే శరణు పొందుము. ని న్నే పాపములు పోకకుండునట్లు చేసి, ముక్తి నొసంగుదును. చింతిల్లకుము.'

దీనిని చరమ శ్లోక మందురు. ఇది ముముక్షువులకు ముంగొంగు బంగారము. ఈ విధముగా గీతా శాస్త్రము ఆది మధ్యాంతము లయం దంతటను ప్రపత్తి దర్శనమును ప్రదర్శించుచు, ప్రపన్నులకు పరమ ప్రమాణ మైనది. ప్రపత్తి శాస్త్ర లక్ష్మికి తిలకాయమాన మైన యీ క్రింది గీతా శ్లోక ము ముముక్షువులకు నిత్యాను సంధేయము :-

"మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు
మా మే వైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోఽసి మే."

'నేను ప్రతిజ్ఞ చేసి చెప్పుచున్నాను. పరమాత్మ నగు నా యందే మనసు నిల్పుము. నన్నే భక్తితో భజింపుము. న న్నుద్దేశించియే యాగాదులు చేయుము. నన్నే నమస్కరింపుము. నన్నే పొందుదువు. నిక్కము.' ఇందు ప్రబోధిత మైనదే అనన్య భక్తి. అట్టి అనన్య భక్తితో పరమాత్మకు ఆత్మ సమర్పణము చేయుటయే ప్రపత్తి.

ప్రపత్తి మూలమునసే పరబ్రహ్మ యగు శ్రీమన్నారాయణుఁడు లభ్యుఁడగు నను విషయమును భగవద్గీతా శాస్త్రము సుస్పష్టముగా ప్రకటించిన దని యామునాచార్యులవారిట్లాన తిచ్చిరి :-

"స్వ ధర్మ జ్ఞాన వైరాగ్య సాధ్య భక్త్యేక గోచరః
నారాయణః పరం బ్రహ్మ గీతా శాస్త్రే సమీరితః."

'స్వ ధర్మానుష్ఠానమువలన జ్ఞానము, జ్ఞానము వలన వైరాగ్యము, వైరాగ్యముచే భక్తి, భక్తిచే సాధ్య భక్తి యనఁబడు ప్రపత్తి యు కలుగును. అట్టి ప్రపత్తిచేతనే పరబ్రహ్మ యగు శ్రీమన్నారాయణుఁడు గోచరించు ననిగీతా శాస్త్రము వక్కాణించుచున్నది.'

పరమ ప్రపన్న శిఖామణు లగు కొందఱు మహాత్ముల ముఖ కమలములనుండి వెలువడిన ప్రపత్తి సూక్తి పరిమళములు కొన్ని యివి :-

ఁ. "భవతు శరణ మేకో విష్ణుపోతో నరాణామ్."
– (ముకుందమాల : 12)

'ఈ సంసార సాగరమును దాటుటకు శ్రీహరి యను నౌకయే మాకు శరణ్యము.'
– శ్రీ కులశేఖరులు.

ఁ. "అగతిం శరదాగతం హరే!
కృపయా కేవల మాత్మసా త్కురు."
– (స్తోత్రరత్నము : 46)

'దిక్కు లేనివాఁడను. నిన్నే శరణు పొందినవాఁడను. ఓ పురుషోత్తమా! దయచే నన్ను నీ వాఁడను చేసికొనుము.'
– శ్రీ యామునమునివర్యులు.

౩. "త దయం తవ పాద పదయో
రమహద్యైవ మయా సమర్పితః."

– (స్తోత్రరత్నము - 52.)

'ఓ స్వామీ ! నీవే నా యేడుగడవు. కావున, నేఁడు నన్ను నేనే నీ పాద పద్యములయందు సమర్పించుకొనుచున్నాను.'

– శ్రీ యామునమునిపర్యాలే.

౪. "పితరం మాతరం దారాన్ వుత్రాన్ బంధూన్ నఖీన్ గురూన్
రత్నాని ధన ధాన్యాని క్షేత్రాణి చ గృహాణి చ
సర్వ ధర్మాంశ్చ సంత్యజ్య సర్వ కామాంశ్చ పాక్షరాన్
లోక విక్రాంత చరణౌ శరణం తేఒవ్రజం విభో !"

– (శరణాగతి గద్య)

'తల్లి దండ్రులు, ఆలు బిడ్డలు, చుట్టములు, నెచ్చెలులు, ఒజ్జలు, సిరి సంపదలు, పొలములు, ధర్మములు, కామములు – అన్నియు వీడి, ఓ శ్రియఃపతీ ! ముల్లోకముల నతిక్రమించిన నీ చరణారవిందములనే శరణు జొచ్చినాను.'

– శ్రీ భగవద్రామానుజ యతి సార్వభౌములు.

౫. "ఆగతి రశరణో భవాబ్ధౌ లుఠన్
వరద ! శరణమి త్యహ త్వాం వృణే."

– (వరదరాజ స్తవము : 82.)

'ఈ సంసార సముద్రములో పడి కొట్టుకొనుచున్న దిక్కు లేని వాఁడను. ఓ వరదరాజా ! నిన్నే శరణు పొందినాను.'

– శ్రీవత్సచిహ్నమిశ్రులు

౬. "ఆయుః ప్రజానా మమృతం సురాణాం
రంగేశ్వర ! త్వాం శరణం ప్రపద్యే."

(– శ్రీరంగరాజ స్తవము : 82.)

'మానవులకు ఆయువును, దేవతలకు అమృతము నైన శ్రీ రంగనాథా నిన్నే శరణ్యుఁడవుగా ఆశ్రయించితిని.'

- (శ్రీ పరాశర భట్టాచార్యులు.)

నిత్య సూరులు, దేవతలు, ఋషులు, అళ్వారులు, ఆచార్యులు - వీరు వా రన నేల ! పరమ భాగవతు లెల్లరును ప్రపత్తి మార్గానుయాయులై, ముక్తులై బ్రహ్మానందమును బడసినారు.

అతి పవిత్రమైన యీ భాగవత ధర్మ తత్త్వ మెఱిఁగినవా రే చాలఁ అరు దని చెప్పఁబడు, అట్టివారిలో కొండఱను శ్రీమద్భాగవత మిట్లు పేర్కొన్నది :—

"స్వయం త్రి ర్వారద శ్శంభుఃకుమారఃకపిలో మనుఃప్రహ్లాదో జనకో భీష్మో బలి ర్వైయాసికి ర్వయమ్ద్వాదశైతే విజానీమో ధర్మం భాగవతం భటాఃగుహ్యం విశుద్ధం దుర్బోధం యజ్ఞాత్వాఽమృత మశ్నుతే."

- (శ్రీమద్భాగవతము : 6 స్కం. 36-20,21)

'చతుర్ముఖ బ్రహ్మ, నారదుఁడు, శివుఁడు, కుమార స్వామి, కపిలుఁడు, మనువు, ప్రహ్లాదుఁడు, జనక మహారాజు, భీష్ముఁడు, బలి చక్రవర్తి, శుక మహర్షి, నేను (యముఁడు) మేము పండ్రెండుగురము, పవిత్రమును - రహస్యము నైన యీ భాగవత ధర్మము నెఱుఁగుదుము. ఈ ధర్మము నెఱిఁగినవారు మోక్షము నొందుదురు' అని యమధర్మరాజు తన భటులకు చెప్పి, అట్టి వారిని చెనకబోకుఁడని హెచ్చరించెను.

ప్రపత్తికి దేశ కాలాది నియమములు లేవు. ఈ ప్రపత్తి ననుష్ఠించుటకు 'ఇదిగో! ఈ చోటే తగినది. ఈ సమయమే సరియైనది. ఈ జాతివాఁడే యర్హుఁడు' - అనుచు ఎట్టి కట్టుబాటు లేదు. ఏ

దేశమం దైనను, ఏ సమయమం దైనను, ఏ స్థితిలో నైనను, ఎవ్వ రైనను, ఏ ఫలముకొఱ కైనను ఈ ప్రపత్తి దర్శనము నాశ్రయింప వచ్చును. అయినను, నశ్వరము లగు ఫలములను కోరి ప్రపత్తి చేయువానికంటె, శాశ్వత ఫలము నాకాంక్షించి ప్రపత్తి చేయు వాఁడు వివేకి యగును కదా! అట్లే, అల్ప శక్తు లగు దేవతాంత రముల నాశ్రయించువానికన్న, సర్వశక్తి సంపన్నుఁ డగు శ్రీమ న్నారాయణు నాశ్రయించువాఁడు మిన్న కదా!

శ్రీమద్రామాయణము, మహాభారతము, భాగవతము అను నవి ప్రపత్తి నిష్ఠకు ప్రధానములైన లక్ష్య గ్రంథములుగా చెప్ప వచ్చును. శ్రీమద్రామాయణమునకు దీర్ఘ శరణాగతి యను ఖ్యాతియే కలదు. అందు శరణాగతి వహించినవారి సంఖ్య యొక్కువ యని భావము. శ్రీవచన భూషణము శరణాగతి దర్శనమునకు భాష్య మనఁదగినది. ప్రపత్తి కెట్టి నియమములు లే వను విషయము ఆ యాయి గ్రంథములను, అం దందు ప్రపత్తి ననుష్ఠించిన వ్యక్తుల స్థితి గతులను పరిశీలించిన స్పష్ట మగును.

జటాయు కాకాసురులు పక్షులు; కాళీయ నాగము విష సర్పము; శబరి, గుహుఁడు నిషాదులు. అయినను ప్రపత్తి కర్హులే యైనారు. కావున, జాతి భేదము కాని, పశు పక్షి విచక్షణము కాని - ప్రపత్తికి ఆటంకములు కా వని తెలిసినది. అట్లే, ద్రౌపది రజ స్వలయై యున్న సమయమున ప్రపత్తి చేయవలసివచ్చినది. అట్లయ్యు - సర్వేశ్వరుని యనుగ్రహమును బడయఁగలిగినది. దీనిచే, అంతరంగ శుద్ధియే యిందు ముఖ్యమైన దని తెల్ల మైనది. అట్లన్నంత మాత్ర మున ప్రపన్నునకు బాహ్య శౌచ మక్కఱలే దని కాదు. అసాధా రణ స్థితిలో ఎట్లైనను ప్రపత్తి చేయవచ్చు ననుటయం దే తాత్పర్యము.

ప్రపత్తి - అర్చావతారము :-

సర్వేశ్వరుని స్వరూప ప్రకారము లైదు విధము లని శాస్త్రములు తెలుపుచున్నవి. అవి – పర స్వరూపము, వ్యూహ స్వరూపము, విభవ స్వరూపము, అంతర్యామి స్వరూపము, అర్చా స్వరూపము. వీనిలో – ముముక్షువు ప్రపత్తి చేయుటకు ఏది తగినది? అను ప్రశ్న వచ్చినప్పుడు – నిజమునకు వీనిలో ఎం దైనను ప్రపత్తి చేయవచ్చు నని తేలికగా సమాధానము చెప్పుకొనఁ దగును. కాని, ప్రపత్తి నాచరించువాని శక్తి స్వభావాదులనుఁబట్టి పరికించినచో – ఇందును కొంత సౌలభ్య సౌకర్య భేదములు కనఁబడును. సర్వేశ్వరుని యీ పంచ విధములైన స్వరూపములను, అవ్వాని స్వభావమును పరిశీలించినపుడు, అర్చా స్వరూపమే ముముక్షువునకు మిక్కిలి సన్నిహిత మైనట్లును, అందు ప్రపత్తిని చేయుటయే సుకర మైనట్లును తోచకమానదు. క్లుప్తముగా పర వ్యూహాదుల స్వరూపమిది :-

పర స్వరూపము :-

ఇది సర్వేశ్వరుని శుద్ధ సత్త్వ తత్త్వము. జ్ఞాన శక్తి బలైశ్వర్య వీర్య తేజోరూప సమగ్ర షడ్గుణ పరిపూర్ణము. పర వాసుదేవాభిదము, త్రిపా ద్విభూతికి సంబంధించినది. నిత్య ముక్తానుభావ్యము. ఇది సామాన్యుల ఊహకే దుర్లభమైనది.

వ్యూహ స్వరూపము -:

ఇది సంకర్షణుఁడు, ప్రద్యుమ్నుఁడు, అనిరుద్ధుఁడు – అని వ్యవహరింపఁబడుచుండు సర్వేశ్వరుని అంశ త్రయాత్మకము. పురుషోత్తముని సమగ్రములైన ఆఱు గుణములు రెండేసి చొప్పున విభక్తములై యేర్పడివారు సంకర్షణాదులు. ఈ త్రిమూర్తి స్వరూపమే వ్యూహము. ఈ పర వ్యూహ స్వరూపములను పరాశర భట్టాచార్యులవా రిట్లు వివరించిరి :-

108815

"షాడ్గుణ్యా ద్వాసుదేవః పర ఇతి స భవాన్ ముక్తభోగో బలాద్యాత్
బోధాత్ సంకర్షణ స్త్వం హరసి వితనుషే శాస్త్ర మైశ్వర్య వీర్యాత్
ప్రద్యుమ్నః సర్గ ధర్మౌ నయసి చ భగవన్ శక్తి! తేజోఽనిరుద్ధః
విభ్రాణః పాసి తత్త్వం గమయసి చ తథా వ్యూహ రంగాధిరాజ!
- (శ్రీ రంగరాజ స్తవము - ఉత్తర శతకము : 39)

'శ్రీ రంగాధీశ్వరుఁడవుగా వెలసిన ఓ జగన్నాయకా! సంపూర్ణమైన షడ్గుణ సంపత్తిచే మనఁబడుచు నీవు ముక్తులకే గోచరుఁడవు; భోగ్యుఁడవు. బల జ్ఞానములచే సంకర్షణాఖ్య వహించి లయ కారివియు, వేదాది శాస్త్ర చక్షు ర్దాతవు నగుదువు. ఐశ్వర్య వీర్యములచే ప్రద్యుమ్నాభిధేయుఁడవై సృష్టి కృత్యమును, ధర్మపాలనమును కావించుచుందువు. శక్తి తేజస్సులచే అనిరుద్ధ నాముఁడవై సితి కృత్యమును, సద్గతి ప్రాప కృత్యమును నెరపుచున్నావు -' అని భావము. పరము వలె ఈ విభవ స్వరూపమును సాధకునకు దురావాపము.

విభవ స్వరూపము :-

ధర్మమునకు దెబ్బ తగిలి, అధర్మము పెచ్చు పెరిగి, లోక సితి చీకాకు నొందు సమయమునం దెల్ల దానిని చక్క దిద్దుటకును, దుర్జనులను శిక్షించి, సజ్జనులను రక్షించుటకును సర్వేశ్వరుఁడు తన నిత్య విభూతినుండి ఆ యా యవసరమునుఁ బట్టి, దేవ మనుజ తిర్యగ్రూపములలో ఏదేని రూపమును గ్రహించి, లీలా విభూతిలోనికి దిగి వచ్చును. ఇదియే అవతారము, ఇదియే నిజ స్వరూపము.

భగవద్గీతలో -

"యదా యదా హి ధర్మస్య గ్లాని ర్భవతి భారత!
అభ్యుత్థాన మధర్మస్య త దాత్మానం సృజా మ్యహమ్."
"పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే."
— (భగవద్గీత : 4 - 7, 8.)

అను విధముగా భగవంతుఁడు తా నవతరించు అవసరమును, ప్రయోజనమును ఆన తిచ్చెను. మత్స్య కూర్మాదులు తిర్య క్ప్రభా వావతారములు కాఁగా – రామ కృష్ణాదులు మానవ ప్రభావతార ములు. వీనిలో కొన్ని అంశావతారములు. శ్రీ రామ కృష్ణావతార ములు మాత్రము పూర్ణావతారము లని విజ్ఞులు నిర్ణయించిరి. ఇట్టి యవతారములయందు ప్రపత్తి చేయుట సుకరమే. కాని, భ్రాంతి భూయిష్ఠమై, మనో ధర్మము ఆ యా యవతారములయందు సమ కాలికులకు సర్వేశ్వరత్వ బుద్ధిని కలుగనీయదు. వేద వేద్యుఁడగు పరమ పురుషుఁడు శ్రీరామచంద్రుఁడుగా రఘు వంశమున అవత రించగా, ఆ నాటివారిలో ఎంత మందికి ఆ దాశరథి – సర్వేశ్వరుని అవతార మని తెలిసినది? వసిష్ఠుఁడు, వాల్మీకి, విశ్వామిత్రుఁడు, భర ద్వాజుఁడు మొదలైన మహర్షులును, మఱి కొందరు భక్తులును మాత్రమే ఆ రఘువీరుని ప్రశయఃపతిగా గుర్తింపఁ గలిగిరి. అట్లే, శ్రీ కృష్ణుఁడై యదుకులమున అవతరించిన సమయమున, గర్గాది మునులు కొందఱు మాత్రమే అతనిని శ్రీమన్నారాయణునిగా తెలిసికొనఁగలిగిరి. తక్కిన వా రెల్లరును కృష్ణుని సామాన్యునిగ తల చిరి. ఈ విషయమును లీలా మానుష విగ్రహుఁడగు శ్రీ కృష్ణ భగ వానుఁడు స్వయముగనే యిట్లు వాక్రుచ్చెను :–

"అవజానంతి మాం మూఢాః మానుషీం తను మాశ్రితమ్
పరం భావ మజానంతో మమ భూత మహేశ్వరమ్."

— (భగవద్గీత : 9-11.)

"అసుర భావముతో నిండిన యవివేకులు స్వేచ్ఛతో లోక శ్రేయస్సు కొఱకు మానవుఁడనై జన్మించిన నన్ను – సర్వ నియంత యగు పరమాత్మగా గుర్తింపక, రాగ ద్వేషాదులతో మెలఁగుచు పరిభవింతురు."

"గరీయస్త్వం పరిజానంతి ధీరాః
పరం భావం మనుజత్వాది భూష్ణుమ్
అజానంత స్త్వవజానంతి మూఢాః
జనిమ్నంతే భగవన్ జన్మ కర్మ."

– (శ్రీ రంగరాజ స్తవము - ఉత్తర శతకము : 50.)

'ఓ పుండరీకాక్షా! నీవు మానవా ద్యాకృతులలో అవతరించినను, జ్ఞానులు నీవు పరబ్రహ్మ వని గుర్తింతురు. మూఢులో - జన్మ రా హిత్యకారణము లగు నీ అవతారములను, చేష్టలను గ్రహింప నేరక అవమానింతురు'– అని విజ్ఞులే భగవదవతార యాథార్థ్య మును తెలిసి కొనఁగల రని భావమును విశదీకరించిరి. కావున, ప్రపత్తికి విభవ స్వరూపముగూడ సుగ్రాహ్య మనఁజేరము.

అంతర్యామి స్వరూపము :-

జీవరాశి యెల్ల పరమ పురుషునకు శరీరము వంటిది. చరాచరాత్మకమైన జగత్తునం దంతటను వ్యాపించియున్నవాఁ డగుట చేతనే పరబ్రహ్మ వాసుదేవుఁ డని కీర్తింపఁబడుచున్నాడు. గీతాచార్యుఁడే -

"విష్టభ్యాహ మిదం కృత్స్న మేకాంశేన స్థితో జగత్."

— (భగవద్గీత : 10 - 42)

'అంతర్యామి రూపములో ఈజగత్తునం దెల్ల వ్యాపించియున్నాను' అనియు

"సర్వస్య చాహం హృది సన్ని విష్టః."

– (భగవద్గీత : 15-1.)

'సకల ప్రాణి సమూహము యొక్క హృదయమున నే నున్నాను – అనియు -

"ఈశ్వర స్సర్వ భూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి
భ్రామయన్ సర్వ భూతాని యంత్రారూఢాని మాయయా."

— (భగవద్గీత : 18 — 61)

'సర్వ భూతముల హృదయమునను నిల్చినవాఁడను నేనే. ఆ భూత రాశి నెల్ల రంగుల రాట్నమువంటి యంత్రము మీఁద నన్ను వారిని త్రిప్పినట్లు నా మాయచేత త్రిప్పిచున్నాను' – అనియు తన అంతర్యామి స్వరూపమును స్పష్టపఱచినాఁడు. అంతియే గాక –

"త మేవ శరణం గచ్ఛ సర్వ భావేన భారత!
త త్ప్రసాదాత్ పరాం శాంతిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్."

– (భగవద్గీత : 18–25.)

'అట్టి సర్వ ప్రాణి హృదయ పీఠాధిష్ఠితుఁడగు అంతర్యామి స్వరూపుఁడైన త దను గ్రహమున సంసారోపద్రవములెల్ల తోలఁగి, శాంతి నెలకొనును. ఆ స్వామిని శరణు పొందుము. శాశ్వతమైన మోక్ష పదము లభించును –' అని జగదాచార్యుఁడు అంతర్యామ్యుపాసనము నాదేశించెను.

సర్వ సాక్షీ భూతుఁడైన ఈ అంతర్యామి – ప్రతి సాధకునకును హృదయవాసియే కావున, నిత్య సన్నిహితుఁడై ప్రపత్తి ననుష్ఠింప అనువైనవాఁడేకాని, తన హృదయములోనే సర్వేశ్వరుఁడున్నాఁడను భావ ముదయించుటయే దుర్ఘటము. పర వ్యూహ స్వరూపములవలె ఈ అంతర్యామి స్వరూపమును అవ్యక్త తత్త్వమే యనవలసియుండుటచే, సాధనకును విశేష క్లేశ సాధ్య మగునేకాని, సులభము కాదు. కావున, శరణాగతికి అంతర్యామి స్వరూపము కూడ సుగమ్యము కాకపోవుచున్నది.

అర్చా స్వరూపము :-

నిరాకార సాకారోపాసనలు రెండును వైదిక మార్గములే యైనను, సాధకునకు సాకారోపాసనమే సుకర మని త ద్విదులు భావించిరి.

"క్లేశోఽధికతర స్తేషా మవ్యక్తాసక్త చేతసామ్
అవ్యక్తా హి గతి ర్దుఃఖం దేహవద్భి రవాప్యతే."

– (భగవద్గీత : 12 – 5)

'అవ్యక్త తత్త్వము అవాఙ్మానసగోచరము కావున, త దుపాసకులగు ముముక్షువులకు క్లేశ మెక్కువ. వారికి ముక్తి దొరకదని కాదు. దొరకును. కాని, అది మిక్కిలి కష్టముమీద గాని లభింపదు – అని భావము. సాకార మైనను – అది సాధకుని దేహేంద్రియ మనోబుద్ధులకు అందునది కావున, విశేష క్లేశము లేకుండగనే ఫలకారి యగు నని అభిప్రాయము.

కపాసుడు, పుండరీకాక్షుడు, సహస్రశీర్షుడు, సహస్రాక్షుడు, సహస్రపాత్తు – అను విధముగా పురుషోత్తముని, పద్మ హస్త, పద్మాలయ, పద్మపత్రాయతాక్షి – అను రీతిగా శ్రీ దేవిని వర్ణించుచు నడచిన వైదిక వాఙ్మయ ఛాయలు సాకారోపాసన భావమునకు ప్రాతిపదికలైనవి.

పరబ్రహ్మయగు శ్రీ మహావిష్ణువును దివ్య మంగళ విగ్రహుడు గాను, అఖిల హేయ ప్రత్యనీక కల్యాణ గుణ పరిపూర్ణుడు గాను తత్త్వ దర్శనులు రూపొందించుకొనిరి. 'మంత్రాధీనం తు దైవతమ్' అను రీతిగా – దారు శిలా లోహాది నిర్మితములైన అర్చా మూర్తులందు మంత్రానుష్ఠాన ప్రభావ మూలమున ప్రాణ ప్రతిష్ఠాదులు జరిపి, సర్వేశ్వర సాన్నిధ్యమును సాధించుకొన్నారు.

అర్చావతారములకు సంబంధించిన ఆలయ నిర్మాణము, మూర్తి రూప కల్పనము, ప్రతిష్ఠా విధి, మంత్ర హోమ నిత్యార్చనా పదతులు – మొదలైన సమస్త విషయములను తెల్లము చేయుచు, సాధకులకు మార్గ దర్శకములుగా పాంచరాత్రాదు లగు ఆగమ శాస్త్రములు వెలువడినని. ఈ ఆగమములు శ్రుతుల వలె పరమ ప్రామాణికము లైన ననియు, ముముక్షువుల ననుగ్రహింప శ్రీమన్నారాయణునిచేతనే యుపదిష్టములైన ననియు, విజ్ఞాన ధనులగు దేశికులు నిర్ణయించిరి.

భగవదనుగ్రహ ప్రాప్తికి గల మార్గములలో – అతి ముఖ్యమైన అర్చా స్వరూపోపాసన మార్గము నుపదేశించునది కావున, ఈ పాంచరాత్రాగమ శాస్త్రమునకు ఏకాయన శాస్త్ర మని ప్రసిద్ధి వచ్చినట్లు తెలియుచున్నది.

"శృణుధ్వం మనయ స్సర్వే వేద మేకాయనాభిదమ్
మోక్షాయనం వై పంథా ఏత దన్యో న విద్యతే
తస్మా దేకాయనం చేతి ప్రవదంతి మనీషిణః."

మోక్షమునకు ఇంతకంటె మించిన మార్గము లేదు కనుక, ఇది ఏకాయన మనఁబడుచున్నది. ఇది వేదమే.
ఛాందోగ్యోపనిషత్తులో –

"ఋగ్వేదం భగవోఽధ్యేమి, యజుర్వేదం, సామ వేద మధ్వర్వణం, వాకో వాక్యం, మేకాయనం చేతి"

అని చతుర్వేదములతోఁ బాటు ఈ భగవచ్ఛాస్త్రమైన ఏకాయనము పేర్కొనఁబడుట చూడ, దీని ప్రాముఖ్యమును, ప్రామాణ్యము ఎట్టివో తెల్ల మగుచున్నవి.

అట్టి శాస్త్రము లుపదేశించిన మార్గము ననుసరించి ప్రతిష్ఠితములైన భగవన్మూర్తులలో - ఆ పరబ్రహ్మ దివ్యశక్తి సంపూర్ణముగా ప్రసరించి, భక్తుల యభీష్టముల నీడేర్చును.

"సాధకస్య తథో యోగాత్ పూజాయా శ్చాతిశాయనాత్
అభిరూపాత్ చ బింబస్య సదా సన్నిహితోఽస్మ్యహమ్."

సాధకుఁడు గావించు తప శ్శక్తి వలనను, ఆతఁ డొనరించు పూజా విశేషము వలనను, మూర్తి సౌందర్యాధిక్యము వలనను స్వామి ఆ యా విగ్రహములలో సన్నిహితుఁడై యుండు నని ప్రమాణ వాక్యము.

సగుణోపాసకుఁ డగు భక్తుఁడు గృహార్చామూర్తిని గాని, ఆలయ ప్రతిష్ఠితమైన మూర్తిని గాని, త్రికరణ శుద్ధితో - అభిగమనము, ఉపాదానము, ఇజ్య, స్వాధ్యాయము లను విధముగా సమాపించి, ఫల పుష్పాదులు సమర్పించి, అనన్య భావముతో పూజించి, ఆ యా మూర్తుల కనుగుణములుగా నిర్దిష్టములైన మంత్రములను జపించి, ధ్యానించినచో - సర్వేశ్వరుని అనుగ్రహమున ఆ భక్తునకు అజ్ఞాన ధ్వంసక మగు బోధము పొడమును. దివ్య దృష్టి కలుగును. ఆ దివ్య దృష్టిచే ఆ భక్త వరునకు ఆ విగ్రహమునందే త్రిపాద్విభూతి లోనిదియు, దివ్య తేజోమయ మగునదియు అగు పరబ్రహ్మ స్వరూపము గోచరించును. విభవమైన కృష్ణావతారములో అర్జునునకు వసుదేవ పుత్రుఁడుగా - తన బంధువుగా - నెచ్చెలిగా - సాధారణుఁడుగా అంతవఱకు కనుపించుచుండిన శ్రీకృష్ణ పరమాత్మ ఆ యర్జునునకే దివ్య దృష్టి యను దృష్టి యనుగ్రహించిన పిమ్మట -

"తతో మామకం రూపం పశ్యాద్య సచరాచరమ్
పశ్యాన్ దేవ దేవస్య శరీరే పాండవ స్తదా."

— (భగవద్గీత : 11 - 13)

అన్నట్లు – విశ్వేశ్వరుఁడుగా, అనంత వీర్యామితవిక్రముఁడుగా గోచరించినాఁడు గదా! ఈ స్థితి సాధకునకు అర్చామూర్తి యందును సంభావ్యమే; సాధ్యమే. దృఢతరమైన భక్తితో భగవదర్చామూర్తి నారాధించు భక్తునకు ఆ స్వామి యనుగ్రహముననే ముక్తి లభించు ననునది సదాచార్యులగు భారతీయులందఱ విశ్వాసమగుటయే కాదు – యుగ యుగములుగా కలుగుచు వచ్చిన యనుభవమును, అనుభూత మగుచున్న సత్యము కూడ.

దివ్య క్షేత్రములలోని భగవన్మూర్తులు కొన్ని స్వయంవ్యక్తము లనియు, కొన్ని ఋషి ప్రతిష్ఠితము లనియు, కొన్ని మహాభక్త ప్రతిష్ఠితము లనియు ఆ యా స్థల పురాణాదులు పేర్కొనుచున్నవి. స్వాచార్య నియమనముచే గృహములందు నెలకొల్పుకొని ఆరాధించునవి గృహార్చామూర్తు లనఁబడును. నిత్య యుక్తులగు ఉపాసకులకు ఇవి యన్నియు ఏక రూపములే. 'ప్రతిమాయాం విష్ణు భావః' – 'సాలగ్రామే హరి భావ దర్శనమ్' – అన్నట్లుగా వారికి ఆ యా అర్చామూర్తు లన్నింటియందును శ్రీమన్నారాయణాభేదోధ్యవసాయమే; ఆ దివ్యానుభూతియే.

పరిపక్వ జ్ఞాన మూర్తు లనఁబడిన ఆళ్వారులును, వేద వేదాంగ శాస్త్ర పారంగతులైన ఆచార్య వర్యులును, అవిదిత విషయాంతరులైన మహాత్ములును ఎంద ఱెందఱో శ్రీరంగము, శ్రీవేంకటాద్రి – మొదలైన దివ్య క్షేత్రములందు వెలసియున్న అర్చా మూర్తులయందే తమ ప్రపత్తి నిష్ఠను నెఱపి తరించి, ముముక్షువులకు మార్గదర్శకు లైనారు.

పరతత్వ నిర్ణాయకాగ్రేసరులును, విశిష్టాద్వైత సిద్ధాంత ప్రవర్తకాచార్యులు నగు శ్రీ భగవద్రామానుజులు – వివిధము

లైన దివ్య క్షేత్రములకు వేంచేసి, అచటి శ్రీమన్నారాయణుని అర్చామూర్తులను సేవించి ఆనందించినారని శ్రీ పరాశర భట్టార్యులవారిట్లు తెలిపినారు :-

"శ్రీరంగం, గరి శైల, మంజన గిరిం, తార్క్ష్యాది సింహాచలౌ
శ్రీకూర్మం, పురుషోత్తమం చ, బదరీ నారాయణం, నైమిశమ్,
శ్రీమద్వారవతీ, ప్రయాగ, మధు, రాయోధ్యా, గయా, పుష్కరం
సాలగ్రామ గిరిం, నిషేవ్య రమతే రామానుజోఽయం మునిః."

- (శ్రీరంగరాజ స్తవము : 7)

కావున, ప్రపత్తి నిష్ఠకు అర్చావతారమూర్తి యనుకూలమైనదని సారాంశము.

ముముక్షువులకు అమృత ప్రాయమైన యీ ప్రపత్తి నిష్ఠను సాధకుల కెల్ల అందించి, మహోపకారకులైనవారు శ్రీయతిరాజులు. వారే -

"యామునార్య సుధాంభోధి మవగాహ్య యథా మతి
ఆదాయ భక్తి యోగస్య రత్నం సందర్శయా మ్యహమ్."

అన్నారు. 'యామున మునులనుగ్రహించిన వాఙ్మయమునుండి భక్తి యోగమునకు సార భూతమైన యీ ప్రపత్తిని గ్రహించి, ప్రదర్శించితిని' - అనియు,

"శారీరకేఽభ్యర్థ్యే యా గోపితా శరణాగతిః
అత్ర గద్య త్రయే వ్యక్తాం తాం విద్యాం ప్రణతోఽస్మ్యహమ్"

'బ్రహ్మ సూత్ర భాష్యములో - శ్రీ భాష్యములో ఈ శరణాగతి విశదముగా నిరూపితము కాలేదు. కొంత గూఢముగా చెప్పఁబడినది. మఱి! ఈ గద్య త్రయములోనో - ఈ ప్రపత్తి విద్య

మిక్కిలి స్పష్టముగా నిరూపింపఁబడినది. 'లోక తారక మైన ఆ విద్యకు నమోవాకములు' – అనియు ఆదరముతో ఆన తిచ్చినారు.

అట్టి ప్రపత్తి ననుష్ఠించిన పూర్వులచే గూఢముగా నుంచ బడిన ఈ దర్శనమును అందఱికును తేట తెల్లము చేసి ప్రబోధించిన మహనీయులు కావుననే –

"ఏకైక పూరుష సురక్షిత వంశ రీత్యా
గుప్తా ప్రపత్తి పదవీ పురుషైః పురాణైః
రామానుజ స్తు పరమా దయయా దయాళుః
సీమా మిమా మతి యయౌ జగతాం హితాయ."

– (ఉపదేశ రత్నము)

పరమ కరుణామూర్తులుగా శ్రీ భగవద్రామానుజులు ప్రపన్నులచే కీర్తింపఁబడినారు. మోక్ష సాధనములలో ప్రపత్తి దర్శనము సర్వశ్రేష్ఠము.

పన్నిద్దరాళ్వారులు
నాలాయిర దివ్య ప్రబంధము

'విద్యా భూషణ - కవితా విశారద'

శ్రీమాన్ ధనకుధరం వరదాచార్యులు

శ్రీ రామానుజ కీర్తి కౌముదీ సంపాదకులు

—✱—

ప్రణామాంజలి

"భూతం సరశ్చ మహదాహ్వయ భట్టనాథ
శ్రీ భక్తిసార కులశేఖర యోగివాహాన్
భక్తాంఘ్రిరేణు పరకాల యతీంద్ర మిశ్రాన్
శ్రీమత్పరాంకుశ మునిం ప్రణతోఽస్మి నిత్యమ్."

* * *

"నీతా తుంగ స్తనగిరి తటీ సుప్త ముద్బోధ్య కృష్ణమ్
పారార్థ్యం స్వం శ్రుతి శత శిర స్సిద్ధ మధ్యాపయంతీ
స్వోచ్ఛిష్టాయాం స్రజినిగళితం యాబలా తక్యపత్యం భుంక్తే
గోదా తస్యై నమ ఇద మిదం భూయ ఏవాస్తు భూయః."

* * *

"అవిదిత విషయాంతర శ్చకారే
రుపవిషదా ముపగాన మత్ర భోగః
అపి చ గుణ వశా త్తదేక శేషి
మధుర కవి హృదయే మమాఽవిరస్తు."

* * *

ఆళ్వారులు - పరమార్థము

అఖండ భూమండలములో మన భరత ఖండము 'పుణ్య భూమి' యను విఖ్యాతి నార్జించినది. అపౌరుషేయములైన వేదములతో - ఆర్షములైన ఉపనిష త్సూత్ర గీతలతో తులతూగుచుండుటయే ఇందులకు హేతువు. మతియును, మహనీయులైన తప స్సంపన్నులతో - పరమ పవిత్రములైన తీర్థరాజములతో - బ్రహ్మానంద సంధాయకములైన పర్వత శ్రేష్ఠములతో - అనర్ఘ రత్న ప్రయుక్తములైన పర్వత శ్రేష్ఠములతో - వివిధ కళలతో - వివిధ సంస్కృతులలో విలసిల్లు చుండుటయే ఇందుకు కారణము. అదియునుగాక, మన భరత ఖండము అధ్యాత్మ విద్యకు ఆలవాలమై, భక్తి వైరాగ్యములకు పట్టుగొమ్మయై, దైవశక్తులకు దివ్య నిలయమై సంశోభించుచు, తన సహజ కాంతులను దిగంతములవఱకు పరివ్యాప్తముగావించి, ఖండాంతర వాసులను సైతము దిగ్భ్రాంతులఁ జేయుచునే యున్నది.

ఈ విధముగా విశ్వ విఖ్యాతమై యొప్పారు మన భరత ఖండమున - ఎందఱో మేధావంతులుద్భవించి, తత్త్వ శాస్త్రవేత్తలై, సృష్టి రహస్యములను లోకమున విస్పష్టముగా వెల్లడించిరి. ఎందఱో మహానుభావులవతరించి, సంసార సాగర సముత్తరణార్థమై సర్వసంగ పరిత్యాగము గావించి, భక్తి ప్రపత్తులతో సనాతన ధర్మ ప్రతిపాదకుడైన వాసుదేవ భగవానుని సమారాధించి, సర్వాంతర్యామియైన యా భగవానుని సాక్షాత్కార భాగ్యమునుఁ బడసి, సంతుష్టాంతరంగులై, తమ తమ యనుభూతులను లోకమునకు యథాతథముగ వెల్లడించుటయే గాక, వేద విజ్ఞానమును సైతము సర్వమానవులకు కరతలామలక మొనరించి, చిర స్మరణీయులుగా విలసిల్లిరి. అట్టి మహా భక్తాగ్రగణ్యులే మన ఆళ్వారులు.

ఆళ్వారుల వైశిష్ట్యము

తమిళ ప్రదేశమున వివిధ ప్రాంతములలో – వివిధ వర్ణముల యందు – వివిధ సమయములలో నవతరించిన ప్రముఖ వైష్ణవ భక్తులు పన్నిద్దఱు మాత్రమే ఆళ్వారులుగా నేఁడు వ్యవహరింపఁ బడుచున్నారు. 'ఆళ్వారు' అను శబ్దమునకు – భగవద్భక్తి పరవశుఁడనియు, భగవద్గుణములలో ఈడు పడినవాఁడనియు రెండర్థములున్నవి.[1] ఇందువలన, ఆ మహనీయులీ యర్థద్వయమునకు సరిపోలియుండుటనుఁబట్టియే ఆళ్వారులుగా పరిగణింపఁబడుచున్నారని మనము సంభావింపవచ్చును.

తమిళ భాషలో 'ఆళ్ దళ్' అను శబ్దమునకు – 'శాసించుట' అని యర్థము. కావున, ఈ 'ఆళ్ దళ్' శబ్దము నుండియే 'ఆళ్వార్' అను శబ్దము సముత్పన్నమైన దనియు, భగవత్పర తంత్రులును – భగవద్గుణానుభవ శోభితులు నగు ఆ భక్తాగ్రేసరులు భగవంతునిపై భక్తి పూర్వకమైన ఆధిపత్యము చేయఁగలవార లగుటచే – 'ఆళ్వారులు' అని వ్యవహరింపఁబడుచుండి రనియు తమిళ భాషాభిజ్ఞులైన వైష్ణవ హృదయుల నిశ్చితాభిప్రాయము. అదియునుఁగాక, 'ఆళ్వార్' అను శబ్దమునకు 'మగ్న మగుట' అనియును అర్థమున్నందున, భగవద్గుణానుభవములో నిమగ్నులైన ఆ మహనీయులు

---

1. 'సంప్రదాయ అకారాది' అను ద్రవిడ ఆంధ్ర నిఘంటువు – పుట : 118

– శ్రీమాన్ కందాడై శేషాచార్యులు.

'ఆళ్వారులు' అని వ్యవహరింపఁబడుచున్నా రనియు మఱి కొందఱు విద్వాంసులు నిర్వచించుచున్నారు.[2] ఎవరు ఏ రీతిగా నిర్వచించినను, వైష్ణవ లోకమున ధ్రువ తారలవలె ప్రకాశించిన పరమ భక్తాగ్రగణ్యులు పన్నిద్దఱు మాత్రమే ఆళ్వారుల లనుట నిర్వివాదాంశము.

ఆ మహనీయు లంతటి మహా భక్తు లయ్యును – ఈ లీలా విభూతిలో నున్నంతకాలము, ఆళ్వారులుగా వ్యవహరింపఁబడియుండ లేదు. వారి యనంతరము కొంత కాలమునకు శ్రీ రామానుజ యుగమున (క్రీ: శ: 1017 – 1137) 'తిరు క్కురుగై ప్పిరాన్ పిళ్ళాన్' అనువారిచే, నాలాయిర దివ్య ప్రబంధముపై రచింపఁబడిన టీకలో – ఆ భక్తాగ్రేసరుల నుద్దేశించి, 'ఆళ్వారులు' అను శబ్దము తొలిసారిగా ప్రయోగింపఁబడినది. అందువలన, నాఁటినుండియు ఆ మహనీయులు 'ఆళ్వారులు' అను అన్వర్థ నామముతో వ్యవహరింపఁబడుట పరిపాటి యయ్యెను.

నాలాయిర దివ్య ప్రబంధములో నొక తావున మాత్రమే 'ఆళ్వారు' అను శబ్దము ప్రయోగింపఁబడి యున్నది.[3] కాని, ఆ ప్రయోగము వైష్ణవ భక్తుల నుద్దేశించినది కాదు. నమ్మాళ్వారుల

2. "The word 'Alvar' has peculiar Significance of its own. It means one who has Sunk into the depths of his existence or one who is lost in rapturous devotion tothe Lord. It is a word quite descriptive of All God – intoxicatedman.

— **'Grains of Gold'** - *R. S. Dsikan, p.6.*

3. "నారాయణన్ ఎన్నైయాళి వరకత్తుచ్
చేరామల్ కాక్కుమ్ తిరుమార్ పన్ - పేరావ
పేళ పైశాత పిణప్పయర్ పేళక్కేట్టు
ఆళైపట్ట ఆళ్వార్ పలర్."

— (నామ్మగన్ తిరువన్దాది : 14)

రచనలలో నొక చోట – 'అడియార్' అనియు, 'భగవర్' అనియు రెండు శబ్దములు మాత్రము వైష్ణవ భక్తుల నుద్దేశించి ప్రయోగింపఁ బడియున్నవి.[4] ఇందలి 'అడియార్' శబ్దమునకు – 'దాసభూతులు' అని యర్థము.

"దాసభూతా స్వతస్సర్వే ఆత్మానః పరమాత్మనః
నాన్యథా లక్షణం తేషాం బంధే మోక్షే తథైవ చ."

అను ప్రమాణోక్తరీత్యా – చేతను లందఱును పరమాత్మకు దాసభూతులే. సంసార బంధమునఁగాని, మోక్ష మనఁబడు పరమ పదమునందుఁగాని చేతనులకు స్వాతంత్ర్య మేమాత్రము లేనందున, పారతంత్ర్యముతో భగవంతునియెడ దాసభూతులుగా ప్రవర్తించు వారు – 'అడియార్' అనఁబడుచుందు రనియు, అట్టివారే భగవత్ప్రపన్నులుగా – భాగవతోత్తములుగా వ్యవహరింపఁబడుచుందు రనియు మనము గ్రహింప నగును.

ఇఁక రెండవ ప్రయోగమగు 'భగవర్' శబ్దమునకు – 'భగవత్సాక్షాత్కార భాగ్యమునఁ బడసిన సిద్ధపురుషులు' అని యర్థము. వీరు కేవలము భగవత్తుల్యులు కావున – 'భగవత్' అను శబ్దము వీరి యెడ సార్థకమై యొప్పుచున్నది. ఇట్టి మహానీయులను మనము – 'జీయరులు' అని వ్యవహరించుచు, భక్తి భావముతో పూజించు

---

4. "మేవిత్తొఴదయ్మి నీర్గళ్ వేదప్పువిద విరుత్తై క్-
నావిల్ కొండ్ఱు తన్నై ఞాన విదిత్తయామే
పూవిల్ పుగైయుమ్ విళక్కుమ్ నాన్ముమ్ వీరుమ్మిన్దు
మేవిత్తొమ్ అడియారుమ్ భగవరుమ్ మిక్కదులకే."

— (తిరువాయిమొళి : 5-2-7)

చుండుము. కనుక, ఆ కాలమున వైష్ణవభక్తుల నుద్దేశించి – వారిలో గల తర తమ భేదముల ననుసరించి – 'అడియార్' అనియు, 'భగవర్' అనియు రెండు శబ్దములు మాత్రమే తమిళ వాఙ్మయ ప్రపంచమున వ్యవహరింపఁబడుచున్నట్లు విశద మగుచున్నది.

ఆళ్వారులకు సంబంధించిన చరిత్రాంశములు దాదాపుగా నన్నియు మన కిపుడు లభ్యములగుచున్నందున, ఆమహనీయుల ప్రతిభా విశేషములను మనము సులభముగా గ్రహింపవచ్చును. గురుపరంపరా ప్రభావము, పెరియ తిరుమొళి యడ్డివ్వు. ఉపదేశ రత్నమాల, దివ్య సూరి చరితము, ప్రపన్నామృతము, యతీంద్ర ప్రణవ ప్రభావము, ఆచార్య సూక్తి ముక్తావళి, పరమయోగి విలాసము మొదలగు గ్రంథములలో – ఆళ్వారుల యవతార వైభవాదులు మిగుల మనోజ్ఞముగ అభినర్ణింపఁబడి యున్నవి. అదియునుఁ గాక – శిలా శాసనములవలననును, తామ్ర శాసనములవలననుఁ గూడ ఆ మహనీయులకు సంబంధించిన మఱి కొన్ని చరిత్రాంశములు తెలియవచ్చుచున్నవి. ఇట్టి యాధారములనుఁబట్టియే ఆ పన్నిద్దరాళ్వారులు – భగవత్పర తంత్రు లనియు, భగవద్గుణానుభవ తత్పరు లనియు, పరాకాష్ఠ నందిన భక్తి ప్రపత్తులే వారి మహా ప్రభావమునకు హేతుభూతమ లనియు మనకు స్పష్ట మగుచున్నది.

అట్టి పన్నిద్దరాళ్వారుల భక్తి తత్త్వమును పరిపూర్ణముగ గ్రహింపవలె నన్న, వారు రచించిన దివ్య ప్రబంధములను శ్రద్ధా నక్తులతో సావధానముగ పరిశీలింపవలసి యుండును. అందువలన, ఆ దివ్య ప్రబంధములలో – భక్తి సౌరభ సంభరితములైన హృత్ప ద్మములు గల పన్నిద్దరాళ్వారుల స్వరూప రూప విభవములు మనకు సుస్పష్టముగా సాక్షాత్కరింపఁగలవు.

ఆళ్వారుల రచనా వ్యాసంగము

ఆళ్వారులు పన్నిద్దఱును సహజసిద్ధమైన తమ భావనా బల ముతో నాల్గువేల భక్తిగీతముల నాలాపించిరి. భావ మధురములైన ఆ భక్తి గీతములే - 'పాశురము లు' అను పేర వ్యవహరింపఁబడుచున్నవి. ఛందోబద్ధములైన తెలుఁగు పద్యముల వలెనే - ఈ తమిళ పాశురములుగూడ వివిధ వృత్తములతో రచింపఁబడి, రసవత్తరములుగా విరాజిల్లుచున్నవి. ఆళ్వారు లీ పాశురములను గ్రంథస్థముల గావించియుండనందున, అవి కేవలము కంఠస్థములుగనే యుండిపోయినవి. ఆళ్వారుల యనంతరము కూడ - ఈ పాశురములను గ్రంథస్థముల గావించుట కెవరును చిరకాలమువఱకు ప్రయత్నించి యుండరైరి. ఈ కారణమువలన, ఆ పాశురములలో కొన్ని నష్టప్రాయము లగుటయు తటస్థించెను. ఇట్టి స్థితిలో - ఒకానొక సమయమున, వీర నారాయణపుర వాస్తవ్యు లగు నాథమునులు (క్రీ. శ. 823-924) శ్రీరంగమునకు తీర్థయాత్రగా భయనమై వెళ్ళిరి. అపు డా దివ్యక్షేత్రము యాత్రిక జన సందోహముతో కళకళ లాడుచుండెను. కొందఱు యాత్రికు లొకచో గుమి గూడి, భక్తి పరవశులై, శ్రీరంగనాథుని కల్యాణ గుణములను తనివి దీర సంకీర్తించుచుండిరి. తిరుక్కురుగూరునుండి వచ్చిన శ్రీ వైష్ణవస్వాము లగు ఆ భక్తు లట్టి స్థితియందే పది పాశురములను పాడి, ఆ దశకమునకు చివఱ ఫల శ్రుతిగా గల పదునొకండవ పాశురమును గానము చేయగా - ఆ మధుర గానము నాథమునులకు వీనుల విం దగుటయే గాక, ఆ పాశురమునందలి యర్థగాంభీర్యముకూడ వారిని విశేషముగ నాకర్షించెను. అందువలన వెంటనే నాథమును లా భక్తబృందముకడ కేఁగి, ఆ పాశురములను మఱల పాడవలసినదిగా కోరిరి. ఆ భక్తులును - అట్లే ఆ పాశురములనుఁ బాడి, నాథమునులకు విన్పించిరి. అవి - నమ్మాళ్వారులు నహస్ర సంఖ్యలో రచించిన 'తిరు వాయి మొళి'

అను దివ్య ప్రబంధము నందలి ౯ – వ శతకమున 'ఆరావముదే' అను శీర్షిక గల ౯ – వ దశకమై యుండెను.ఆ పాశురములను నాథమునులు విని, ఫలశ్రుతినిఁ బట్టి ఆ పాశురములు నమ్మాళ్వారులచే సహస్ర సంఖ్యలో రచింపఁబడిన 'తిరు వాయి మొళి' దివ్య ప్రబంధమునందలి వని గ్రహించినవారై, అంతటితో సంతృప్తి నందక, ఆ తిరు వాయి మొళి దివ్య ప్రబంధము నందలి వేయి పాశురములను పూర్తిగా వినవలె నని యభిలషించిరి. కాని, ఆ భక్తులకు ఆ తిరువాయిమొళిలో – ఆ ఒక్క దశకము దక్క, మఱి యే యొక్క దశకము కూడ జ్ఞప్తిలో రా దయ్యెను. అందువలన, నాథమునుల యభిలాష సఫల మగుట కవు డవకాశము కల్గలేదు. కాని, మహనీయుల సత్సంకల్ప మేనాటికై నను ఫలింపకుండునా ?

ఆశయ సాఫల్యమునకై నాథమునులు దీక్ష వహించి, నమ్మాళ్వారుల యవతార స్థల మగు తిరునగరికి వెంటనే పయనమై, కొన్ని దినముల కా పవిత్ర క్షేత్రము జేరిరి. అట నమ్మాళ్వారుల కాశ్రయమొసంగిన శేషాంశ సంభూత మగు తింత్రిణీ వృక్షముకడ కేఁగి, అచ్చోట గల శ్రీ పరాంకుశదాసుల నాశ్రయించి, వా రుపదేశించిన 'కణ్ణినుణ్ శిరుత్తాంబు' అను నమ్మాళ్వారుల విషయమై, వాఁ యంతరంగ శిష్యు లగు మధురకవి యాళ్వారులు స్తోత్ర ప్రాయముగా రచించిన పదునొకండు పాశురములు గల దివ్య ప్రబంధమును పండ్రెండువేల పర్యాయము లనుసంధించిరి. అంతలో నాథమునులు యోగనిద్రాపరవశులు కాఁగా – నమ్మాళ్వారు లవుడు నాథమునులకు స్వప్నమున సాక్షాత్కరించి, కేవలము తాము స్వయముగా రచించిన పాశురములనే గాక, ఆళ్వారు లందఱిచేతను రచింపఁబడిన

పాశురముల నన్నింటిని పూర్తిగా విన్పించిరి.[5] నాథమును లప్పుడు యోగ నిద్రాపరవశత్వమును వీడి, పరమానందభరితులై, ఆ పాశురముల నన్నింటిని సంకలనము గావించి, 'నాలాయిర దివ్య ప్రబంధము' అను పేర నొక గ్రంథ రూపమున రూపొందించిరి. నాఁటి నుండియు - నాథమునులు నమ్మాళ్వారులనే తమ యాచార్యచరణులనుగా సంభావించి, వారి దివ్యసందేశముల నహర్నిశములును మననము గావింప సాగిరి.[6] అయినను - నమ్మాళ్వారులతో తమకు ఆచార్య సంబంధము ప్రత్యక్షముగా నేర్పడియుండనందున, మనంబున నొకింత చింతించి, తాము నమ్మాళ్వారుల శిష్య పరంపరలో నొక రగు పరాంకుశమునుల పాదారవిందములను సమాశ్రయించియుండు టనుఁబట్టి, త న్మూలమునఁనే నమ్మాళ్వారులతో తమకు గురు శిష్య సంబంధ మేర్పడినట్లు సంతృప్తిఁ జెంది, ఆ మహనీయుల సన్నిధాన మున ద్రావిడ దివ్య ప్రబంధ ప్రాశస్త్యమును సంపూర్ణముగ గ్రహించి, సంతుష్టాంతరంగులు కాఁగల్గిరి. నాథమునుల దీక్షా దక్ష తల నందుమూలమునఁనే మనము సులభముగా గ్రహింపవచ్చును.

నాథమునులు సంస్కృత తమిళ భాషలలో నుద్దండ పండి తులుగా సుప్రసిద్ధులు. అయినను - పన్నిద్ద రాళ్వారులచే రచింప బడిన పాశురముల నన్నింటిని గాన యోగ్యములుగా రూపొందించు

---

5. History of Sri Vaishnavaa.

— T. A. Gopinatha Rao, p. 8.

మఱియు -

తిరుమల తిరుపతి దేవస్థానముల మాసపత్రిక (Vol. IX No. 3) లో — 'శ్రీవైష్ణవ దర్శనమున రహస్య వంప్రదాయము' అను శీర్షిక గల వ్యాసము

— వ్యాసకర్త : విద్వాన్ - శ్రీ సుదర్శనాచార్య శిరోమణి.

6. History of Indian Philosophy.

— Dr. S. N. Dasgupta, Vol. III, (2 nd Edition) p. 94 .

టకై, వా రెంతయో పరిశ్రమ చేయవలసి వచ్చెను. ఆ పాశురము
లను లోకమున ప్రకాశింపఁజేసి, వానిలోఁ గల భక్తిభావములను
ప్రజ లందఱి హృదయము లందును హత్తుకొనఁ జేయవలెనని వారి
సంకల్పము. అట్టి మహాసంకల్పము తోడనే వారంతటి పనికి పూను
కొని, తమ పరిశ్రమ సార్థకము కావలెనని దీక్ష వహించి, మొదట
- శ్రీరంగ క్షేత్రమునఁగల శ్రీరంగనాథాలయములో ద్రావిడ
దివ్య ప్రబంధాధ్యయనమునకు ప్రారంభోత్సవము గావించుచు, ఆ
దివ్య ప్రబంధాధ్యయనము ప్రతి నిత్యము నిర్ణీత సమయములలో
నిర్విఘ్నముగ జరుగుటకు తగిన యేర్పాటుల గావించిరి. ఆ సందర్భ
మున - పాశురములను శ్రవణానందముగ గానము చేయుటకై,
ప్రత్యేకముగ కొందఱు గాయకులను నియమించిరి. అట్టి గాయకులే
నేఁడు 'అరయరులు' అని వ్యవహరింపఁబడుచున్నారు.[7]

శ్రీ వైష్ణవ క్షేత్రములలో - 'తిరువరంగమ్' అనఁబడు శ్రీరం
గమే యగ్రగణ్యమైన దనియు, ఆ క్షేత్రమునఁ గల 'పెరియ
కోనిల్' అనఁబడు దివ్య దేవాలయమే ప్రముఖమైనదనియు ప్రాచీన
కాలమునుండియు లోకమున నొక ప్రతీతి యున్నది. కావుననే,
క్షేత్ర ప్రసిద్ధమైన శ్రీరంగనాథాలయములో ద్రావిడ దివ్య ప్రబంధా
ధ్యయనము ప్రారంభమైనాఁటినుండియు - దేశమునఁ గల వైష్ణ
వాలయములందును, వైష్ణవ గృహములందును ఆ దివ్య ప్రబంధా
ధ్యయనము కాల క్రమమున నుపక్రమింపఁబడసాగెను.

సంస్కృత భాషామయములైన వేద ఋక్కుల వలెనే -
ఆళ్వారుల తమిళ పాశురములను సైతము గానయోగ్యములుగా

---

7. The Hymns of Alvars.
— J. S. M. Hoper, p. 27.

నాథమునులు సిద్ధ మొనరించి యున్నందున, పాశురములను గానము చేయువారును, శ్రవణము గావించువారుఁ గూడ బ్రహ్మానంద భరితు లగుచు, ఆ పాశుర సముదాయమును ద్రావిడ వేదముగా సంభావింప దొడంగిరి. అళ్వారులచే ప్రసాదింపఁబడిన ఆ ద్రావిడ వేదము - 'అరుళి చ్చెయల్' (అనుగ్రహ పూరితమైన శ్రీసూక్తి) అను విఖ్యాతి గాంచి యున్నది. కావున, అట్టి నాలాయిర దివ్య ప్రబంధమునందలి కవితల నొకింత పరిశీలించి, వానిలోఁ గల స్వార స్యమును గ్రహితముగావుత !

పాయిగై యాళ్వారుల రచనలు :-

ఆళ్వారుల పరంపరలో మొదటి మువ్వురును - 'ముద లళ్వారులు' అని వ్యవహరింపఁబడుట పరిపాటి. ఈ మువ్వురిలో పొయిగై యాళ్వారులు - ఆది కవిగా విఖ్యాతి గాంచియున్నారు.8 ఈ యాది కవిచే రచింపఁబడిన నూఱు పాశురములు - 'ముదల్ తిరువన్దాది' యను పేర, దివ్య ప్రబంధమునందు - 'ఇయఱ్ఱా' విభా గమున పొందుపఱుపఁబడియున్నవి. ఈ పాశురములు - 'అన్దాది' అను ఛందముతో రచింపఁబడినవి. అన్దాది ఛంద మనఁగా, మొదటి పాశురపు చివర పదమును తరువాతి పాశురపు అది పదముగా ప్రయో గించునట్టి ఒకా నొక కవితా విశేషము. కాఁగా - 'తిరు' అను శబ్దమునకు - లక్ష్మి, కాంతి, సుందరము, సంపద, పూజ్యత అను అయి దర్థము లున్నవి. 'ముదల్' అనఁగా - 'మొదలు' (మొదటిది) అని అర్థము. కనుక - 'ముదల్ తిరువన్దాది' యను శీర్షికకు తాత్పర్య మిపుడు సుబోధకము.

ఈ 'ముదల్ తిరువన్దాది' లో ముఖ్యముగా - భక్తి తత్త్వము, తాత్త్విక రహస్యములు మున్నగునవి విశదీకరింపఁబడి యున్నవి. ఈ

---

8. ఆళ్వార్ కాలనిర్ణయ.

- ప్రొఫెసర్ : యం. రాఘవ అయ్యంగార్, 39 పుట.

దివ్య ప్రబంధములో – భక్తి మార్గ మొకటియే ముక్తికి సులభమైన మార్గ మని స్పష్టీకరింపబడినది. కృష్ణుని బాల లీలలలో ఈ కవి హృదయము లీన మైనట్లు – ఈ ప్రబంధమునం గల కొన్ని పాశురముల మూలమునసే తెలియుచున్న ది. మరికొన్ని పాశురములలో – తిరువరంగమ్ (శ్రీ రంగము), తిరువేంగడమ్ (తిరుమల) మొదలగు దివ్య క్షేత్రములలో విరాజిల్లు విష్ణు సంబంధములైన అర్చా మూర్తులు సంస్తుతింపబడినవి.

పూదత్తాళ్వారుల రచనలు :-

'తిరువన్దాది' ఛందముతో పూదత్తాళ్వారులచే రచింపబడిన నూఱు పాశురములు – 'ఇరణ్డామ్ తిరువన్దాది' యను పేర, దివ్య ప్రబంధములో – 'ఇయఱ్ఱా' విభాగమున చేర్చబడినవి. ఇందు, ఈ యాళ్వారుల హృదయ కుహరమునుండి వెలువడిన భావనా పరంపరలు – అనుభూతి మయములుగా మనకు గన్పట్టుచుండును. ఈ పాశురములలో ముఖ్యముగా – భగవద్వైభవము, భక్తి ప్రభావము, శరణాగతి ప్రాశస్త్యము మున్నగునవి విశదీకరింపబడినవి. మఱియు – విష్ణువుకు సంబంధించిన వివిధావతారములును, సుప్రసిద్ధములైన కొన్ని వైష్ణవాలయములును వర్ణింపబడినవి. ప్రకృతి సౌందర్య మిందును అభివర్ణింపబడినది.

పే యాళ్వారుల రచనలు :-

'తిరువన్దాది' వృత్త విశేషముతో పేయాళ్వారులు రచించిన నూఱు పాశురములు – 'మూన్ఱామ్ తిరువన్దాది' యను పేర, దివ్య ప్రబంధములో 'ఇయఱ్ఱా' విభాగమునందే చేర్చబడి యున్న ది. ఈ పాశురములలో – భక్తి పరవశమైన ఈ యాళ్వారుల హృదయము స్పష్టముగా మనకు గన్పట్టుచుండును. పాషాణ సదృశమైన హృదయ

మును సైతము ప్రదర్శింపఁజేయఁగల పాశురము లివి. వీనిని రచించిన పేయాళ్వారులు - వేదములను, ఉపనిషత్తులను, గీతలను, ధర్మ శాస్త్రములను ఎన్నింటినో మథించి, మథించి, వానిలోఁగల విజ్ఞాన సంపదను సంపూర్ణముగ సముపార్జించినట్లు - ఈ పాశురములవలననే మనకు వ్యక్తము కాఁగలదు. ఈ పాశురములలో - తాత్త్విక రహస్యము లెన్నియో విశదీకరింపఁబడియున్నవి. మఱియు - విష్ణువుకు సంబంధించిన వివిధావతారములు, ప్రకృతిసౌందర్యము మున్నగు నవియును ఈ ప్రబంధమున వర్ణింపబడినవి.

తిరుమళిశై యాళ్వారుల రచనలు :-

ఈ మహనీయులు - తమ భావనా ప్రపంచమునుండి వెలువడిన యనుభూతులను పొందుపఱచుచు, అనేక గ్రంథములను రచించి యున్నారు. కాని, ఒకా నొకవుడు ఏ కారణమువలననో - వీరు తమ రచనల నన్నింటిని కావేరిలో పారవైచి రఁట ! అవు డా నదీ ప్రవాహమున కొన్ని గ్రంథములు కొట్టుకొనిపోగా, రెండు గ్రంథములు మాత్రము మిగిలి - తీరమునుఁ బట్టియుండ, వానిని కావేరీ నది కా సమయమున స్నానార్థ మఱుదెంచినవారు కొందఱు భద్ర పరచిరి. అట్లు భద్ర పఱుపఁబడిన గ్రంథములే 'నాన్మగన్ తిరువన్దాది', 'తిరుచ్చన్ద విరుత్తమ్' అనునవి. ఇవి రెండును దివ్యప్రబంధమున పొందుపఱుపఁబడినవి.

'నాన్మగన్ తిరువన్దాది' లో - అన్దాది వృత్తముతో రచింపఁబడిన తొంబదియాఱు పాశురము లున్నవి. పరమాత్మ యైన విష్ణువుకు - బ్రహ్మ రుద్రేంద్రాదు లందఱును కింకర ప్రాయులే యని, ఈ దివ్య ప్రబంధమున స్పష్టీకరింపఁబడినది. మఱియు - భగవద్వైభవము, భక్తి ప్రభావము మున్నగు నవియును ఇందు వర్ణింపఁబడినవి. సార రహితమైన సంసారమును సత్యముగా - నిత్యముగా

భావింపక, భగవత్పాదారవిందముల నాశ్రయించి, ధ్యానించి, శరణాగతి గావించిన ప్రపన్నులకు లభించు ఆనంద మిం దత్యధికముగా నభివర్ణింపఁబడి యున్నది. అదియునుఁ గాక, ఈ 'నాస్మగన్ తిరుప్పాది'యందును – ప్రకృతిసౌందర్యము రమణీయముగ వర్ణింపఁబడినది.

'తిరుచ్చన్ద విరుత్తమ్' అను ప్రబంధములో – నూట యిరువది పాశురములు వివిధ రాగ తాళ సహితములై యొప్పారు ఈ ప్రబంధమునందలి పూర్వార్ధమున, వైష్ణవ ధర్మములు విపులీకరింఁబడి యున్నవి. ఉత్తరార్ధమునందలి కొన్ని పాశురములలో – విరహవేదనఁ జెందిన నాయిక, తన ప్రియుని కొఱకు పరితపించు రీతి – తిరుమళిశై యాళ్వారులు తమ ప్రియుఁడగు భగవంతుని కొఱకు విశేషముగా పరితపించినట్లు వర్ణింపఁబడినది.

నాయకీ నాయకుల విరహ వేదనము, భక్తునకు భగవంతునిపైఁ గల యాకాంక్షయు పన్నిద్దరాళ్వారుల రచనలలో అన్నింటియందును సర్వ సాధారణముగాఁ గన్పట్టుచునే యుండును. కాని, అట్టి భావ పరంపరలను ప్రకటించు విషయములో – తిరుమళిశై యాళ్వారులే అగ్రగణ్యు లనియు, ఆ భావ పరంపరలు వారిలో పరిపూర్ణముగ పరాకాష్ఠ నందుకొనియుండెననియు – 'తిరుచ్చన్ద విరుత్తమ్' అను నీ ప్రబంధము వలననే మనము సులభముగా గ్రహించవచ్చును.

నమ్మాళ్వారుల రచనలు :-

'తిరు విరుత్తమ్', 'తిరు వాశిరియమ్', 'పెరియ తిరువన్దాది', 'తిరు వాయి మొళి' అను పేర్లతో – నమ్మాళ్వారుల నాల్గు రచనలు నాలాయిర దివ్య ప్రబంధమునందు చేర్చబడి యున్నవి. ఇవి నాల్గును నాల్గు రత్నము లనియే మనము సంభావింపవచ్చును.

'తిరు విరు త్తమ్' అను ప్రబంధము - ఋగ్వేద సారముగా పరిగణింపఁబడుచున్నది. ఇందు నూఱు పాశురము లున్నవి. భక్తు నకు భగవంతునిపై నుండు భక్తితాత్పర్యము, తన్మయత్వము ఈ ప్రబంధమున విశేషముగా వర్ణింపఁబడి యున్నది. నమ్మాళ్వారులు తమ్ము నాయికగాఁ దలంచుకొని, భగవంతుని ప్రియతమ నాయకునిగా భావించి, తమ నాథుని నిమిత్తమై, విరహవేదనతో పరి పరి విధము లుగా పరితపించిన సన్నివేశము లిందభివర్ణింపఁబడి యున్నవి. నాయిక తన ప్రియుని యనురాగము నపేక్షించి, ప్రకృతి సంతటిని తనకు ప్రతికూలముగా దలంచుట, విహ్వలత నందుట, నాయకుని రాకకై నిరీక్షించియు ఫలితము గానక, నానాటికి కృశించిపోవుట, మేఘముల మూలమునను - పక్షుల మూలమునను నాయకునకు తన సందేశముల నందఁజేయ యత్నించుట, అందువలన ప్రయోజన మేమాత్రము కల్గనందున - తుదకు తన ప్రాణములను పరిత్యజించుటకు సైతము సాహసించుట ఇత్యాది విషయములతో - ఈ ప్రబంధము మిక్కిలి రసవత్తరముగా నొప్పారుచున్నది. స్థూల దృష్టితోఁ జూచినచో - ఈ ప్రబంధము లౌకికమైన ప్రేమతత్త్వమును వర్ణించునట్టి ఒక ఉత్తమ కావ్యముగాఁ గన్పట్ట గలదు. కాని, సూక్ష్మదృష్టితో సమాలోకించిన యెడల, నమ్మాళ్వారులు విరహవేదనఁ జెందిన నాయిక వలె, భగవంతుని నిమిత్త మెంతగనో పరితపించినట్లు వ్యక్తము కాఁగలదు. కావున, ఈ దివ్య ప్రబంధము మధుర భక్తిని ప్రతిపాదించు గ్రంథములలో ప్రముఖమైనదిగా మనము సంభావింప వచ్చును.

'తిరు వాశిరియమ్' అను ప్రబంధములో - ఏడు పాశురము లున్నవి. ఇది యజుర్వేద సారముగా నుడువఁబడుచున్నది. 'పెరియ తిరువన్దాది' లో - యెనుబది యేడు పాశురము లున్నవి. ఈ ప్రబంధము అథర్వణ వేదముగా పరిగణింపఁబడుచున్నది. ఈ ప్రబంధము

లలో – ఏ కథయును పొందుపఱుపఁబడి యుండలేదు. వీనిలోఁ గల పాశురము లన్నియు భక్తి వైభవమును వేనోళ్ళ చాటునవియై యున్నవి. మఱియు – భగవంతుని భువన మోహన సౌందర్యము, కల్యాణ గుణములు మున్నగునవి మనోహరముగా వీనిలో వర్ణింపఁ బడినవి.

'తిరు వాయి మొళి' యను ప్రబంధము – కేవలము నమ్మాళ్వారుల గ్రంథ చతుష్టయమునందే గాక, ఆళ్వారుల ప్రబంధము లన్నిటియందును అగ్రగణ్య మైనది. అంతియ కాదు – తమిళ వాఙ్మయ ప్రపంచమునందే గాక, ఏ భారతీయ భాష యందును ఇంతటి యుత్తమ గ్రంథము వెలువడియుండలే దనుట – అత్యుక్తి కానేరదు. ఈ మహా గ్రంథము దివ్య ప్రబంధములలో నొక ప్రత్యేక విభాగముగా సంశోభించుచున్నది.

'తిరు వాయి మొళి' యనఁగా – 'మహనీయుని వాక్కు నుండి వెలువడిన దివ్య వాణి' అని యర్థము. 'వాయి మొళి' అను శబ్దము ప్రాచీనమైన తమిళ వాఙ్మయములో – 'వేదము' అను అర్థము నిచ్చు శబ్దముగా ప్రయోగింపఁబడినది.1 కావునసే, ఈ 'తిరు వాయి మొళి' – వేదతుల్యముగా గౌరవింపఁబడుచున్నది. సామవేదసార మంతయు – ఈ ప్రబంధములో నిమిడియున్నదని, సంప్రదాయ వేత్తల నిశ్చితాభిప్రాయము.

ఈ 'తిరు వాయి మొళి' ప్రబంధమునందు 1,102 పాశురము లున్నవి. ఇవి – వివిధ రాగ తాళములతో, గానము చేయుట కను వుగా రూపొందింపఁబడి యున్నవి. ఈ ప్రబంధ మంతయు శతకము

---

1. జ్ఞాన విరమ్ – పి. శ్రీ ఆచార్య, 99 పుట.

లుగా విభాగింపఁబడి, ఒక్కొక్క శతకము పది దశకములుగా విభాగింపఁబడి యున్నది. ప్రతి దశకమునందును చివఱ - పదు నొంకడవ పాశురములో - 'ఫల శ్రుతి' చెప్పఁబడినది. ఈ ప్రబంధమున భక్తి ప్రపత్తులు, ఆచార్య ప్రభావము మున్నగు విషయములనేకములు వర్ణింపఁబడియుండుటే గాక, ధర్మ మర్మము లెన్నియో సవిస్తరముగా వివరింపఁబడినవి. ఈ దివ్య ప్రబంధమునందును అనేక దశకములలో - జీవాత్మ పరమాత్మల నడుమగాఁ గల నాయకీ నాయకుల సంబంధము మిగుల మనోజ్ఞముగ వర్ణింపంబడినది.

తమిళ వాఙ్మయ ప్రపంచమున నమ్మాళ్వారులకు లభించి యున్నంతటి యున్నత స్థానము - మఱి యెవరికిని లభించియుండ లేదు. వీరి దివ్య ప్రబంధములలో ప్రతిపాదింపఁబడిన సిద్ధాంతములు - శ్రీ వైష్ణవ మతమునకు పన్నెను, వాసిని, చేకూర్చియున్న వనుట - నిర్వివాదాంశము. ఏకగ్రీవముగా సర్వులును సమ్మతింపవలసిన యంశ మిది. కావుననే - వైష్ణవ లోకము నమ్మాళ్వారులను 'శ్రీ వైష్ణవ కుల పతి' యను బిరుదముతో గౌరవించి, వారియందు తనకుఁ గల అచంచలమైన భక్తి ప్రపత్తులను వెల్లడించి యున్నది. అదియునుఁ గాక, నమ్మాళ్వారులు - 'తమిళ వేద ప్రణేత' లనియు, 'తమిళ వేద వ్యాసు' లనియు ప్రశంసింపఁబడుచున్నారు.[10]

నమ్మాళ్వారులను ప్రస్తుతించుచు - అనేకు లనేక గ్రంథములను రచించి యున్నారు. అట్టి ప్రశంసా గ్రంథములలో - నమ్మాళ్వారుల శిష్య రత్నముగా విఖ్యాతి గాంచిన మధురకవియాళ్వారుల 'కణ్ణినుణ్ శిరుత్తాంబు' అను దివ్య ప్రబంధము మొట్టమొదట నుట్టంకింపఁదగినది. అటుపిమ్మట-ఆచార్యహృదయము, పాదుకా సహస్రము, ద్రావిడ ఉపదేశ రత్నావళి, శతకోపరన్దాది, ఆళ్వార్ అనుభూతి,

10. జ్ఞాన శిఖరమ్ - వి. కే. ఆచార్య, 95 పుట.

దివ్య సూరి చరితము మున్నగు గ్రంథములు ముఖ్యములుగా పరిగణింపఁదగి యున్నవి. మఱియు – బ్రహ్మాండ పురాణము, భవిష్యత్పురాణము, మార్కండేయ పురాణము మున్నగు గ్రంథములందును నమ్మాళ్వారుల యవతార ప్రాశస్త్యమును గుఱించి విస్తారముగ ప్రస్తావింపఁబడి యుండుటనుఁబట్టియు – నమ్మాళ్వారుల మహా ప్రభావమును మనము సులభముగా గ్రహింపవచ్చును.

ఏ తింత్రిణీ కోటరమును నివాస స్థానముగా నేర్పఱచుకొని, దివ్యమైన తమ జ్ఞాన తేజమును నమ్మాళ్వారులు దిగంతముల వఱకు ప్రసరింపఁజేసిరో – ఆ తంత్రిణీ మహా వృక్షము నేటికిని 'ఆళ్వార్ తిరునగరి'లో సురక్షితముగా నుండి, దిదృక్షువులను విస్మయ చకితుల గావించుచునే యున్నది.[11]

నమ్మాళ్వారుల దివ్య ప్రబంధములు నాల్గును గలిసి – 'ద్రావిడ వేద సాగరము' అను ప్రఖ్యాతి నార్జించుకొని యున్నవి.[12] భగవద్రామానుజులు బ్రహ్మ సూత్రములపై 'శ్రీ భాష్యము'ను రచించునపుడు, నమ్మాళ్వారుల దివ్య ప్రబంధములు చాల వఱకు తోడుపడినట్లు తెలియుచున్నది.[13] అదియునుఁ గాక, శ్రీ వేదాంత దేశికులును – నమ్మాళ్వారుల దివ్య ప్రబంధములనుండియే వేదరహస్యములను గ్రహించినట్లు విశదమగుచున్నది.

---

11. జ్ఞాన శిఖరమ్ — వి. శ్రీ ఆచార్య, 94 పుట.

12. జ్ఞాన శిఖరమ్ — వి. శ్రీ ఆచార్య, 100 పుట.

13. "It is 'Tiruvaymoli' that has shaped the furniture of 'Sri Ramanuja's Capacious mind and heart."

– R. S. Desikan.

'Vedanta Kesari' May 1961, p. 47

నమ్మాళ్వారు చే రచింపబడిన 'తిరు వాయి మొళి' దివ్య ప్రబంధముపై - అనేక భాష్యములు, టీకలు వెలువడి యున్నవి. తెలుగులో - కన్నడములో - 'తిరు వాయి మొళి' అనూదిత మైనది. సంస్కృతములో - శ్లోక రూపమున ననువదింపబడిన 'తిరు వాయి మొళి' దివ్య ప్రబంధము - 'సహస్ర గీతి' యనుపేర సుప్రసిద్ధమై యున్నది.

నమ్మాళ్వారుల యనంతర కాలములో వెలువడిన భక్తి వాఙ్మయముపై - 'తిరు వాయి మొళి' దివ్య ప్రబంధము తన ప్రభావమును విశేషముగా ప్రదర్శించియున్న దనుట - తిరుగు లేని మాట. ఈ ప్రబంధమునందలి దివ్య సందేశములను తదనంతర కాలీను లైన భక్త కవు లనేకులు పరిగ్రహించి, తమ తమ గ్రంథ రచనల కుపక్రమించి యుండుట - గమనార్హమైన యంశము. అదియును గాక, వైయాకరణులు పలువురు - నమ్మాళ్వారుల పాశురములనే మంచి యుదాహరణములుగా గ్రహించి, వ్యాకరణ శాస్త్రములను రచించి, విశేషముగా ప్రశంసల నందుకొని యున్నట్లును తెలియ వచ్చుచున్నది.

మధురకవియాళ్వారుల రచనలు :-

నమ్మాళ్వారుల శిష్య రత్న మగు మధురకవియాళ్వారులు - తమ గురుదేవుల మహిమలను విశేషముగా కొనియాడుచు రచించిన పదునొకండు పాశురములు - 'కణ్ణినుణ్ శిరుత్తాంబు' అను పేర, నాలాయిర దివ్య ప్రబంధములో చేర్చబడి యున్నవి. తమ ఆచార్యులైన నమ్మాళ్వారులను భగవత్తుల్యులుగా సంభావించి, మధురకవి యాళ్వారు లీ స్తోత్రమును రచించియుండిరి. ఇందు - గుణ సంపత్తి గల గురువును ముముక్షువు లాశ్రయింపవలసిన విధియే గాక,

ఆచార్య (గురు) లక్షణము, భక్తి ప్రపత్తుల ప్రాముఖ్యము మొద లగు విశిష్ట విషయములు కూడ విశదీకరింపఁబడి యున్నవి. ఈ 'కణ్ణినుణ్ శిరుత్తాంబు'ను అధ్యయనము గావించిన పిమ్మటనే – 'తిరు వాయి మొళి' దివ్య ప్రబంధ మనుసంధింపఁబడుట పరిపాటిగా నున్నది.

కులశేఖరాళ్వారుల రచనలు :–

ఈ మహనీయులు తమిళ భాషలో నొక గ్రంథమును, సంస్కృత భాషలో నొక గ్రంథమును రచించియున్నారు. ఇందలి తమిళ గ్రంథము – 'పెరుమాళ్ తిరు మొళి' యను పేర, నాలాయిర దివ్య ప్రబంధమున పొందుపఱుపఁబడి యున్నది. ఇందు – 105 పాశురము లున్నవి. ఇవి తమిళభాషామయము లగుటచే, నాలాయిర దివ్య ప్రబంధమున ప్రకాశింపఁ జేయఁబడినవి. కాని, సంస్కృత రచన మాత్రము ఇందు చేర్చబడియుండలేదు.

'పెరుమాళ్ తిరు మొళి' యందలి పాశురములు – దశకము లుగా విభాగింపఁబడినవి. శ్రీ రంగమునఁ గల భక్తులతో గలసి, నృత్య సహితముగా భగవన్నామ సంకీర్తనము గావింపవలె నన్న యభిలాషయు, రా నున్న జన్మలో శ్రీ వేంకటాచలమున మఱల నేరూపమున నైనను జన్మింపవలెనన్న యాకాంక్షయు తమకు గాఢ ముగా గల దని కులశేఖరాళ్వారు లీ దశకములలో స్పష్టీకరించి యున్నారు. ఎనిమిదవ దశకములో – తనయుఁడైన దశరథ రాముఁడు పసితనమున నుండఁగా – రాముని వనవాస గమన కారణముగా దశరథుఁడు విలపించుట ఇత్యాది ఘట్టములు వర్ణింపఁబడినవి. చివఱి దశకములో – రామాయణ గాథ సంగ్రహముగా పొందు పఱుపఁబడినది. ఈ ప్రబంధమునందలి పాశురము లన్నియు –

భావ మధురములై, పాఠకుల హృదయములను ద్రవింపఁజేయునవియై యున్నవి.

కులశేఖరాళ్వారుల రెండవ రచన - సంస్కృతభాషామయము లైన నలువది శ్లోకములతో 'ముకుంద మాల' యను పేర విశ్వ విఖ్యాతి నార్జించి యున్నది. కులశేఖరాళ్వారులకు సహజ సిద్ధముగాఁ గల కవితా సంపదను - ఈ 'ముకుందమాల' మూలమునఁ మనము సులభముగాఁ దెలిసికొనవచ్చును. ఇందలి దివ్య సందేశములు భక్తి ప్రబోధసంభరితములు. భావపరంపరలు భక్తలోక శుభంకరములు. శ్లోకములు మధురాతిమధురములు. కనుకనే, ఈ 'ముకుంద మాల' - సంస్కృత వాఙ్మయ ప్రపంచమున మహోన్నత స్థాన మాక్రమించు కొనఁగల్గినది. భారతీయ భాషలలో దాదాపుగా నన్నింటియందును ఈ 'ముకుంద మాల' అనువదింపఁబడి యుండుటను బట్టి, ఈ గ్రంథ ప్రాశస్త్యము సుస్పష్టము. ఈ ముకుంద మాలపై 17 - వ శతాబ్దములో 'రాఘవానంద' అను నొక ప్రముఖ విద్వాంసుఁడు విపులమైన టీకను రచించుచు, అందు - 'ముకుంద మాల' కేవలము తిరుమంత్ర ముగా ప్రసిద్ధి జెందిన నారాయణాష్టాక్షరీ మహా మంత్ర ప్రభావ మును విస్పష్టముగా చాటుచున్న' దని, ఆ విద్వాంసుఁడు వే నోళ్ళ కొనియాడి యున్నాఁడు.[14] 'ముకుంద మాలా తాత్పర్య దీపిక' అను పేరు గల ఈ గ్రంథ రాజము - దేశమం దంతటను ప్రశంసల నందు కొనియున్నది.

పెరియాళ్వారుల రచనలు :-

'విష్ణు చిత్తులు' అను పేర సుప్రసిద్ధులైన పెరియాళ్వారుల రచనలు - 'తిరు ప్పల్లాణ్డు', 'పెరియాళ్వార్ తిరు మొళి' అను

---

14. శ్రీ ముకుందమాల (భూమికా భాగము)
— శ్రీ కె. రామవీరరాజు,
ప్రకాశకులు :- అన్నామలై విశ్వవిద్యాలయము.

పేర్లతో నాలాయిర దివ్య ప్రబంధమునందు మొదటి భాగములో (ముదలాయిరమున) చేర్చబడినవి.

'తిరు ప్పల్లాణ్డు' అను రచనలో – పండ్రెండు పాశురములున్నవి. గరుడ గమనుడైన భగవానుని గుఱించి మంగళాశాసనము గావించుచు, పెరియాళ్వారులచే గానము చేయఁబడిన గీతములే యివి. అసదృశమైన భగవానుని భువన మోహన సౌందర్యము నిరంతరము నిత్య నూతనమై ప్రకాశించుచుండవలెనని, పరమ భక్తాగ్రగణ్యులైన పెరియాళ్వారులు – గరుడవాహనారూఢుఁడై, తమకు దివ్య సందర్శన భాగ్యమును ప్రసాదించిన భగవంతునకు తమ శుభాకాంక్షల దెలుపుటయే యిందలి ప్రధానాంశము. ఈ సందర్భమున, భగవంతుని వివిధావతారములు సైతము పెరియాళ్వారులచే ప్రస్తుతింపఁబడినవి. భక్తులైనవారు – తమ జీవితములను భగవత్సేవయందే గడుపుట శ్రేయస్కరమని పెరియాళ్వారు లిందొక దివ్యసందేశము నొసంగి యున్నారు. నాలాయిర దివ్య ప్రబంధములో – ఈ 'తిరు ప్పల్లాణ్డు' కు – మిక్కిలి ప్రాముఖ్యమున్నది. నిత్యానుసంధానములో ఈ తిరు ప్పల్లాణ్డు – ప్రముఖ స్థానమాక్రమించి యున్నది. దీనిని శ్రీ వైష్ణవ సంప్రదాయులు ప్రణవ తుల్యముగా సంభావించి, ప్రతి దినమును భక్తి శ్రద్ధలతో ననుసంధించుచుండుట పరిపాటి.

'పెరియాళ్వార్ తిరు మొళి'లో – 461 పాశురములున్నవి. ఈ పాశురములలో – బాల కృష్ణుని మధుర లీలలు మనోహరముగా నభివర్ణింపఁబడి యున్నవి. ఈ ప్రబంధములో పెరియాళ్వారులు ప్రదర్శించిన వాత్సల్య భావములు – అత్యద్భుతములైనవి. పరాకాష్ఠ నందిన ఇట్టి వాత్సల్య భావములు – ఈ ప్రబంధమునఁ దప్ప,

తమిళ వాఙ్మయ ప్రపంచమున - మఱి చెప్పటకు కానరా వనుట - అతిశయోక్తి కానేరదు.

ఈ ప్రబంధములో - కృష్ణుని జన్మ దినోత్సవము, గోకుల ములో హర్షోల్లాసములు, కృష్ణుని నిద్ర బుచ్చుచు యశోద జోల పాడుట, కృష్ణుని సముదాయించుచు చందమామను బిలుచుట, కృష్ణుని కర్ణ వేధ సంస్కారము, కృష్ణునకు దృష్టి దోష పరిహారము, కృష్ణుఁడు వెన్నను తస్కరించుట, కృష్ణుని యాగడములను గోపికలు యశోదతోఁ జెప్పుట, కృష్ణుడు ఆవులను మేపుటకై అరణ్యమునకు వెళ్ళిన పిమ్మట - తల్లియైన యశోద విలపించుట, కృష్ణుని భువన మోహన సౌందర్యమునకు ముగ్ధలై, గోపికలు మోహముఁ జెందుట, కృష్ణుని వేణుగాన మాధుర్యము మున్నగు అనేక సన్నివేశములు మిగుల హృదయంగమములుగా వర్ణింపఁబడి యున్నవి. అందునను - బాలకృష్ణుడు మారాము చేయుట, హర్షముఁ జెందుట, విలపించుట మున్నగు సన్నివేశములను పెరియాళ్వారులు సహజ సుందరముగా నిందు చిత్రించి యున్నారు. శైశవానసలోఁగల కృష్ణుని వివిధ చేష్టలను బహు రమణీయముగ వర్ణించియున్నారు. చిరకాలమునుండియు తల్లులు తమ తమ పిల్లల నాడించునపుడు - పాలు త్రాపించునపుడు - నిద్ర బుచ్చునపుడు - ముద్దు లాడునపుడు పాడెడు పాటలకు వాఙ్మయ ప్రపంచమున, పెరియాళ్వారులు ప్రముఖ స్థానమునుఁ గల్పించి, చిర స్మరణీయులు కాఁగల్గిరి. 'పిళ్ళై తమిళ్' అని వ్యవహరింపఁబడు ఈ పాటలకు - తగిన బాణులను (Styles) రూపొందించుటలో - పెరియాళ్వారులే అగ్రగణ్యులై, అఖండమైన విఖ్యాతిని ఆర్జింపఁగల్గిరి. పెరియాళ్వారుల యనంతరము కవులనేకులు - విశిష్టమైన ఈ 'పిళ్ళై తమిళ్' కావ్య శైలి ననుకరించుచు, గీతముల నెన్నింటినో రచించి యున్నట్లు తెలియుచున్నది.

ఆండాళ్ రచనలు :–

ఆండాళు – ఒక మహా భక్తురాలే గాక, ఒక మహాకవ యిత్రి కూడ. గోదాదేవిగా ప్రసిద్ధి గాంచిన ఈ మహా భక్తురాలి రచనలు – కేవలము తమిళవాఙ్మయమునకే గాక, సకల భారతీయ వాఙ్మయమునకును గౌరవమును చేకూర్చియున్నవనుట సత్యదూరము కానేరదు. ప్రాచ్య పాశ్చాత్య పండితులు, తత్త్వశాస్త్రవేత్తలు మున్నగు వారసేకులు – ఆండాళ్ రచించిన కావ్యములలోని మధురాతిమధురములైన భావపరంపరలను పరిశీలించి, ఆశ్చర్య చకితులై, తత్కావ్య రత్నముల నెంతగనో ప్రస్తుతించి యున్నారు. అట్టి కావ్య రత్నములే – 'తిరుప్పావై', 'నాచ్చియార్ తిరు మొళి' యను పేర్లతో – నాలాయిర దివ్య ప్రబంధమున చేర్చబడియున్నవి.

'తిరుప్పావు' లో – ముప్పది పాశురము లున్నవి. ఇవి – వివిధ రాగ తాళములతో గానము చేయుట కనువుగా నొప్పారుచుం డును. మాసములలో శ్రేష్ఠతమమైన మార్గశీర్ష మాసమున నవయువ తులు యోగ్యులైన వరులను పొందుటకై, నియమయుక్తముగా నాచరించు 'మార్గళి నోము'కు సంబంధించిన విశేషము లిం దభి వర్ణింపఁబడి యున్నవి. ఈ వ్రతము కేవలము స్వయముగా నాచరిం చినవారికే గాక, దేశమునఁ గల ప్రజ లందఱుకును మేలు చేకూర్చు ననియు, సకాలమున వర్షములు వర్షించి, సస్యములు సమృద్ధిగా ఫలించి, పాడి పంటలతో దేశము సుభిక్షముగా నుండఁగల దనియు ఇందు స్పష్టీకరింపబడినది.[15]

---

15. "ట్గిళి యులగళన్ద వుత్తమన్ పేర్ పాడి
నాజ్గళ్ న మ్బావై క్కు చ్చాత్తి నీరాడినార్
తీజ్గిన్ఱి నా డెల్లామ్ తిజ్గళ్ ముమ్మారి పెయ్దు
ఓజ్గు పెరుఞ్జెన్నె లూడు కయలుగళ...."

– తిరుప్పావై : 9

దేశ కాల పాత్రతలను పరిగణింపక, ఆండాళ్ళు - తాను గోపికగా భావించుకొని, సఖీజనముతోఁ గూడి, తన యిష్టదైవ మగు కృష్ణుని సాన్నిధ్యమునకు వ్రతఫలప్రాప్తికై బయలుదేరుట మున్నగు విషయములు ఈ 'తిరుప్పావై'లో విశదీకరింపఁబడి యున్నవి. ఆ మహాభక్తురాలు - సహజసిద్ధమైన తన భక్తిభావమును విస్పష్టముగా నిందు పొందుపఱచుటయే గాక, తత్కాలీనములైన గ్రామజీవన విధానములనుసైతము రమణీయముగ వర్ణించియుండుటను బట్టి, ఆమె దృక్పథము సుస్పష్టము. ఈ 'తిరుప్పావై' దివ్యప్రబంధమునందుగల ముప్పది పాశురములు - మార్గళి మాసమున శ్రీవైష్ణవ గృహములలో శ్రవణానందముగ గానము చేయఁబడుచున్నవి. శ్రీవైష్ణవ సంప్రదాయులగు వివిధ వర్ణముల వారెల్లయును ఈ దివ్యప్రబంధమును భక్తిశ్రద్ధలతో అనుసంధించుచు, ఆత్మానందము నందుచుందురు. ఈ దివ్యప్రబంధమునందు గోదాదేవిచే ప్రతిపాదింపఁబడిన మార్గళి వ్రతము - కేవలము దక్షిణ భారతమునందే గాక, సుదూరముగాఁగల ఉత్తర భారతమునందును ఆచరింపఁబడుచుండుట - గమనావశ్యకమైన యంశము.[16]

'నాచ్చియార్ తిరుమొళి'లో - నూట నలువది మూఁడు పాశురములు వివిధ రాగ తాళములతో, గానము చేయుట కనువుగానున్నవి. జగన్మోహనుఁడైన కృష్ణునకు తాను ప్రియురాలుగాఁ దలంచుకొని, అట్టి ప్రేమాతిశయముతో ఆండాళ్ రచించిన పాశురములే యివి. శ్రీకృష్ణునియందు తనకుఁగల యనురాగమును మన్మథునకుఁ దెలుపుట, కోకిలలతో - మేఘాదులతో కృష్ణునకు తన సందేశములనుఁ బంపుట, కృష్ణుని రాకకై పరితపించి ప్రార్థించుట,

---

16. 'Voice and Vision of Andal'

— P. S. Acharya's article,
Souvenir — All India Writers Conference, 1959, p. 154.

స్వప్నమున మాధవునితో వివాహ మాడుట, కృష్ణునితో సంయోగ వియోగము లేర్పడుట మొదలగు విషయములు ఈ పాశురములలో వర్ణింపఁబడి యున్నవి. ఈ ప్రబంధమునఁ గల 'వారణ మాయిరమ్' అను దశకము – వైష్ణవ గృహములలో, వివాహ మహోత్సవ సందర్భమున గానము చేయుట – పరిపాటిగా నున్నది. ఇయ్యది ఒక విశేష విషయముగా గమనింపఁదగినది.

తొండరడిప్పొడియాళ్వారుల రచనలు :–

వీరు రచించిన రెండు గ్రంథములు – 'తిరు మాలై' 'తిరు పళ్ళి యెళుచ్చి' యను పేర్లతో నాలాయిర దివ్య ప్రబంధమునందు చేర్చబడియున్నవి.

'తిరు మాలై' యనఁగా – 'పవిత్ర మైన మాల' అని యర్థము. ఇందు – నలువది రెండు పాశురము లున్నవి. ఈ పాశురములలో నసేకములు ఆత్మ నివేదన పరములై యొప్పారుచుండును. భగవ త్సన్నిధానమున తొండరడిప్పొడియాళ్వారులు తమ దైన్యమును ప్రకటించుచు, తమను దాసానుదాసునిగా స్వీకరింపవలసిన దని ప్రార్థించిరి. ఈ ప్రబంధమున భక్తివైభవము విశేషముగా వర్ణింపఁబడినది. ఇందలి కవితా శిల్పము అనన్యాద్భశ్యమై, మనోహరమై యలరారుచుండుటనుఁబట్టి, ఈ తొండరడిప్పొడి యాళ్వారులకు సహజసిద్ధముగాఁగల కవితా నైపుణ్యమును మనము సులభముగా గ్రహింపవచ్చును.

తమిళనాఁడులో – 'తిరు మాలై అట్టియాన్' అను నొక లోకోక్తి యున్నది. అనఁగా – 'తిరు మాలై' యను పేరు గల దివ్య ప్రబంధ మెఱుంగనివాఁడు – తిరుమాల (విష్ణువు)ను తెలియఁ జాలఁడని యర్థము. ఇందువలన – 'తిరు మాలై' ప్రబంధ వైశిష్ట్యము సుస్పష్టము.

తొండరడిప్పొడి యాళ్వారుల రెండవ రచన యగు 'తిరు ప్పళ్ళి యెళుచ్చి'లో - పది పాశురము లున్నవి. ఇవి - పరమా త్ముని మే ల్కొల్పుచు, గానము చేయుట కనువుగా రూపొందింపఁ బడినవి. సుప్రభాత గీతములకు వలెనే ఈ పాశురములకును మిక్కిలి ప్రాముఖ్య మున్నది. కనుకనే, ఈ పాశురములు నిత్యానుసంధానములో పొందుపఱుఁబడి, ప్రతి నిత్యము ప్రాతఃకాలమున విష్ణ్వాలయములలో ననుసంధింపఁబడుచున్నవి. ఇందలి యొక పాశురమున తొండరడిప్పొడియాళ్వారులు ప్రకృతిని వర్ణించుచు, శయ్యను వీడవలసినదని పరమాత్మను ప్రార్థించిరి. మఱియొక పాశురములో - ప్రాతఃకాలమునందలి వాతావరణమును వర్ణించిరి. ఈ పాశురములలోఁగల వాక్య నిర్మాణము మిగుల హృదయంగమమైనది.

తిరుప్పాణాళ్వారుల రచనలు :-

పది పాశురములు గల తిరుప్పాణాళ్వారుల యేకైక రచన - 'అమలనాది పిరాన్' అను పేర నాలాయిర దివ్య ప్రబంధమందు పొందుపఱుపఁబడినది. ఇందు - శ్రీరంగనాథుని దివ్య సౌంద ర్యము నఖ శిఖ పర్యంతము రమణీయముగ అభివర్ణింపఁబడినది. ఈ ప్రబంధము నిత్యానుసంధాన యోగ్యముగా సంభావింపఁబడి, సంప్రదాయజ్ఞులచే అనుదినము గానము చేయఁబడుచున్నది. ఈ తిరుప్పాణాళ్వారుల భక్తి వైభవమును శ్రీ వేదాంత దేశికులు బహు భంగులుగా అభినందించుచు - సంస్కృతభాషయందును, తమిళ భాషయందును అనేక గ్రంథములను రచించియుండుటే గాక, 'అమల నాది పిరాన్' ప్రబంధమునకు ప్రత్యేకముగా టీక నొక ధానిని రచించియున్నారు. ఇది - 'ముని వాహన భోగమ్' అను పేర

సుప్రసిద్ధమై యున్నది. ఇందునలన, ఈ ప్రబంధ ప్రభావము సులభ గ్రాహ్యము.

తిరుమంగై యాళ్వారుల రచనలు :-

నాలాయిర దివ్య ప్రబంధమును సావధానముగ పరిశీలించినచో – తిరుమంగై యాళ్వారులు రచించిన పాశురములే అధిక సంఖ్యలో నున్నట్లు మనము గ్రహింపఁగలము. ఈ పాశురము లన్నియు – వివిధ రాగ తాళములతో సమకూర్పఁబడి యున్నవి. తిరుమంగై యాళ్వారులు రచించిన ఆఱు ప్రబంధములు – పెరియ తిరు మొళి, తిరుక్కురు న్దాణ్డకమ్, తిరు నెడు న్దాణ్డకమ్, తిరువెళుకూ త్తిరుక్కై, శిఱియ తిరు మడల్, పెరియ తిరుమడల్ అను పేర్లతో నొప్పారుచున్నవి. ఇవి యాఱును వేదాంగములుగా సంభావింపఁబడుచున్నవి. పెరియ తిరుమొళిలో 1084 పాశురము లున్నవి. తీర్థ యాత్రగా పర్యటించుచు – తా మనేక దివ్య క్షేత్రములలోని యర్చా మూర్తులను సందర్శించినపుడు, తిరుమంగై యాళ్వారు లిందలి కొన్ని పాశురములలో సంస్తుతించి యున్నారు. తాము యౌవన దశలో గావించిన దుష్కృత్యములకు మిగుల వగచుచు, భగవచ్చరణారవిందములయందాత్మ సమర్పణము గావించిన వృత్తాంతమును సైతము – తిరుమంగై యాళ్వారు లీ ప్రబంధమున వ్యక్తీకరించియున్నారు. అనేక తాత్త్విక రహస్యములతోఁ గూడిన యీ ప్రబంధము – నిత్యానుసంధానయోగ్యముగా నొప్పారుచున్నది.

'తిరు క్కురు న్దాణ్డకమ్' అను ప్రబంధములో – ఇరువది పాశురము లున్నవి. 'తిరు నెడు న్దాణ్డకమ్' అను ప్రబంధములో ముప్పది పాశురము లున్నవి. సాంసారికమైన మోహ బంధము నుండి విడువడి, పరమ కారుణికుఁడైన భగవంతుని శరణు పొందుటవలనఁ గల్గు ప్రయోజనము వీనిలో విశదీకరింపఁబడినది.

ఆళ్వారుల భక్తిసిద్ధాంత ప్రాశస్త్యము

ఆంగ్ల మూలము :

డాక్టర్ : జి. బి. గోపాల కృష్ణ నాయుడు

ఆంధ్రానువాదము :

'బాల విద్వత్కవి'

శ్రీమాన్ కె.వి.వి.యల్. నరసింహాచార్యులు, ఎం.ఏ; బి.యల్.

—*—

ఆళ్వారుల తత్త్వ పరిశీలనము

ఆరంభ వాక్యము :-

భారతదేశమున సామాన్యముగను, దక్షిణభారతమున విశేషముగను బ్రహ్మవాదములు కొన్ని బాహిరిల్లినవి. ఈ బ్రహ్మవాదములను ఆళ్వారులు తమ దివ్య ప్రబంధములలో ప్రస్తావించుటేగాక, భగవద్గుణానుభవ స్ఫోరకములగు స్తోత్రము లనేకములను అత్యంత మనోహరమగు శైలిలో గానము చేసిరి.

విశిష్టాద్వైతము :-

అనుపమానములగు ఆళ్వారుల దివ్య గానములు - విశిష్టాద్వైత సిద్ధాంత పరిమళములను వెదజల్లినవి. ఈ విశిష్టాద్వైత సిద్ధాంతమే వారి యనంతరము శ్రీ భగవద్రామానుజులచే ప్రతిస్థాపితమైనది.

దివ్యప్రబంధనిర్మాణ ప్రవీణులు :-

పరమ భాగవత శిఖామణు లగు ఆళ్వారుల ప్రభావము మన సాంఘిక వ్యవస్థపై, చెరగని ముద్ర వైచినది. వారి భగవద్గుణాను భవములు, పవిత్ర జీవితములు, భక్తి ప్రపత్తులు - మానవాళికి తేజో మయ మార్గదర్శకములై చెలువారినవి. 'ముద లాళ్వారులు' అను ప్రసిద్ధి గాంచిన పొయిగ - పూదత్త - పే యాళ్వారులు ముప్పురును, నాలాయిర దివ్య ప్రబంధ నిర్మాణమునకు శ్రీకారము చుట్టిన మహనీయులు. వారి 'అందాది' దివ్య ప్రబంధత్రయము సకల లోకమునకు బ్రహ్మానంద సంధాయకము. వారి యనంతరము, భక్తి సారాభిదులగు తిరుమళిశై యాళ్వారులు - తమ పాశురములందు శ్రీ వేంకటేశ్వర పాదపద్మ సన్నిహితుఁడగు రాకాశశాంకునిచే బాహ్యాంతర సంతమసము నిర్మూలింపఁబడుట కీర్తించిరి. పరమ దయాపూర్ణ హృదయులు - కవి వరేణ్యులు నగు నమ్మాళ్వారులు - సంసారార్ణవ మగ్నులగు మానవులపై, కరుణామృత వర్షమును కురిపించిన మహనీయులు. మధురకావ్యరచనా ధురంధరులగు మధుర కవి యాళ్వారులు - నమ్మాళ్వారులను ఆరాధించి తరించిరి. మఱియు - 'గురుం ప్రకాశయే దీమాన్' అను ఉక్త్యనుసారము - గురు గుణానుభవము గావించి, శిష్య ధర్మమును నిరూపించిరి. కుల శేఖరాళ్వారులు - సీతాపహరణ దోష దూషితుఁడగు రావణునితో యుద్ధ మొనరించుటకు సన్నద్ధులైరి. గుణవృద్ధులైన పెరియా ళ్వారుల పౌష్య పుత్రికయగు గోదాదేవి - శ్రీరంగనాథ విరహ వేదనా దోదూయమాన మానసయై, పరమపదనాథునే పరిణయ మాడెను. భక్తాంఘ్రిరేణులుగ ప్రఖ్యాతిఁ గన్న తొండరడిప్పొడి యాళ్వారులు - శ్రీరంగనాథ గుణానుభవము గావించి, సదా పరమ పద సనాథ సాన్నిధ్యమునే సమాకాంక్షించిరి. తిరుప్పాణాళ్వారులు

శ్రీరంగనాథ దివ్య సౌందర్యమును పాదాది కేశాంతము తమ పాశు రములలో తనివిదీర అభివర్ణించి, తన్మయులై, ధన్యజీవులై, ఆ పరా త్పరునియందే లీనమైరి. తిరుమంగై యాళ్వారులు బహు కాలము భాగవత తదీయారాధనము గావించి, భగవత్కటాక్షమునకు పాత్రు లైరి. ఇట్లు చరితార్థులైన పన్నిద్దరాళ్వారులు - తమ దివ్య ప్రబంధ ములలో - గహన వేదాంత శాస్త్ర రహస్యములను, భగవత్కృపా విశేషములను గాన మొనరించి, చిర యశము గాంచిరి.

శ్రీ వైష్ణవ సిద్ధాంత బీజములు

ఆళ్వారుల దివ్యప్రబంధములందే, శ్రీ వైష్ణవ సిద్ధాంత బీజ ములు నిక్షిప్తములై యున్నవి. అర్చారూపమున వేంచేసియున్న భగవంతుని, వారు తమ పాశురములలో సంస్తుతించిరి. భగవంతుడు ఆలయములలో - అర్చారూపముల అంతర్యామిగా అధివసించి యున్నాడని వారి యభిప్రాయము. వారి దృష్టిలో అవి విగ్రహములు కావు.సాక్షాత్ పరాత్పరుడే. భగవంతుడు ఆలయములందలి అర్చా రూపము విడనాడి యుండడని వారి అచంచల విశ్వాసము. కనుకనే, దివ్య దేశములను దర్శింపనగునని వారు మానవాళిని ఉద్బోధించిరి. తిరుమంగై యాళ్వారులు ఒక్కరే, తమ దివ్య ప్రబంధ షట్కములో - దివ్య దేశముల నెన్నింటినో కీర్తించిరి. పరమాత్మని పర వ్యూహ విభవ అంతర్యామి అర్చావతారములయందు ఆళ్వారులకు మక్కువ యెక్కువ.

ఆళ్వారుల తత్త్వ సిద్ధాంతము

పెరియాళ్వారులు :-

'భగవంతుడున్నాడు. అతడు పరాత్పరుడు; సర్వాంతర్యామి' యని వీరు ప్రబోధించుచు, 'భగవన్ ! నిన్ను నా యం

చుంచుకొంటిని, నేను నీలోచేరితిని' అని, తమ దివ్య ప్రబంధమున కీర్తించిరి. పరాత్పరుని పుత్ర భావముతో ఆరాధించిరి. తమ పాశురము లందలి భావాభరణములచే, దైవమును అలంకరించిరి.

అండాళ్ :-

ఆళ్వారులలో కొందరు నాయకీ భావము నాశ్రయించిరి. ఆండాళ్ తన ప్రేమానురాగములను శ్రీ వేంకటేశ్వరునకు తెలియఁబరచెను.

నమ్మాళ్వారులు :-

వీరి సిద్ధాంతమున భగవత్తత్త్వము - సత్య స్వరూపము, ఆనంద స్వరూపమును అయి యున్నది. భగవంతుఁడు భక్తులయెడ దయామయుఁడు; సర్వ కల్యాణ గుణాకరుఁడు; ఆర్తత్రాణపరాయణుఁడు. చరాచరవిశ్వము భగవచ్ఛరీరభూతము. ఈ యనంత విశ్వమునకు భగవంతుఁడు ఆత్మభూతుఁడు. పరమాత్మ జీవాత్మల సంబంధము నానావిధము. జీవుఁడు భక్తి ప్రపత్తుల మూలమున మోక్షమును పొందును. ఇదియే నమ్మాళ్వారుల తత్త్వనిర్ణయము. స్వధర్మాచరణముచే మానవుఁడు తన్ను తాను అర్థము చేసికొనఁగల్గును. ఈ యాత్మజ్ఞానము భగవత్ప్రాపక మగును.

మధురకవి యాళ్వారులు :-

అమృత రసనులును - పీయూషపద్యులు నగు ఈ మధురకవి యాళ్వారులు - భగవద్గుణానుభవమునకన్న, గురుగుణ స్తుతియే మిన్న యని భావించిరి. ఈ యాశయము - మోక్షము గురుద్వారక మను శ్రీ వైష్ణవ సిద్ధాంతమును స్మరింపఁజేయును. అర్వాచీన విశిష్టాద్వైతమున, ఇదియే భరసమర్పణరూపమును దాల్చి

యుండనోపును. మధురకవుల గురుస్తోత్రరూపమగు శంఖ నాదము - పూర్వోక్త శ్రీ వైష్ణవసిద్ధాంతవైశిష్ట్యమును ప్రతిధ్వనింపఁ జేయు చున్నది.

కొండరడిప్పొడియాళ్వారులు :-

వీరు - పునర్జన్మరాహిత్యము గావింపు మని, శ్రీ రంగనాథు నర్థించిరి. ఏల యన, వేదోక్తమగు శతసంవత్సరపరిమితాయుర్దా యము కల్గినను, అందు బాల్య కౌమార యౌవన దశాను రూప ప్రవృత్తులును, సాంసారిక సంకటములును, ని ర్దాసల్య జరావస్థ లును, నైరాశ్యాదులును అనుల్లంఘనీయములుగదా ! ఈ సత్య మును చిత్తమం దిడు కొనియేకాఁబోలు, భర్తృహరి - 'ఇద మను చిత మక్రను శ్చ పుంసాం యదిహ జరా స్వపి మన్మథా వికారాఃʼ అని యుద్ఘాటించినాఁడు.

ఆళ్వారుల తత్త్వశాస్త్రము

'భగవంతుఁడు ఒక్కఁడే ఉన్నాఁడు. అతఁడు అద్వితీయుఁడు. త దితరము అశాశ్వతము. చిదచిద్వస్తుద్వయము బ్రహ్మ శరీర భూతము తన్నియామ్యములు తదపృథక్‌సిద్ధవిశేషణములు. ప్రపం చము, ప్రాపంచక జీవితము సత్యములే. కాని, అవి అశాశ్వ తములు. భగవద్భక్తి ప్రపత్తులే మోక్షదాయకములు' అని, ఆళ్వా రులు - సంసారార్దిత మగు మానవాళికి చాటి చెప్పిరి.

శ్రీవైష్ణవునకు జీవితము సత్యమే. విహితధర్మమును భగవ దర్పితముగ ఆచరించుటయే అతని కర్తవ్యము. నిజమైన వైష్ణవుఁడు మాధవుని దర్శించి, మానవోద్ధరణమునకై యత్నించును. శ్రీవైష్ణవ తత్త్వశాస్త్ర ముక్తాఫలములు పన్నిద్దరాళ్వారులచే, భక్తిప్రబోధక ములైన తమ దివ్య ప్రబంధములందు ప్రకటీకరింపబడినవి.

ఆళ్వారులు వర్ణాశ్రమాతీతులుగఁ గన్పింతురు. లింగభేదముకూడ వారియెడ వర్తింపదు. భగవత్సృష్టిలో అందఱును సమానులే యని వారి అభిప్రాయము.

ఆళ్వారుల పాశురములు - వారి ఆమృతపూర్ణ హృదయ సరోవరములనుండి, సుధాధారలవలె నిస్సృతములైనవి. ఆండాళ్ - నిత్యకల్యాణి; ప్రేమప్రపూర్ణ; భక్తి రస భరిత హృదయ. ఆమె జీవితము, ప్రబంధము - వివాహ సిద్ధమగు నాయకీ భావ భక్తి విశేషమును లోకమునకు అభివ్యక్తము గావించుచున్నవి. నమ్మాళ్వారులు భగవద్విరహబాధానుభవ స్ఫోరకములగు పాశురములను రచించి ఆనందించిరి. వారి రచనలలో - భగవంతునియెడ వారికిగల ప్రీతి గోచరించును. 'మహనీయవిషయే ప్రీతిర్భక్తిః' అనియే కదా శ్రీభాష్య సిద్ధాంతము ! తద్బీజములను ఇందు గానవచ్చును. తత్త్వ శాస్త్రరహస్యము లెన్నియో వీరి ప్రబంధములం దున్నవి. ఆళ్వారులు - పరమైకాంతులు; అనన్యభక్తి సంయుక్తులు; మహాత్ములు. ఆత్మార్పణ ధ్యాన భక్త్యాది సాధనములచే వీరు భగవత్సాక్షాత్కార భాగ్యమును పొందిన మహానుభావులు. ధ్యాన మనగా - 'తైల ధారావ దవిచ్ఛిన్న స్మృతిసంతాన రూపా' అని, అభియుక్తోక్తి. వీరి బ్రహ్మానందానుభవము భగవద్విశ్లేషదుఃఖము మనలను ఆ పరాత్పరుని సన్నిధికి జేర్చ సమర్థములై యున్నవి.

ఆళ్వారుల శ్రీసూక్తులు

ముదలాళ్వారులు :-

పన్నిద్దరాళ్వారులకు భక్తులపైఁ గల ప్రభావము, వారి తత్త్వ సిద్ధాంతము, వారి ఐకాంతిక భక్తి మొదలగు విషయములఁ గూర్చి మన మిపుడు పరిశీలింతము. జగన్నాటకమునందు ఈ యంత

ర్నాటక రంగ స్థలము - తమిళ నాడు నందలి తిరుక్కోవలూరులోని ఒక చిన్న మందిరమున ఏర్పరుపఁబడినది.

ప్రచండ వర్ష మారుత వైద్యుతాహతులచేతను, ధారాపాత నిశాంత వేగవశమునను ఇద్ధాత్రీతలం బాహతం బగుచుండ, అట్టి సమయమున, అపరిచిత మూర్తి త్రయము పూర్వోక్త మందిరమున తలదాచుకొనుట కేతెంచి, ఆకస్మికముగ ఒకరి నొకరు కలిసికొనిరి. ఈ యాగంతకులు - ఒకరి నొకరు అపరిచితులు. వారు మహా కవులు; మహా భక్తులు; కాంచీపుర - మహాబలిపుర - మైలాపురములకు చెందినవారు. పరస్పర సంభాషణా ఫలితముగ, వారు - తామొకొక్కరు, భక్తి రూపాపన్న జ్ఞాన సంపన్ను లని తెలిసికొనిరి. వారి హృదయ కుహరములందు - భక్తి నాడులు స్పందించినవి. వారు అనిర్వచనీయము - అద్వితీయము - అపూర్వము నగు బ్రహ్మను భవనమునకు లోనైరి. వారికి నాల్గవ వ్యక్తి యొకరు లోపలకు ప్రవేశమును కాంక్షించుచు, తలుపు తట్టినటుల శబ్దము శ్రవణ గోచర మయ్యెను. ఆ మందిరము అల్పావకాశముగల దగుటచే, వా రొకరి నొకరు ఒరసికొని యుండిరి. వారు ఈ విచిత్రానుభూతి రహస్యమును తమ వేదాంత విజ్ఞానమున నెఱుంగ దలంచిరి.

ప్రథము లగు ఆళ్వారులు - దశదిశల నావరించిన గాఢాంధకారము ప్రాణద ప్రకాశముగ మారవలె ననికాంక్షించిరి. 'తమసో మా జ్యోతి ర్గమయ' అను వేదవాదమును ఈ యాళ్వారుల తలంపు - స్మృతి పథమునకుఁ దెచ్చుచున్నది. ఆళ్వారులు అట్లు ఆకాంక్షించుటయే తడవుగా, వారి ముఖారవిందమునుండి, సర్వాలంకార సంశోభిత యైన గంభీర సరస్వతి - పాశుర రూపమున నిస్సృతయైనది. 'ఈ యనంత విశ్వము ఒక ప్రదీపము. సప్త సముద్రములుఘృతము.

ఆదిత్య మండలము ఆరని జ్వాల' అని, ఆ పాశురార్థము. ఆహా ! ఏమి పరిణామము ! తత్ క్షణమే గాఢ తమము విరిసెను. సర్వము తేజోవంత మయ్యెను. ఆ మువ్వురు యోగులును అన్యోన్య దృగ్గోచరులైరి. పరస్పర ప్రజ్ఞా విశేషములను అవగాహనము చేసికొనిరి. కాని, సర్వతః పీడనము మఱల తీర్ఘ్ఘ కృత మాయెను. మహాబలి పురాగత మహాయోగులు - ఈ యాంతర స్తంభనము చర్మచక్షు ర్గ్రాహ్యము కాదని గ్రహించిరి. మరుక్షణమే వారి ముఖారవిందము నుండి, మృదుమధుర పదగుంభిత మగు ప్రబంధము జాలువారినది. అది వారి యాంతర సంతమసమును బార్ద్రదోలినది. వారి యజ్ఞానము నకు భరత వాక్యము పల్కినది. ఈ పాశురము - 'అమ్మ' అను పాత్ర యందున్న దివ్య ప్రేమను, భగవ ద్విరహార్తి యను ఘృత మును,నిరంతర విరహానల దహ్యమాన మనోరూపవర్తిని సూచించినది. ఈ ద్వితీయ దీపశిఖ వెలుఁగున, జ్ఞానోదయమైనది. జ్ఞానచూడర్ దీపము వెలిగెను. ఆంతర సంతమసము తొలఁగెను. అద్యతన క్షణ మున వారు - ప్రకాశ సౌరభ్యముల వెదజల్లుచున్న పరమాత్మ సాన్నిధ్యము ననుభవించిరి.

మైలాపుర మహాయోగులు హర్షోత్కర్షమున నాట్య మాడిరి. తప్త కాంచన వర్ణుడగు నారాయణుఁడు, తద్దివ్యమహిషి యగు లక్ష్మీదేవియు సాక్షాత్కరించిన దృశ్యమును అభివర్ణించుచు, వారి ముఖారవిందమునుండి మధుర భాషాగీతి వెలువడెను. వారు ఉదయ భానుబింబమును దర్శించిరి. నారాయణుని దక్షిణ హస్తమున స్ఫుర ల్సహస్రార సుదర్శనమును, వామ హస్తమున నదత్ పాంచజన్య మును దర్శించిరి. భువనసుందరుని దివ్య సౌందర్యమును రెప్ప వాల్పక జూచిరి. దివ్య వైభవమును తన్మయులై ఆలోకించిరి. దివ్య సౌరభము నాఘ్రాణించిరి. వారికి నేత్రపర్వ మయ్యెను. ఆళ్వారుల వచో రచ

నగరి బట్టి, వారట్టి దివ్యమంగళవిగ్రహము నెన్నడును దర్శించి యుండలేదని విదిత మగుచున్నది. మైలాపుర యోగివరుల వాగ్విన్యాసము పరాత్పరునకు స్వాగతము పల్కినది.

ఆ మువ్వురు మూర్తులను — ప్రేమ ప్రఫుల్లము, ప్రశంసనీయము, మనోహరము నగు భగవత్స్వరూపము తమ్మాశీర్వదించుచున్నటులను, భక్తి ప్రేమ తత్త్వములు తమకు కర్ణజపము చేయుచున్నటులను అపూర్వానుభవము నందిరి. ఆ పురుషత్రయమున, సాక్షాన్నారాయణునిచే నుపదేశింపబడిన తత్త్వ రహస్యమే నాలాయిరమునకు నాంది యైనది. ఈ మువ్వురే కాంచీపుర వాసులగు పొయ్‌గై యాళ్వారులు, మహాబలిపుర వాసులగు పూదత్తాళ్వారులు, మైలాపుర వాసులగు పేయాళ్వారులు అయి యున్నారు. వీరు క్రమశః అల్పిశి మాసమున — తిరువోణమ్, ఆవిట్టమ్, సదయమ్ * అను శుభ నక్షత్రాధిష్ఠిత లగ్న వేళలయందు జన్మించిరి. తిరుక్కోవలూరు — ఆళ్వారులచే నుపదిష్టమైన భగవత్ప్రేమ తత్త్వమునకు జన్మస్థాన మని వాసి కెక్కెను.

అల్పిశి మాసమున ఈ మూర్తిత్రయ మవతరించుటలో మఱియొక ఆంతర రహస్యముకలదు. దీపోత్సవ వైభవాన్విత మగు దీపావళి పండుగ — అల్పిశి (ఆశ్వయుజ) మాసమున జరుపుకొందుము. మన ఆత్మతత్త్వముల ప్రకాశింపఁజేయు నవసరము తెలుపుటకో యనునట్లు, ఈ మహాపురుష త్రయము ఈ మాసమున నవతరించెను. ఈ మువ్వురు వెలిగించిన జ్ఞాన దీప శిఖయే నిజమైన దీపావళి.

పేయాళ్వారులు తత్త్వమును కరతలామలకమువలె దెల్పిరి. భావితరములవారికై, 'వారు — 'తిరు' 'మే' అను పదములను 'తిరుమే' అని సంధించిరి. ఈ యాళ్వారుల ముఖ నిస్సృతమగు దివ్య ప్రబంధమే శ్రీ వైష్ణవ తత్త్వరహస్య వేదాంత శాస్త్రమునకు

---

* తిరువోణమ్, ఆవిట్టమ్, సదయమ్ అను పదములకు క్రమముగా - శ్రవణము, ధనిష్ఠ, శతభిషము అని యర్థములు.

— సంపాదకుఁడు

నాంది యైనది. తరువాతి ఆళ్వారులు నాలాయిర దివ్యప్రబంధ నిర్మాణ సమన్వయమునకు కొనసాగించిరి.

తిరుమళిశై యాళ్వారులు :-

వీరు భగవంతుని వశము గావించుకొన్న మహనీయులు. 'భక్తి సారులు' అను పేర సుప్రసిద్ధులు. 'భగవంతుడు భక్త పరాధీనుడు' అను సత్యము వీరి యెడ నిరూపితమైనది. మనో వాక్కాయ కర్మలచే వీరు ఐకాంతిక – ఆత్యంతిక భక్తివిశేషమును ప్రదర్శించిరి. భగవంతుడు అర్చా రూపమున వీరి ననుసరించెను. ఈ యాళ్వారు లొకసారి కుంభకోణమున కేగి, 'ఆరా అముదమ్' ఆలయమున, శార్ఙ్గపాణి స్వామిని దర్శించిరి. యోగనిద్రయందున్న ఆ స్వామి విశ్రాంత భావము నుపలక్షించి, వీరు సూటిగ పరాత్పరునే తదవస్థాకారణము ప్రశ్నించిరి. 'ఈ విశాల విశ్వము నీ పదాంకితము చేయుచు గుమ్మరుటచే, నీకు శ్రమ కల్గుట లేదా ? రమాదేవీ సంరక్షణమునకై నీవు వారాహ రూపమున భూ నివరము సొచ్చి శ్రమించుటచే, శరీరము వివశ మయ్యెనా ? కావేరీ తీరస్థమగు 'కుడందై' యందు నీవున్న నిద్రాముద్రిత స్థితికి గతం బేమి ? భగవత్ప్రేమ విషయకమగు తమ యీ ఆవేదనను తమ ప్రశ్నమునకు ఉత్తర మొసంగి, ఉపశమింపఁజేయు' మని భక్తిసారులు భగవంతుని విన్నములై ప్రార్థించిరి.

వాత్సల్య భావభరితమగు ఏత ప్రశ్నము భగవంతుని యుత్తరమునకు పాత్ర మయ్యెను. సుందర కావ్యమున పొదుగఁబడిన ఈ ప్రశ్నమునకు సమాధాన మొసంగుటకై భగవంతుడు తల యెత్తి, శేషశయనమునుండి లేచుటకు ఉద్యుక్తుఁడయ్యెను. భక్తిసారులీ దృశ్యమును గాంచి, మంత్రముగ్ధులైరి. భగవంతుని

కృపా విశేషము నుగ్గడించి, నిద్రాభంగము గావించినందులకు మిగుల వగచి, యోగనిద్ర నుండు మనియు, లేవవే దనియు ప్రార్థించిరి. ఇట్లు ప్రార్థింప, 'ఆరావముదన్' లేచుట మానెను. పైకెత్తబడిన భగవంతుని తల - నేటికిని అచ్చట గాన నగును. 'భగవంతుఁడు భక్తపరాధీనుఁడు' అను సత్యము ఇచ్చట ద్యోతక మగుచున్నది. భక్తిసారులు మంగళాశాసనము చేసి, భగవత్కటాక్షమును అభ్యర్థించిరి.

ఈ భక్తిసారుల విషయక మగు మఱి యొక అమ్మృత సంఘటనము తంజావూరు మండలములోని 'తిరువయ్యారు' పరిసరమునఁ గల 'పెరుం పొలియూర్' ఆలయమున జరిగెను. వేదవిద్వాంసులు వీరికి ఆలయ ప్రవేశమున కనుమతి యొసంగరైరి. కాని, వీరు భగవద్దర్శనోత్సుకులై, యే రంధ్రమునుండియైన భగవద్దివ్యమంగళవిగ్రహము నేత్రపర్వముగ గన్పట్టునేమో యను తలంపుతో, ఆలయ ప్రదక్షిణము చేసిరి. భగవద్ధ్వజము ప్రదక్షిణము చేయుచున్న భక్తిసారులకు దర్శన మొసంగు సంకల్పముతో, సర్వతోముఖముగ సంచలించుచుండుట చూచి, వేదవిద్వాంసులు పరమాశ్చర్య మగ్న మానసు లైరి. ఆ వైదికులు క్షమా భిక్ష నర్థించుచు, తిరుమొళిశైయాళ్వారుల పాద పద్మములకు సాష్టాంగ నమస్కృతు లొనర్చిరి.

మఱియొకసారి, రాజాజ్ఞానుసారము భక్తిసారులు - తమ శిష్యుఁ డగు 'కణికణ్ణన్'తో పాటు నగరమును వీడి యేగు నెడ, కాంచీవరదరాజస్వామియు - ఆలయమునుండి పయనమై, వారి ననుసరించెను. నరపాలుఁ డపుడు తన తప్పును గ్రహించి - క్షమా భిక్ష నర్థింప, భక్త సంకల్పానుగుణముగ భాగవతోత్తములతో భగవంతుఁడు నగరమునకు మఱలెను. పరమ భాగవతశిఖామణు లగు ఆళ్వారుల కనుసన్నల ననుసరించి, పరమాత్ముఁడు మెలంగెడివాఁ

డని ఆంతర తత్త్వ రహస్యము. అర్చారూపములయందలి దివ్యత్వము ఈ యాళ్వారులచే చక్కగా నిరూపింపఁబడినది.

భక్తసాధుల కవిత - గహనమును, పాండిత్య స్ఫోరకమును అయి యున్నది. స్వీయ జన్మమునకు పూర్వము పరాత్పరుఁడు స్థితి త్రయమునం దుండెనని యు, స్వావిర్భావాత్పరము ఆ స్థితి త్రయము వీడి, స్వీయ కుహరాంతర్యామిగా నున్నాఁడనియు భక్తసాధులు వక్కాణించిరి.

'విశిష్టాద్వైతము శాస్త్ర సమ్మతము. దీనివలన, ప్రతిమానవుఁడును, ప్రాపంచిక జీవితములో - ఉదాత్త భావములను, భగవద్భక్తిని, ప్రేమ తత్త్వమును పెంపొందింపఁజేసికొని, ఉత్తమ జ్ఞాన పర్యవసాయి కావలయునని తెలియ నగును; 'ఆత్మవత్సర్వ భూతాని' యని భావింపనగును. సాటి మానవులయెడగల ప్రేమయే, కాల క్రమముగ మాధవునియెడ అనురాగముగ పరిణమించును.' ఇదియే తిరుమళిశై యాళ్వారులు గావించిన తత్త్వ బోధ.

నమ్మాళ్వారులు :-

ఈ మహనీయులు సంసారార్ది త మానవ కోటియెడ, మిగుల దయ గలవారు. జన్మతఃవీరు పరమ భాగవతులు. జన్మించినంతనే వీరు - అజ్ఞానావృతమగు ఆత్మను అభిభవించిన శఠవాయువును జయించి, 'శఠకోపులు' అను అన్వర్థాభిధానులైరి. మర్త్యుల అజ్ఞానము వీరికి బాధాకర మయ్యెను. మిథ్యాధ్యాసబంధనమునుండియు, హేయ శరీర బంధమునుండియు జనులకు విముక్తి నొసంగు మని, వీరు భగవంతుని ప్రార్థించిరి. పరిదృశ్యమాన ప్రపంచమునకును, సర్వేశ్వరునకును నడుమ - అవకాశ విషయక కాలికావరోధములు లేవనియు, సృష్టియందు దైవస్వరూపముగ నెద్ది యింద్రియగోచర

మగునో - దాని ననుసరించి మానవులు తమ జీవితములను దీర్చిదిద్దు కొనుట మేలనియు వీరి మతము.

హవ్యవాహనునియందు వీరు హయగ్రీవదేవుని దర్శించి, గాఢాలింగన మొనర్ప యత్నించిరి. ఆ దేవుని - అచ్యుతుఁడని పిలచిరి. వీరిహోత్రుఁడు తమను భాధింపఁడని భావించిరి. నవనీత మును చూచి - రసనాస్వాద్య మనియు, భోగి భోగాసనాసీనుని భోగ్య వస్తు వనియు సంభావించిరి. సర్వదర్శనమున ఆనందరస సంప్లావితులైరి. శేషశయనుని శయన మగు ఆదిశేషుఁడే - పరి దృశ్య మాన సర్పమని తలంచిరి. వేణునాద శ్రవణమున - అధరార్పిత వేణునాదలోలుఁడగు శ్రీకృష్ణపరమాత్మ్నని దివ్యనుంగళ విగ్ర హము - మహానీయులగు ఈ నమ్మాళ్వారులకు నయనపథ వర్తియై, నేత్ర పర్వ మయ్యెను. వీరి భగవద్విషయిక మోహావేశము ఒక విశిష్టత త్వ శాస్త్రము. అది - కాల నియంతయు, యోగీశ్వరుఁడు నగు పరాత్పరునే శాసించును.

ఈ యాళ్వారుల భక్తి దశ యందు - అవసాంతరము కలదు. అది విరహవేదనా దోదూయమాన నాయికా భావము. నాయకీ భావభరిత హృదంతరులగు నమ్మాళ్వారులు - సర్వేశ్వరునకు తాము అత్యంతానురాగపాత్రవిషయముగ భావించిరి. తామే జగన్నియంత యగు జగన్నాథుఁడని తలంచిరి. వామనావతారమున బలిచక్రవర్తి నుండి పాదత్రయాక్రాంత నిఖిలలోకుఁడై, నామకః దానమును గ్రహించిన అకుంఠ మహిముఁడగు వైకుంఠ కంఠీరవుఁడు తామే యని భావించిరి. శ్రీదేవి నుద్ధరించుటకై, భూగర్భము సొచ్చిన ఆది ఘోణమూర్తి తామేయని సంభావించిరి. కల్పాంతమున, ప్రళయావసరమున బ్రహ్మాండ భాండమును గ్రహించి, పునస్సృష్టి యొనరించిన ఆదిదేవుఁడు తామే యని తలపోసిరి.

వీరి భక్తిభావము - తరువాత, శృంగార రసపరిపుష్ట మయ్యెను. దూతముఖమున విరహ కవితా రీతిలో - భగవద్దర్శనము సఖిలషించుచు, దాత్యము నెఱపెను. దేహబంధము నుండి ప్రాణవాయువు విరహాయమునిచే ఆకృష్టము గాకమున్న, నాయకీ దర్శనము నాకాంక్షించిరి. విరహవేదనాచోదితమానసయైన సాత్రాజితీ రీతి, ఈ యాళ్వారులు తమకు దర్శన మీయకున్న పరాత్పర భూర్త చాతుర్యమున కాగ్రహించిరి. భగవంతునియందు వీరికి గల ప్రేమాతిశయము - భగవన్మోహావేశముగ మారెను. వీరి ప్రేమ - ఉన్మాదావస్థగ పరిణమించెను. ఒక క్షణమున వీరు - భగవద్విరహమున దూలుదురు. ఎల్ల యెడలను ఆతుర సూచనలు వీరికి భావాంబరవీథి దృగ్గోచర మగుచుండెను. కృష్ణపక్ష క్షపాకరుడు - ఆరు పది ప్రక్కలై, కాంతి దఱిగి, భగవద్విరహానల దందహ్యమానుడై, తనువలె కృశించుచున్నటుల వీరు భావించిరి. సముద్ర తరంగములు అసంభావితయు - అనాస్వాదితయు - అనాలింగితయు - విఫలీకృత ప్రేమయు నగు ప్రేయసి ననుకరించుచు, విరహోర్మి ఘూషించుచున్నటుల వీరికి తోచెను. వీరి విరహ బాధను భగవంతుడు ఉపశమింపఁజేయలేదు. భక్తి వైభవ సమన్విత మగు వీరి ప్రేమతత్త్వము ఇట్టిది. ఏవంవిధ భావగౌరవము జ్ఞానోదయమునకు పూర్వభావి. ఇట్టి భక్తిరాగముల ఆహ్లాదకరమగు సంయోగము - అస్మాదృశుల దైనందిన స్వప్న లక్ష్యము. భగవద్భక్తాత్త్వైక్యము - శఠకోపశంఖనాద ముఖ్యస్వరము.

మధురకవి యాళ్వారులు :-

శఠకోపమునీంద్రుల ప్రియాంతేవాసులే మధురకవి యాళ్వారులు. గురుశిష్యభావమే వీ రిరువురిని పెనవేసిన తాత్త్విక బంధము. మధురకవి యాళ్వారులకు గురువే దైవము. 'ఆచార్య దేవో భవ'

యని కదా వేదానుశాసనము! ఉదాత్త మగు గురు శిష్య భావము – విశాల దృక్పథముగల శ్రీవైష్ణవ సిద్ధాంతమునకు మూల స్తంభము. శ్రీవైష్ణవ మతమున గురువునకు ఉన్నత స్థాన మున్నది. మధుర కవి యాళ్వారుల ఆచార్యాన్వేషణము – తత్సమాధానముగ మధుర కవియాళ్వారులకు మార్గదర్శకమై, 'కురుగూరు' వఱకు – వీరిని నడ పించిన గురుప్రేషిత మగు దివ్యతేజము ఇందుకు తార్కాణము.

కులశేఖరాళ్వారులు :–

వీరు చేరరాజాన్వయ సంభూతులు. భాగవతోపచారమే వీరి పరమ లక్ష్యము. భక్తసేవయే భగవత్సేవ యని వీరి మతము. అంతఃపురాభరణాపహరణదోషము రాజాస్థానమునఁగల వైష్ణవ భక్తులపై మోపఁబడెను. అపు డా రాజన్యుఁడు – వైష్ణవ భక్తుల నిర్దోషిత్వమును నిరూపించుటకై, త త్కాలీన ధర్మ శాస్త్రానుసార ముగ విమర్శ మున్న కుంభమున స్వహస్తము నిడి, అక్షత గాత్రుఁడై, భాగవతులు నిరపరాధులని నిరూపించెను. ఈ సంఘ టనతో – భూపాలుని జీవితము మలుపు తిరిగెను. రాగద్వేషముల కాలవాలమును, అసూయాపూరితమునగు వాతావరణమునుండి బయ ల్పడు మార్గ మాతనికి గోచర మాయెను.

కులశేఖరుల భక్తితత్త్వము, భాగవతారాధనము మనకు మార్గ దర్శకములు – గుణ పాఠములునై వెలసినవి. ధరణి నేలుచు, దేవుని కొలుచుచు, సిరుల కాస పడక, కులశేఖరాళ్వారులు ధన్య జీవులైరి. రాజభోగములు వీరికి రుచింప వయ్యెను. రాజమకుటము ధరించుటకు వీరు ఇచ్ఛయింపరైరి. శ్రీరామపద కమలములను శిరసావహించుటకు వీరు సత్వరు లైరి. హృదయమును స్పందింపఁ జేయు జోలపాటలతో వీరు శ్రీరామచంద్రుని సంస్తుతించిరి.

కులశేఖరాళ్వారులు దశశ్లోకాత్మక రామాయణమును రచించిరి. శ్రీరామ జననము, శ్రీరాముఁడనుభవించిన కష్టములు, పట్టాభిషేకము, పరమపద గమనము కులశేఖరాళ్వారుల మనస్సునపై, చెరగని ముద్ర వైచినవి. తత్ఫలితమే దశశ్లోకాత్మక రామాయణము. కులశేఖరాళ్వారుల శ్రీరంగనాథ గుణానుభవము - రంగ భక్తులకును, రంగనాథ సాన్నిధ్యానుభవజ్ఞులకును అత్యంత సత్యనుగు అనుభవమై యున్నది. స్వాత్మ పరమాత్మలను కులశేఖరులు అవినాభావముగ, సంపూర్ణముగ మేళవించిరి. అది వీరికి అత్యంత సుఖానుభవము.

కులశేఖరాళ్వారులు కేరళనాథుని ఈ క్రింది విధముగ ప్రార్థించిరి :-

'క్రోధ పరవశ యైన తల్లిచే విడువఁబడిన శిశువు వలె, నేను నీ యండ కోరుచున్నాను. భర్తృ బాధిత యగు పతివ్రత రీతి, నీ యాశ్రయ మర్థించుచున్నాను. వర్షాగమనమునకై యట్లులు చాచు పైరువలె నీ శరణు జొచ్చితిని. నా ప్రార్థన మన్నింపకున్నను, నేను భవ ద్విరహార్తి కృశించుచున్నాను. నిన్నే కోరుచున్నాను.'

నిస్పృహా నిరాశలతో కృంగి పోయినను - స్వీయ ధీ విభవమునను, తా త్త్విక భావనా బలమునకు అట్టి ప్రార్థన గావించిరి. శ్రీవేంకటేశ్వరునియెడ కులశేఖరులకుగల భక్తి ప్రపత్తులు - వారి సిద్ధాంతమునకు మకుటాయమానములు. భగవద్గుణానుభవ స్ఫోరకములగు వారి శ్లోకములు - అసాధారణ ప్రబంధములు. శ్రీ వేంకటేశ్వర సాన్నిధ్యమున, జడ ప్రాయ మగు అచిత్సారముగ జన్మ యొసంగఁబడినచో - వీరు తమ జ్ఞానమును అనఁగా - చిద్వస్తు రూపమును త్యజింప సిద్ధ మైరి. అట్టి దశాంతర పరిణామము వారికి ఉత్కర్ష

హేతు వయ్యెను. 'హా జన్మతాసు సికతాసు మయా న లభ్యమ్' అను పూర్వాచార్య సూక్తి - ఈ సందర్భమున అనుసంధింపఁదగి నది. దేవదేవుని శేష శైలమున ఎట్టి జన్మ యొసంగఁబడినను, కృతార్థుఁ డగుదు నని భావించిరి. రాజ మర్యాదలు, ఐశ్వర్యము, కీర్తి మొదలగు వానిని, పరమ పద సనాథ సాన్నిధ్యానుభవమునకు సరి రాని పని పరిత్యజించిరి.

పెరియాళ్వారులు :-

వీరు జ్ఞాన వృద్ధులు. మహా యోగులు. వాత్సల్య భావము నాశ్రయించి, భగవంతు నారాధించి తరించిన మహానుభావులు. వీరు తమ ప్రారంభ పాశురమునందు - భగవంతుని అనేక సహస్ర వకీ యునిగ వర్ణించిరి. విష్ణు పద కమల రాగము కాల వశమున వన్నె తగ్గలే దని వీరు తలంచిరి. జగద్రక్షక రక్షకత్వము వహించిరి. భక్తి పారవశ్యమున పరిపూర్ణ హృదయులై వీరికి - జగద్రక్షక రక్షకత్వ భావ ముదయించెను. ఈ వాత్సల్య భక్తి విశేషానుభవ లక్షణము - 'రక్షకుఁడు, రక్షితుఁడు' అను భావనయే. పితృ వాత్సల్యము నొ భగవంతునకు మంగళాశాసనముగావించిన మహనీయులు వీరు.

ఆండాళ్ :-

సీతాదేవి వలెనే ఈమెయు భూ జాత. తునకు శ్రీరంగ నాథునియందు లీన మైన ధన్య చరిత. పెరియాళ్వారుల పెంపుడు బిడ్డ యగు ఈమె - వటపత్రశాయికి, అలంకరణమునకు యోగ్య మగునో - కాదో యని, పూ మాలను ముందుగా తాను పరిశీలించుట కలవడి యుండెను. తదౌచిత్య విచారము ఈమెకు వెన్నతోఁ బెట్టిన విద్య. ముందుగా పుష్పమాలను తాను ధరించి, తన యంద మును మెచ్చుకొనెడిది. ఈమె - భుక్తి ముక్తి సుమదామ పరిష్కృత

రంగరాజ దివ్యాళిక. భగవద్దర్శనమునకు నిర్మించిన వస్తు యోగ్యతల నిరూపణము సేయుటకై, ఈమె యనుసరించిన పరీక్షా పద్ధతి, తత్త్వము అసాధారణమైనవి. భూమవస్తుజాతము ఈ పరీక్షా పద్ధతిచే, దివ్యవస్తుజాత మైనది. సహృదయు లందఱును గోదాదేవి యొక్క అసాధారణ మధుర సాహసిక పరీక్షా తత్త్వ రహస్యమును కొనియాడగలరు. పరమాత్మతో కలయిక నభిలషించుచున్న జీవాత్మయే గోదాదేవి. ఈమె ధన్య చరితము మానవాళికి మార్గదర్శకము. శ్రీరంగనాథుని దివ్యదేహమును మనోహర మగు పుష్పమాలచేతను, పరమాత్మను కమనీయమగు కావ్యమాలచేతను గోదాదేవి బంధించివైచినది. ఈమెచే రచింపఁబడిన 'తిరుప్పావు' - విశిష్టాద్వైత సిద్ధాంతసార మనియు, ఉత్తమ గోప కావ్య మనియు ప్రసిద్ధి నందినది. ఆండాళ్ ప్రబంధమున, దివ్య ప్రేమ ప్రకర్ష గోచర మగును. ఈమె - దేన మానవ సంభావిత. ఈమె తమిళ కవయిత్రి యైనను, సంస్కృత విద్వాంసులీమెను 'గోదా' అని సంభావించిరి. ఉత్తమ వాగ్మి యనియు, ఉత్తమ వచోరచనా ధురీణ యనియు 'గోదా' శబ్దార్థము. కృష్ణప్రేమను ఈమె కీర్తించినది. మానవునియందును, సాధువునందును, దివ్యుల యందునుఁగల కృష్ణ ప్రేమ - ఉదాత్తమని చాటి చెప్పినది. ఆండాళ్ ప్రబంధ పఠనము - హేయభావక్షాళన మొనర్చి, బ్రహ్మానందానుభవమునకు దోహద మొసంగును.

తిరుప్పావు ఒక విశిష్ట ప్రబంధము. ఇందు ఆండాళ్ - గోపికా భావము నందినది. సఖులను తనవలె కృష్ణ విరహార్తి కుందెడి గోప నటీమణులని భావించినది. నివాసస్థల మగు శ్రీవిల్లిపుత్తూరు గోకుల మని తలంచినది. వటపత్రశాయి ఆలయము - నంద గోప నిలయ మని తలపోసినది. వటపత్ర శాయిని శ్రీ కృష్ణు డని యెంచినది. మనోహరములును - విశదావేశ భాసురములు నగు ముప్పది పాశు

రములు గల 'తిరుప్పావు' అనుసంధానమునకు పూర్వరంగ మి ట్లేర్ప రుపఁబడినది. గోపీజననాయక యగు గోదాదేవి - నెచ్చెలులతో కూడి, ముక్త కంఠముగ రాగ స్వరమేళన మొనర్చి, ప్రతిధ్వనిత మధుర సంగీత యగు, బాలరగు నట్లు పాడినది. ఇరువది తొమ్మిదవ పాశురము అత్యంత మనోహర గోదా ప్రబంధ వివర్తన కీలకము అయియున్నది. నారి మధుర భావములను, కోరికలను భగవ దున్ముఖము గావించి, సర్వదా పరమపదనాథ సేవా భాగ్యము కల్పింపుమని గోదాదేవి - శ్రీ కృష్ణుని గొప్ప వర మడిగినది. గహన వేదాంత శాస్త్ర రహస్యములు ఈ ప్రబంధమున కరతలా మలకముగ జనులకు తెలుపఁబడినవి.

తొండరడిప్పొడి యాళ్వారులు :-

వీరు విష్ణునారాయణులుగా సుప్రసిద్ధులు. శ్రీరంగనాథ భక్తాంఘ్రిరేణువు లగుటచే, వీరు - తొండరడిప్పొడి యాళ్వారులు అను పేర పిలువఁబడిరి. వీరికి స్వర్గ సుఖమునందు అభిలాష లేదు. భూతల వాసియై, తనివిదీర భగవద్గుణానుభవము గావించుటయే వీరి ఆశయము. వీరి 'తిరుమాలై' ప్రబంధము నలుబది యైదు పాశుర ములు గల్గి, శ్రీరంగనాథునియెడ భక్తిప్రపత్తులతో నిండియున్నది ఈ 'తిరుమాలై' ప్రబంధము - భక్త హృదయముల స్పందింపఁ జేయును. ప్రప్రథమమున తా నింద్రియ లోలుఁడ ననియు, ఇపుడు మోక్షకామియై, భగవంతుని శరణు జొచ్చితి ననియు వీరు వక్కాణించిరి. 'కామి గాక మోక్షకామి గాఁడు' అను నానుడి - వీరి యెడ సత్యమైనది. వీరి 'తిరుమాలై' గోప కావ్యము భగవద్భక్తి భరితమైనచో - వీరి 'తిరుప్పళ్ళి యెళుచ్చి' - శేష శాయియగు భగవంతుని మేల్కొలుపు ప్రబంధ విశేషము. ఈ 'దశ పాశురి' యందు - ఉషఃకాల వైభవమును చర్వింతుము.

పక్షిగణ కలకలారావములు నాకర్ణింతుము. కుసుమ సౌరభము నాఘ్రాణింతుము. పర్యవసానమున, జపాపుష్ప పాటల వర్ణ సదృశ దీప్తి నుల్ల సిల్లి, చిమ్మ చీకటుల భీకరద్రోలు ఉదయభానుకిరణారుణ కాంతులను పరిశీలింతుము. పితృ వాత్సల్యముతో — అరంగ నగం నాథుని, అనంతశయనమునుండి నిద్ర లేవవలసినదని ప్రబోధించుచు, వీరు — ఈ పాశుర పుష్పములను వికసింపఁజేసిరి. విశ్వామిత్ర మహర్షి శ్రీరామ చంద్రుని —

"కౌసల్యా సుప్రజా రామ! పూర్వా సంధ్యా ప్రవర్తతే
ఉత్తిష్ఠ నర శార్దూల! కర్తవ్యం దైవ మాహ్నికమ్."

అని, యోగ నిద్రనుండి ప్రబోధించు శ్రీమద్రామాయణ ఘట్టము — ఈ యాళ్వారుల ప్రబంధమునకు 'మాతృక' గానోపును. నిద్రావస్థయం దున్న మన ధీశక్తిని ప్రబోధించి, వాస్తవిక ప్రపంచమును అర్థము చేసికొని, జగన్నాథునితో విశిష్టాద్వైతము నందుటయే ఈ ప్రబంధమునందు గల తత్త్వ రహస్యము.

తిరుప్పాణాళ్వారులు :-

వీరి జీవితము — సంగీత సమన్విత సవినయ భావము, ప్రార్థనా పూర్వక దైవసాన్నిధ్యప్రాప్తి అను విశేష ద్వయ విశిష్ట మయి విరాజిల్లినది. ఈ రెండును — భావి తరములవారికి వీరందించిన గుణపాఠములు. సంగీతము ద్వారా — వీరి ఆత్మ, వీరికి అత్యంతము ప్రియతముఁడగు పరమాత్మయందు లీనమైనది. జీవాత్మ — భగవద్దివ్యోపదేశ ప్రేరితమై, పరమాత్మచే ఆచ్ఛాదిత నగుచున్నది, ఈ యాళ్వారులు దివ్యసంగీత రసికులని ప్రసిద్ధి గాంచిరి. దివ్య సంగీత సార్వభౌమునని వాసి కెక్కిరి. ఈ 'పాణాళ్వారుల'ను —

'పాణ్ పెరుమాళ్' అని, జనులు సంభావించిరి. ఈ యాళ్వారుల జీవితము వలన, మనము భగవంతుని సభక్తిక మగు సంగీతవిద్య చేతను చేరవచ్చునని గ్రహింపఁగలము.

తిరుమంగై యాళ్వారులు :-

వీరు సర్వతోముఖ ప్రజ్ఞావంతులు. అతి సమర్థులు. ఆసేతు హిమాచలము అనేక దివ్య దేశములను దర్శించిన ధన్యజీవులు. 'సీలన్' అని వీరికి నామాంతరము గలదు. ఏ రొక జమిందారు. ప్రథమమున విప్లవ వాదిగా ప్రవర్తిల్లినను, తరువాత కాలక్రమమున వీరు పరమ భక్తాగ్రగణ్యులుగా - మహా పండితులుగా పరివర్తనముఁ జెందిరి.

వీరి పాశురములు అర్చావతారమగు భగవదారాధనముపై కేంద్రీకరించిరి. వీరు తమ సాహిత్య ప్రజ్ఞను భారతదేశమునందలి అభోతరశత దివ్యదేశములలోని యెనుబదియాఱు దివ్యదేశములలో వేంచేసియున్న భగవంతుని మహిమలను అభివర్ణించుటకై వినియోగించిరి. ఆహ్లాదకరమును - హృదయంగమమును అగు కావ్య పద్ధతి ననుసరించి వీరు - తాము దర్శించిన ఆలయము లందలి దైవ మహిమలను అభివర్ణించిరి. అనిత్య మగు స్వర్గసుఖము నభిలషించు వారికి, భూతల వైకుంఠములగు దేవాలయములందలి బ్రహ్మానందానుభవము శ్రేష్ఠతరమైనదని వీరు బోధించిరి. దేవాలయ దైవదర్శనము - ఇచ్చట, ఇప్పుడు, బ్రహ్మానంద సంధాయకముగదా ! దేవతలు స్వర్గమున అనుభవించు సుఖములు - ఈ భూతలమునసే, అర్చావతార భగవదారాధనద్వారా సాధ్యములని వీరు మఱల విశదీకరించిరి. ఇంద్రియ నిగ్రహము సాధించి, తపము సేయుమని

జనులకు వీరు బోధింపలేదు. కఠోర నియమములతో, పంచాగ్ని మధ్యంబున ఏకపాదులై అరణ్యమున ఘోరతప మాచరింపుడని వీరు జనుల నుద్బోధింపలేదు. ఆలయ స్థిత మనోహర సౌమ్య కరుణామయ అర్చారూపమును ఆరాధించి, దైన విరహామును బాపుకొనుడని వీరి యుపదేశము. దైవదర్శనాకాంక్షులై, దైవానుగ్రహము కోరి, ఆలయములకు వచ్చు భక్తులతో కలసి మెలగుట మేలని వీరి యుపదేశము. మానవతా వాదులగు ఈ యాళ్వారుల తత్త్వోపదేశము మఱి యొకటి గలదు. సాహిత్య మార్గమున పయనించి, మతములు దైవమును చేరవలెనని వీరి తత్త్వోపదేశము. తమిళ వాఙ్మయ ప్రపంచమున ఈ మహనీయులు - చతుష్కవి శిఖామణులుగా విఖ్యాతి గాంచిరి. వీరి గీతములు, వృత్తములు, బంధములు, పదములు, సుసంగతములును, మధురములు నయి పాఠకులకు ప్రతిధ్వనిత ప్రబ్రహ్మానందానుభవము లగుచున్నవి.

పండితులు, పామరులు - భువనసుందరమూర్తి విశేషములగు అర్చారూపములను ఎన్నటికిని విస్మరింపఁజాలరు. వీరి ప్రబంధ పఠనము హృదయ స్పందకము. గహనాటవులలో ఉగ్రతపము మానవాళికి నిశ్శ్రేయసప్రదము కాదు. దైవమాహాత్మ్యాభివర్ణనము, వైయక్తిక - సాహిత్య మార్గ సంపాదిత భగవద్భక్తి - ఈ రెండును - ఉన్నత, ఉదాత్త వేదాంత తత్త్వములు. కాలగర్భమున నివి లీనము కాలేదు.

తిరుమంగై యాళ్వారుల తత్త్వ బోధ - మనకు శిరోధార్యము. మత వివయిక భక్తితత్త్వ బోధయందు ఈ యాళ్వారులు అగ్రగణ్యులు. వీరు మన ప్రియతమ గురు దేవులు. వీరి గురుత్వము మనకు పరమోపాదేయము.

నిగమనము

ఆళ్వారులు భగవత్ప్రేమానుభవ రసజ్ఞులు. వారి మధుర కవిత - భగవద్గుణానుభవ పరిపుష్టము. నవవిధభక్తివిశేష విష్టము. వారు భగవద్భక్తి ప్రేరితులు. వారి మతవిషయిక కవిత - దక్షిణభారతమునందలి వివిధ భాషలలోనికి అనూదితమైనది. నాలాయిర దివ్యప్రబంధమునందుఁగల తత్త్వశాస్త్ర గంభీరత, మత విషయిక భక్తితత్త్వము - భగవత్సాన్నిధ్య ప్రాప్తికి నిజమైన మార్గములు. ఆళ్వారుల కవిత యందు భగవద్భక్తి - విశేషముగ గోచరించును. నమ్మాళ్వారుల కవితలో - దివ్య ప్రేమ, భగవద్భక్తి మోహావేశములు మిక్కుటముగఁ గవ్వటును. ప్రాపంచిక బాధలను మాన్పు మనియు, పీడిత మానవాళికి జరిగిన అన్యాయమును పార ద్రోలు మనియు నమ్మాళ్వారులు భగవంతుని ప్రార్థించిరి. నమ్మాళ్వారులకు పీడితజనులయెడ కరుణ మెండు. భగవంతుఁడు అంతర్యామియు - నియంతయు - మార్గదర్శకుఁడు నగు 'శేమి' యని నమ్మాళ్వారులు నప్రభావమున జనులకు ఉద్బోధించిరి.

ఇదియే ఆళ్వారుల సిద్ధాంతము. వారు అజరామరులు, సంఘమునకు మార్గదర్శకులు.

శ్రీ విష్ణుచిత్తుల కవితా వైశిష్ట్యము

'మహాకవి - సరస్వతిపుత్ర - పద్మశ్రీ - కళాప్రపూర్ణ'

డాక్టర్ : పుట్టపర్తి నారాయణాచార్యులు

—*—

"గురు ముఖ మనధీత్య ప్రాహ వేదా నశేషాన్
నర పతి పరిక ప్తం శుల్క మాదాతు కామః
శ్వశుర మమర వన్ద్యం రంగనాథస్య సాక్షాత్
ద్విజ కుల తిలకం తం విష్ణుచిత్తం నమామి."

ప రి చ య ము

విష్ణుచిత్తులు తెలుఁగువారికి క్రొ త్త కాదు. పరమ పావనమై, కలిసంతారణమైన వారి చరిత్రమును శ్రీకృష్ణదేవరాయలు తనవి దీఱ వర్ణించి, తీర్పరాని యప్పును తెనుఁగువారి తల కెత్తిపోయెను.

విష్ణుచిత్తులకు - 'పెరియాళ్వారులు' అనియును పేరు. ఈ 'పెరియ తనము' కాలమును బట్టి వచ్చినది కాదు. వీరికి ముందే - వైష్ణవమును వెలయించి, అందె వేసిన చేతు లున్నారు.

విష్ణుచిత్తుల వైశిష్ట్యము

విష్ణుచిత్తులు తమ కవిత్వమునందు గంభీరమైన వాత్సల్య భక్తిని ప్రదర్శించుటచే ఈ బిరుద మబ్బిన దని కొంద రందురు. ఈ మాట కొంతవఱకు సత్యమే. వారి రచనలను జదివినపుడు - తక్కిన భక్తిమార్గము లన్నింటికంటెను, వాత్సల్య భావమును ఎక్కువ యాదరించి రసుట స్పష్టము. కాని, నమ్మాళ్వారులు మున్నగువారు - భక్తిమార్గములలో సరోత్కృష్టముగఁ జెప్పఁబడు నాయకీ భావమునుఁగూడ ప్రదర్శించిరి. మఱి వారి కీ పేరు రాలేదే!

పెద్దతనము

కొందఱు భగవంతునిపై అధిక స్వాతంత్ర్యమును వహించి, పరమపదనాథునకు దృష్టిదోష మంటు నని, విష్ణుచిత్తులు భగవంతునకు 'తిరు ప్పల్లాండు'నుఁ జెప్పి రనియు, ఆ స్వాతంత్ర్య మితరులకు శేకపోవుటచే వీరి కీ పెద్దతన మబ్బె ననియు జెప్పుదురు. ఈ వాదమును పై దాని యంత శ్శాఖయే గాని, వేఱు గాదు. వారి జీవితమం దింకను కొన్ని పెద్దతనము లున్నవి. గురుముఖతఃయేమియు జదువకయే పాండ్యుని యాస్థానమున వైష్ణవమును స్థాపించుట యొకటి. దానికి స్వయముగ భగవంతునిచే నియుక్తు లగుట మఱి యొకటి. ఆజన్మ బ్రహ్మచారులై, స్వయ ముద్భవ యైన తమ కూతును భగవానునకే సమర్పించుట మఱి యొకటి. ఇట్టి సన్నివేశము లింకను వారి జీవితమున నెన్ని యుండెనో! కనుక, 'పెరియాళ్వారులు' అనెడి మాట - వీని యన్నిటి సమష్టి స్వరూపమే. నిజమునకు వారి పెద్దతనము బహుముఖమైనది.

అవతారము

వీరు భగవద్రథాంశమైన వైనతేయుల యవతార మని వైష్ణవుల విశ్వాసము.[1] పరమాత్మని చర్మ చక్షువులతో దర్శించిన వారు అవతార స్వరూపులుగాక మఱేమి? అంతేగాక, 'పుర శ్శిఖులు' గూడ.[2] ఈ యాచారము 'కేరళము'నందే యుండుటచే, విష్ణుచిత్తులు చేర దేశీయులా?' యని యొక యనుమానము. చారిత్రకముగ నాఁడు 'శ్రీవిల్లి పుత్తూరు' కేరళమునకుఁ జెందియుండెడిదని కొంద ఱందురు. వీరి తండ్రి ముకుందాచార్యులు. తల్లి పద్మావతీదేవి. విష్ణుచిత్తుల సమకాలికుఁడైన పాండ్య రాజు - వల్లభ దేవుఁ డట!

---

1. మిథునే స్వాతిజం విష్ణోః రథాంశం ధన్వినః పురే.
2. విష్ణుచిత్తం పుర శ్శిఖమ్

కాల నిర్ణయము

తమిళపండితు లీ వల్లభు నాధారముగఁ గొని, పెరియాళ్వారుల కాల నిర్ణయములకుఁ బూనుకొనిరి. ఎందఱు శ్రీ వల్లభు లని! వారి ధ్యానశ్లోకమునందు - 'మిథునే స్వాతిజం' అని యున్నది గదా! దీనినిఁబట్టి, యే వేవో యూహలు. ఇది యంతయు పెద్ద గొడవ. కులశేఖరుల విషయమునను కాల నిర్ణయమున నిదియే వాదము. కనుక, ఈ నిర్ణయమును చారిత్రకులకే వదలిపెట్టి, మనము తిన్నగా జాఱు కొనుట మంచిది.

స్వామి సేవా వైంకర్యము

విష్ణుచిత్తులు వసించినది శ్రీ విల్లిపుత్తూరు[3] నందు. వారు గావించుచున్నది - మన్నారు స్వామికి మాలాకార వృత్తి. ఈ సేవ ఏరే యవలంబించినట్లు గానరాదు. సుమారా రేడు తరములుగా ఈ కుటుంబమున కీ పూర్వ పుణ్య మబ్బినట్లు వారే సెలవిచ్చినారు.[4] వీరి పూర్వులు అచ్చము మాలాకార వృత్తి గాకున్నను, యేదియో యొక సేవ మన్నారు స్వామికి చెల్లించియుండవలెను. అందుచే, ఆము భగవంతునకు ప్రాతదాసుల మనియు, వారు చేసికొన్న (నానుం ఉనక్కు- ప్పళవడియేన్) మఱి యొక విజ్ఞాపనము.

విశేషణములు - విశేషములు

పెరియాళ్వార్లు తమ రచనలలో నచ్చ టచ్చట తమకు కొన్ని విశేషణములు వేసికొన్నారు. కాని, అవి యొక్కటియు చారిత్రకముగ నుపయోగపడునవి కావు. భక్తుల కా చాపల్యమే

---

3. విల్లిపుత్తూర్ పట్టర్ పిరాన్; విల్లిపుత్తూర్ విట్టు శిత్తన్.

4. ఎన్తై తన్తై తన్తై తన్తై తమ్మూత్తప్పన్, ఏళ్ పడికాల్ తొడ్డి.
వన్దు పడివడి యా చ్చెయ్‌కిన్ఱోమ్.

యుండగుగదా ! వారు వాడుకొన్నవానిలో నొకటి – 'పట్టన్' శబ్దము. ఇది – 'భట్టన్' శబ్ద భవనమే. కొన్ని, వారు తమ బ్రాహ్మణ్యమును దెల్పుకొనుచు నుపయోగించుకొనిరి.* 'పుదువై కోన్', 'పుదువై మన్నన్' ఇత్యాది శబ్దములను తాము వాడు కొన్నది చూడగా, తమ 'కౌలీనత' యందు విష్ణుచిత్తుల కెక్కువ విశ్వాసమున్న ట్లగుపడును. ఒక చోట మాత్రము – 'పాజి తోళ్' అను నొక విశేషమును పెద్ద సొమ్మువలె వాడుకొనిరి. దీనికి – 'బలమైన భుజములు గల' అని యర్థము. బహుశః తమ విగ్రహపుష్టిం తమకే యానందము కల్గించె నేమో ! ఒక యెడ – 'విల్లి పుత్తూర్ కోన్' అనియు, వారు వేసికొన్న విశేషణము. శ్రీ విల్లి పుత్తూరునకు తాము రా జట ! ఆహా ! ఎంత బా గున్నది !! రాజ్యము లేని రాజు ! భక్తి సామ్రాజ్యమునకు రాజు !!

మఱియొక చోటఁ గనపడు 'వేయర్ పుహళ్ విట్టు శిత్తన్' అను విశేషణము పండితులను చాల కలవర పరచినది. అనేకు లీ చోట సంశయగ్రస్తులై, దాటుకొని పోదురు. నాకును ఈ యెడ సందేహము గలిగి, జ్ఞాన వయో వృద్ధులైన యొక తమిళ పండితుల నడిగితిని. వా రిచ్చిన యుత్తర మిది :–

'విష్ణుచిత్తుల తాత ముత్తాతలు పాండ్యరాజుల కడ దూతలుగ నుండిరి. 'వేయర్' అనఁగా – 'దూత' అని యర్థము.'

నా కీ వ్యాఖ్యానము యుక్తముగనే దోచినది. పూర్వపు రాజులు బ్రాహ్మణులకు రాయబారులనుగా వినియోగించుకొన్న యాచారమున్నదిగదా ! తెనుఁగు నందలి 'వేగు' – 'వేయర్' శబ్దమునకు సదృశ పదము గావచ్చును.

---

* మిన్నుసూల్ విట్టుశిత్తన్; తెన్ పుదువై పట్టన్.

సెం దమిళము

వీరు తమ రచన లందు 'సెం దమిళ్' వాడిరి. 'చెన్నైన తమిళ మేది ?' యనుటలో - యథాప్రకారము అనే కాభిప్రాయములు. ఒకనాఁడు వేంగడమునుండి కన్యాకుమారివఱకు 'సెం దమిళ్ నాఁడు.' అనగా - చేర పాండ్య చోళములయం దున్న ద్రావిడము శుద్ధ మైనది. కాని, కాలక్రమమున తక్కిన రెంటిని బోదట్టి, 'పాండ్యము' 'సెం దమిళమునకు' బిరుదు గల్పెను[6]. కనుక, విష్ణుచిత్తుల సెం దమిళము నకు ఇది యభిప్రాయ మని చెప్పుట చాల కష్టము. అందునను - 'తెన్ను'వారమైన మనకు - 'చెన్నైన తమిళ మిది' 'ఇది కాదు' అని చెప్పుట - అధికారము చాలని పని. ఇంతయును, వారి కవితయందు అనేక వ్యావహారికములు చోటు చేసికొన్నవి.

సెల్వనంబి యభిమానము

పాండ్యరాజసభలో విష్ణుచిత్తులు జైనాదుల ఖండింపఁబూని నపుడు - 'సెల్వ నంబి' వారికి చాల తోడుపడిన ట్లున్నది. ఆ యుపకారమునకు, రెండుసార్లో గాబోలు - 'పెరియాళ్వార్లు' తమ రచనలందు - 'సెల్వ నంబి' పేరు దడవిరి. ఇందు తప్ప లేదు. విద్యా రణ్యులు విద్యా నగరమునకు త మ్మాహ్వానించినపుడు వేదాంతదేశి

---

6. వడ వేంగడన్ తెన్ కుమరియాయిడైత్త మిల్ కూఱు వఱుల హత్తు.
— (తొల్ కాప్పియమ్)

7. పాండియ నిన్నాట్టుడైత్తు వల తమిళ్. (నన్నూల్' వ్యాఖ్య : 13. A D.)

8. అల్వళక్కొన్ఱు మిల్లా ఆడికోట్టియర్కోన్, అవిమానతుఙ్గన్
శెల్వనై పోల తిరుమలే;
నీర్వళ శీలన్ నయాళలన్ అవిమాన తుఙ్గనై నా డొఱుమ్
శెల్వనై శెల్వనై చ్చేవ జ్కొండు శెఙ్గణ్మాల్ తిరుక్కోట్టియూర్.

కులు రాజులను బొగడుట కిష్టము లేక, 'వైరాగ్య పంచకము'ను వ్రాసి పంపిరి. మఱి వారే, 'జింజి'కోటలో నున్న గోపణార్యుఁడు తురకలను దోలి, శ్రీ రంగనాథులను పునఃప్రతిష్ఠించినపుడు - వాని సేవను ముక్తకంఠమున బొగడిరి. గుణ మున్నపుడు దానిని హర్షింప లేకపోవుట నిజమైన పెద్దనతము కాదు గదా! 'సెల్వనంబులను' గుఱించిన మెప్పులో రెండు చోటులను విష్ణుచిత్తులు - 'అభిమాన తుంగ' శబ్దమును మఱువలేదు. సెల్వనంబులు చూపిన యభిమాన మెట్టిదో!

భగవదనుగ్రహము

పెరియాళ్వార్లు వాస్తవమునకు గొప్ప యదృష్టవంతులు. పరమాత్ముఁడు వారికి దర్శన మిచ్చుటయే గాదు - అనన్య సాధారణమైన గౌరవముఁ గూడ నొసఁగును. ఆ శ్రీరంగనాథుఁ డొసఁగిన గౌరవ మిది :-

"నెయ్యిడై నల్ల దోర్ శోఱుమ్ నియతముం అత్తాఴి చ్చేవకముమ్
కైయడై క్కాయమ్ కరుత్తుక్కు పూణూడు కాదుక్కు కుణ్ణలముమ్
మెయ్యిడ నల్ల దోర్ శాన్దముమ్ తన్దు ఎన్నై వెళ్ళు యిరాక్క వల్ల
పైయుడై నాక ప్పై క్కొడియానుక్కు ప్పల్లాణ్డు కూఱువనే."

— (తిరుప్పల్లాణ్డు : 8)

గరుడధ్వజుఁడైన ఆ రంగనాథుఁడు శ్రీవిష్ణుచిత్తులకు - గమ గమ వలచు నేయి నింపిన ప్రసాదము ననుగ్రహించెను. నియతమైన యాస్థాన సేవకత్వ మొనఁగెను. కరమున తాంబూలము పెట్టెను. కంఠమున పూమాల వేసెను. శరీరము నిండ చందనము నలఁది, 'నీవు

నా కైన వాఁడ' వని యెంతో బహూకరించినాఁ డట ! ఇం కేమి గావలెను ! మఱి – అనదృశమైన యీ గౌరవము వారి కొకనాఁటితో రాలేదు. విష్ణుచిత్తుల వేదనామయజీవిత మెంతయో యున్నది. రంగనాథుల మాలాకారవృత్తి తమకు ప్రాపించుటకై, వా రొనరించిన తపస్సు సామాన్యమైనది గాదు.

తిరుమంత్ర ద్వయ చరమములు - విష్ణుసహస్రనామము

శ్రీవైష్ణవులకు ప్రాణాతిగములైన పదార్థములు రెండు. మొదటిది అష్టాక్షరి. రామకృష్ణా ద్యవతారములను వారు భజించినను, జ్ఞానాత్మకమైన నారాయణ స్వరూపమే వారికి ప్రాణము. పరమకారుణికులైన శ్రీమద్రామానుజులు – ప్రపం చోద్ధరణార్థమై రంగనాథుల గోపుర మెక్కి పఠించిన దీ పరమ మంత్రమునే. విష్ణు చిత్తులు – తమ జీవితమున సాధించినది – ఈ మహా మంత్రమునే. నారాయణము సర్వ వ్యాపకమై, అధికారి భేదమున పరమార్థమును హోమా ద్యనుష్ఠానములచే సర్వకాలములను వేయి కామధేనువులై పితుకును. ఈ విషయమును 'ఆండాళ్' పాపము ! కంతో కిగఁ జెప్పినది.[10]

ద్వయము, శరణాగతిమంత్రమును నారాయణమునకు శంఖ చక్రములవంటివిగదా ! వైష్ణవుల రెండవ ప్రాణము – విష్ణు సహస్ర నామము. అష్టాక్షరీమంత్రముతోబాటు – 'ఆయిర నామముల' స్మరణము, పెరియాళ్వార్ల రచనలందు అడుగడుగునకు గానవచ్చును. ఆయన సృజించిన తుమ్మెదలు – పశు పక్ష్యాదులు గూడ ఆయిర

---

9. ఉనక్కు ప్పణిసెయ్య దిరుక్కుత్తవముదై యేన్.

10. నారాయణనే నమక్కే పఱై తరువాన్
పారోర్ పుగళ ప్పడిన్దే లో రెమ్బావాయ్.

నామములు' నేర్చినవే ! ఆ తుమ్మెదలు శ్రీనాథుని శంఖము లంతటి వట ! ఎంత పవిత్ర రమణీయ మైన భావము.

సుగుణములు

విష్ణుచిత్తులలో గనిపించు మఱి యొక సుగుణము 'ఫలశ్రుతుల' నధికముగఁ జెప్పకుండుట. అసలు - వైష్ణవులకు సకామోపాసనయే లేదు గదా! అందుకే, ద్వైతులు' మొదలగువా రాదరించిన వ్రతాదులను విశిష్టాద్వైతులుపేక్షించిరి. కాని, ఏ దైన నొక విషయమునుఁ జెప్పినపుడు - దానియందు మన కొక యభినివేశ మున్నపుడు - అది 'ఇంతటిది, అంతటిది' యనకున్నచో - చెప్పువారికినిగూడ తృప్తి లేదు. ఇది మానవుల యనాదియైన చాపల్యము. దీనియందు కొంత మేలే యున్నను, ఉన్న కీడు గూడ సామాన్యమైనది గాదు. అర్థ వాదములచే ప్రేరేపింపఁబడిన సాధకుఁడు - 'గంపె డాసతో' వానియందు ప్రవర్తించును. వీని కర్మ బలమై, ఆ ఫలము సిద్ధింప నపుడు అపరిణతుఁడైనవాఁడు - అనుత్సాహముచే క్రుంగిపోవును. మన మడిగిన కోర్కె లన్నింటిని తీర్చుటయే భగవంతుని పని కాదు గదా ! అట్లు తీర్పబూనినపుడు - ఈ లోకము క్షణ కాలమున స్వర్గ మో నరక మో యై పోవును. ఏ యనుష్ఠానమున కైనను ఫలము పరమ శాంతియేగాని, పార్థివ కామము కాదు. అట్టిచో - పారము లేని యర్థ వాదములు బెంచుట - అవి యెంత యర్థవాదములైనను - కొఱమాలిన పని గదా ! విష్ణుచిత్తుల రచనలందు ఈ చిక్కు తక్కువ వారు - ఇవి పఠించినచో మన పాపము పోవునని పల్కుదురు. 'పరమాత్మకు ప్రియుడ వౌదు'నని యుందురు. 'మానసిక శాంతి యబ్బు' చెప్పుదురు. 'ఎప్పుడో వైకుంఠమునందు పరమభక్తులతో పాటుందు'

వని వా కొందురు. ఒక్కొక్కసారి ఇదియను జెప్పరు. పాశుర సంఖ్యను మాత్రము ఫలికి, పైకి పోదురు. ఇది సముచిత విధానము.

విష్ణుచిత్తుల శరణాగతి గూడ - ఇతరుల వలె నీరసమైనదిగాదు. వారి శరణాగతి ధర్మ మిది :-

"ఉడుత్త క్కైన్ద నిన్ పీదకవాడై యుడుత్త క్కిళ త్తుడు
తొడుత్త తుడాయ్ మలర్ శూడిక్కైన్ద నిన్ శూడుమి త్తొణ్డర్ కళోమ్."
— (తిరుప్పల్లాండు : 9)

'మాధవా ! నీవు కట్టి విడచిన పీతాంబరమును గట్టి, నీ భుక్త శేషమును భుజించి, నీ నిర్మాల్య తులసీమాలను ధరించి, నేవ గావిం తును.'

ఆహా ! ఎంత రమణీయమైన శరణాగతి !!

పక్షపాతము

భక్తునకు జ్ఞానాంశ ఎంత ముదిరియున్నను, తా నుపాసించు మూర్తి పైన పక్షపాత ముండుట సహజము తులసీదాసు లొక సారి గోవర్ధనక్షేత్రమునకు వెళ్ళిరట ! అట వేంచేసియున్న దేవుడు మురళీధరుడు. ఆయనను జూచి, తులసి యిట్లనుచున్నాడు :- 'శ్రీయః పతే! నీ రూపము జగన్మోహకమై యున్నది. కాని, నే నేమి చేయుదును ! నీవు వేణువును ధరించితివి. ధనుర్బాణములు దాల్చని మూర్తికి ఈ నా శిరస్సు వంచి మ్రొక్కగను.' చూచితిరా యీ భావము !

సుహోరాష్ట్ర దేశమునకు మకుట మైన సమర్థరామదాసుగూడ పండరికిఁ బోయినపుడు - తులసీదాసు వలెనే, ప్రపంచ మంతయు పాపపంకిలమై నశించుచుండగా - ధనుర్బాణములు ధరించి రాక,

నడుముపై చేతులు పెట్టుకొని కులుకుచున్నావా ?' అని కోపగించు కొని రట ! అపుడు 'పాండురంగడు' దాశరథియో, ధను ర్బాణము లతో దర్శన మొసఁగె నట !

విశిష్ట విశేషము

విష్ణుచిత్తులలో ఈ ప్రవృత్తి కానరాదు. వీరియందే గాదు - సాధారణముగా వైష్ణవాళ్వారులలోనే ఈ చిత్త వృత్తి లేదు. దీని కొలికి యెక్క డున్నది ? విశిష్టాద్వైత సంప్రదాయమునఁ గలదు. వైష్ణవులకు ఇతరములైన యంశావతారములు సేవ్యములే యైనను, వా రాదరించిన మూర్తి - నారాయణము - అని ముందే విన్నవించి తిని. అటుతర్వాత వ్యూహములు. నారాయణములలో - శరణాగతి వ్యాఖ్యానాత్మకమైన రామాయణమే వారి కెత్తిన చేయి. 'తిరు ముహన్' పెరుమాళ్ళవలె కృష్ణుఁడును వారికి ప్రీతిపాత్రుఁడే యయ్యెను, భాగవతమునకు ద్వైతు లొసంగినంత విశిష్టత విశిష్టా ద్వైతు లీయలేదు. ఈ విచిత్ర మైన సంప్రదాయము ఆ భక్తులకే సర్వసమానమైన దృష్టిని గల్పించియుండు నని నా యూహ.

వాత్సల్య భావములు

విష్ణుచిత్తుల 'యశోద' - తన కొమారు నూరార్చుటకై చంద్రుని బిల్చుచు - [12] 'విత్తహన్ వేంగడవానన్' అనుచున్నది. అల్లే, మహావిష్ణువుయొక్క యవతారములను దడవుచు - 'నా వాఁడు [13] బాలకుఁ డని పరిభవించెదవు సుమా ! వీఁడే కల్పాంతమున

---

12. ధనమున కుబేరునిబోలు వేంకటాచలపతి.

13. పాలక నెన్ను వరి వవమ్ శెయ్యేల ప బ్రోడునోళ్
ఆలినిలై వశర్న శిఱుక్క నవ నివన్.

రావియాకుపై పవ్వళించెడు 'పరమమూర్తి' యని జాగ్రత్త చెప్పుచున్నది. అప్పటికిని చంద్రుడు దిగిరాలేదేమో! 'ఓరీ![14] నా యెలసింగమును నీవు లెక్క పెట్టుట లేదు. నీ పరాక్రమమును బలిచక్రవర్తి నడిగి తెలిసికొనుము' అని బెదరించుచున్నది. ఇట్లే, ఆయన - 'తిరువరంగత్తే కిడందాయ్' అనుచునే, 'అనంత శయనన్ మామణి వణ్ణన్' అని, తిరువనంతపురపు పద్మనాభులను దడవును. వారి దృష్టిలో-వీ రందఱికిని ఏకాకారము - నారాయణ స్వరూపము.

ఒకసారి కృష్ణుడు గోవులు గాచుకొనివచ్చుటకై వెళ్ళెను. 'కడియా రొప్పిడి లణి వేంగడవా' యెన యాతడు - గొడుగు, పాదరక్షలు మొదలైన పరికరములు తీసికొనిపోలే దట! ఆ యపాయమును దలఁచుకొని, మాతృహృదయము పులకెత్తిన యశోద - ఇట్లు వాపోవుచున్నది :-

"కడియార్ పొడింజి వేఱ్ఱడవా! కరుమ్ పోకేతే! నీ యుకక్కుమ్
కుడైయుమ్ శెరుప్పుమ్ కరలుమ్ తరువిక్క కొక్కాడే పోనాయే మాలే
కడియ వెఱ్ఱానిడై కట్టిన్ పిన్ పోన శిఱుక్కట్ట చెఱ్ఱమల
అడియుమ్ వెదుమ్బి ఉన్ కణ్ణిఱ్ శివన్దాయ్ అశైన్దిట్టాయ్ నీ యెమ్బిరాన్."

— (పెరియాళ్వార్ తిరుమొళి)

'తావితోటలో గల వేంకటాచలమున వసించు స్వామీ! గొడుగును మఱచితివి. పాదరక్షలను గైకొనకపోతివి. పిల్లన గ్రోవిని గూడ వదలిపెట్టి పోయితివి. బాగుగ నెదిగి నడచుటకే కష్టమైన యడవులలో పశువులను తోలుకొనిపోయితివి. ఎంతగా నలసితివో నా దేవా!'

---

14. శిఱియ నెన్దైన్నిళఙ్గుఱైయిల్ యిరుళ్ కణ్డాయ్
శిఱు మెయిన్ వాఱ్ఱై యెమ్ మావరి యిడై చెన్రుకేళ్.

ఇప్పటి కృష్ణుని వయస్సు - పది పదునాలు గేండ్లు. ఆయనను బట్టుకొని ఆమె - 'సీతై మణాళా !' [15] అని సంబోధించినపుడును, 'తిరువుడైయాళ్ మణవాళా' అన్నపుడును మన కెంతయో వింతగా నుండును. కాని, వారి దృష్టి యది.

అవతార భేదమును - ప్రతీక భేదమును లేనట్లే, పెరియా ళ్వార్ల దృష్టిలో - వయో భేదము కూడ నున్నట్లు తోచదు. యశోద - చిన్న కృష్ణుని తలలో పూలు తురుముటకై పిలుచు చున్నది. ఆమె - 'శంపక పూచూచ్చట వారాయ్' అని యారంభించెను. రెండు మూడు చరణములు గడుచువేళకు యశోద - తనను, యెదిరిని మఱచిపోయినది. యశోద యనఁగా - విష్ణుచిత్తు లన్న మాట ! అట్లు ఒడలు మఱచిన యామె - 'కంచనై క్కాల్ కొడు పాయాద వాయ్' అనుచు, కృష్ణుని ముందు తానే కంసుని జంపివేసినది. ఈ నడుమనే - 'సీళ్ తిరువేంగడత్తు యెందాయ్ !' అన్న మాటగూడ చోటు జేసికొన్నది. అప్పటికే ఆ కృష్ణుఁడు కామశాస్త్రమున కాలు భాగము తిరుగవేసినట్లున్నది. ఆయన చిన్న చిన్న శృంగారములు - యశోదమ్మ 'నోటీను' వఱకు పెచ్చినవి. [16] ఇట్టి చోటులందు మనకు - 'యః కల్ప స్య కల్ప పూర్వ్యః' అను వాక్య మొక్కటియే శరణ్యము. ఇట్లు సరిపెట్టుకొనుట - భక్తులైన యందరి రచనలందును కలదు. తులసీదాసుల కిది మఱింత హెచ్చు.

భాషా సౌందర్యము

విష్ణుచిత్తుల భాష - చాల సుందర మైనది. ఆయన పదములు నొక్కొక్క సారి యవిసిపూవులవలె రాల్చును. చిలుకల గుంపుల

15. సీతై మణాళా : సీరుకుట్టచ్చెంగమాలే.

16. తెరువున్ కణ్ణిన్రు ఇళ వాయ్చి కూర్కుశై తీమై సెయ్యాదే :

వలె పైకి లేపును. ఈ పరిణామము - ఒక వీరియందే గాదు. కృష్ణ స్వరూపమును ప్రేమించిన అందఱి భక్తులయందును, అన్ని భాషల యందును గన్పించును. హిందీలో - మీరా, సూరదాసు, రసఖాను రచనలు శబ్దాలంకార భూయిష్టములు. మహారాష్ట్రమునందు - జ్ఞానేశ్వర, జ్ఞానదేవాదులలో ఈ గుణ మున్నది. సంస్కృతమున, లీలా శుక - జయదేవాదుల శబ్దభంగిమలు పండితుల కనుభూతములైనవే. అగ్ని పర్వతమునంటి వ్యాసులు గూడ, ఆ కృష్ణుని వర్ణించు పట్టులం దేమో వింత వగలు పోదురు. అట్లే, రామోపాసకుల రచనలు తేటయై, గంభీరమై యుండును. ఈ విషయ మాలోచించినపుడు - 'ఆ యుపాసకులకు కాలక్రమమున ఆ యా మూర్తులలోని కొన్ని గుణములు సంక్రమించునా?' అని నాకుఁ దోచును. ఇది చాల సారులు నే ననుభవించిన భావము.

అలంకారములు

"తిరునెడు తడై మడై ముహి ల్వణన్."

కృష్ణుఁడు నల్లనివాఁ డనుటకు - 'ముహి ల్వణన్' చాలును. 'మడై ముహిల్వణన్' అనియుఁ జెప్పవచ్చును. ఇక తక్కిన వన్నియు శబ్దక్రీడకై యరుగుదెంచినవే. ఇట్టిదే మఱి యొక పట్టు :-

"కులమలై కోలమలై కుర్ మామలై కాతమలై
నిలమలై నీణమలై తిరుమాలిరుమ్ శోలై యదే."

ఇక్కడ గల చిత్రము - 'మలై' శబ్దమును పునఃపునరావర్తించుట. దీనితో - అరమునకు కొంత మెఱుఁగు తగ్గినది. ఈ శైలిలో - నాచన సోమని వచనములందువలె, వారి యుద్రేకము గానుపింపవచ్చును. కాని, 'లీలమైన యుద్రేకము కళకు ఆవశ్యకమా

యనుటయే' యొక ప్రశ్న. ఇట్టి ఘట్టములు వీరిలో అచ్చు టచ్చట గన్పట్టును. ఈ శబ్దచిత్రముపై దృష్టి యున్న దిగనుకనే ఒకసారి శబ్దము నకై యర్థమును కిష్ట మొనరించెడు పట్టులును గనుపట్టును.

"మూన్దెడు త్తవనై మూన్దెడు త్తదనాల్ మూన్దెడుత్తాక్కి మూన్దెడు తై
ఏన్దుకొణ్డిడుప్పాల్ కిఱక్కుమ్ నన్ కుడైయ వెమ్బురుడో త్త మనిరక్కై
మూన్దడి నిమిర్తు మూన్దినిత్తోన్ది మూన్దువిల్ మూన్దురువాసన్
కాన్దడమ్ పొడిల్ జైయిన్ కరై మే అక్కడి మెన్నుమ్ కడినకరే."

పై పాశురములో - 'మూన్' శబ్దముపై వారి దృష్టి యంతయు లగ్న మగుటచే, అర్థము సమన్యగా తయారైనది. శబ్ద చిత్రమునకుఁ జెందిన శ్లేషయు - విష్ణుచిత్తులలో అచ్చు టచ్చట సాక్షాత్కరించును. శ్రీకృష్ణుఁడు ఒక గోపిక నెలయించుకొని పోయె వట ! అది - 'పేతై.' అనఁగా - పదునా లేండ్ల సుమారు వయసు గలది. ఆ గోపిక తల్లి - ఈ వృత్తాంతమును తెలిసి పనవిన ఘట్ట మిది :-

"ఆడియా నెన్ను మాడ మోడై యిల్ పాయ్చ్చియ కప్పిడు త్త
మూడై యుప్పరియా తెన్ను మూతురై యు మిలశే."

ఇక్కడి 'అడియాన్' అన్న శబ్దము శిష్టము. దానికి - చక్రపాణియు, సముద్ర మనియు రెండర్థములు. 'చక్రధారి యను సుడి యందుఁ జిక్కుకొన్న' దని ఒక యర్థము. 'సముద్రము యొక్క సుడియం' దని వే ఱొక యర్థము.

తమిళమునం దిట్టి చిత్రము లెన్నైనను జేయవచ్చును. ఈ గుణములలో - సంస్కృతముతో పోటీ వేసికొని నిల్వ గల్గినది ఒక్క ద్రావిడమేనా ! అనిపించును.

తెన్నాలి రాముఁడు పాండురంగ మాహాత్మ్యమున -

"ఏ
కోలంబో జనియించు వేఁటనకు వీడ్కొ- లాభమో తండ్రి దు
శ్శీలాగారము వార యోవతమ నిస్సీ మేఱ వాటించునే !"

అని ప్రయోగించెను. దీనిపై కొంద రాంధ్ర పండితులు - ఇటీవల తెనుఁగు పత్రికలలో తర్జన భర్జనలు రేపి, యెవరికి వారు జాఱు కొన్నారు. సమకాలికుఁడైన రాయలు ప్రయోగించిన 'నీలికోల' మను ప్రయోగమైనను వారు చూడరు. కొందఱు తెన్నాలి రాముని పాఠమునే దిద్ది, వ్యాఖ్యానించిరి. ఈ క్రింది ప్రయోగమును చిత్తగిం పుడు :-

"అతి తృణి క్కోల మాణాన్, ఆడియ వర్కొ-
చ్చోతి తిరు తూణిల్ తోన్రి నాల్
వేత తిన్ మున్నినాన్, వేద ముదలే !
యెనవ కైవ ఎన్నైన నాన్ యేన్న ట్కింరై."
— (నల చరిత్ర : పుకళేంది వ్పులవర్)

ఇట - 'కోల' శబ్దమును వరాహ మనియు, వేఁట మనియు సము ర్థముగా కవి చమత్కరించెను. ఇది విషయాంతరము.

శబ్దాలంకార మెట్లొక వైచిత్రియో - అట్లే, రమణీయాలం కారమును కావ్యమున కొక విచ్ఛిత్తి విశేషమే. జీవితము మాత్రము కాదు. కావ్య జీవితము - రసమో, వ్యంగ్యమో యగును. ఈ దృష్టితో 'విష్ణు చిత్తులు' రసవాది. వారి రచనలలోని రసము - 'రూపగోస్వామి' వంటివా రన్నట్లు, 'భక్తి' - లేక 'శాంతము.'

అలంకారము విచ్చిత్తి యంటివి. వాని యందును నూత్న నూత్నములైన యర్థములను దెల్పు టొక దక్షతయేగదా ! మన ప్రబంధ కవులు పరస్పరము పందెములు వేసికొన్న దిందులోనే. పెరి యాళ్వార్ల యలంకార మిది :-

"తుడర్ శఙ్గిలకై కలార్ పిలా రెన్న త్తూఙ్గు పొన్మణి యెలిప్ప
పడు ముమ్మతప్పనల్ శోర వారణమ్ పైదు నిన్దూర్వదు పోల్
ఉడన్ కూడి క్కిణిజి యాశవారిప్ప పుడై మణి పజై కలుఙ్గ
తడనాజై కొండు శార్ఙపాణి తార్ నడై నడవానో !"

బంధించిన సంకెల - గల గల మని శబ్దింపగా వంగిన ఘంటలు ఘల్లు ఘల్లు మన, దేహమున మదజలము కారగా, కర కలభము నించి యూగుట వలె కింకిణు లెలుగింప, మణులు ధమరులై మ్రోయ, విశాలములైన చరణములతో శార్ఙపాణి మందగమన ముతో నెప్పుడు నా యెడకు నడచునో !

ఇట్టిదే -

"శక్కరిడై నునిక్కుమ్బిల్ రోన్దుమ్ శిఱుపిడై ముళైప్పోల్
నక్కుశెన్దువర్ వాయ్ తిఱన్ మీదే నీర్ పణ్ వళ్ ముళై యిలక
అక్కువడ ముడుత్తామై శాలి పూఙ వనన్ద శయనన్
తక్కమామణివణ్ణన్ వాసుదేవన్ తార్ నడై నడవానో !"

రక్తాకాశముయెక్క అగ్రభాగమున వెలుగుచున్న బాల చంద్ర ముకుళమువలె శ్రీకృష్ణుడు నవ్వినవుడు, చెన్నైన యెఱని పెదవులపైని లేల్లని పలు మొగ్గల వరుస ప్రకాశించినదట ! శంఖ మణిహారమును ధరించి, కూర్మ పదములతో వెలుగొందు నసంతశయ నులు - నా యెదుటి కెప్పుడు వచ్చునో !' పై యలంకారములు ప్రయత్న పూర్వకముగా గల్పించినవి. ఇట్టివే గాక, సహజములై,

పరితలను నొప్పింపక, తాము 'నొవ్వక' యండు ఉపమ కూపకాదులును వాని యం దడుగడుగునను ప్రత్యక్ష మగును.

"సెంగమల మలర్ శూడ్ వండినం బోల్
చుర్రంబి రుంట కురల్ తాళ్ళ ముక్తాన్."

కమలమును జుట్టుకొన్న భ్రమరములవలె ముఖముపై బడిన వక్రములైన భ్రమరములు గలవాఁడు."

"వంద మద లై కుడాత్తై వలి సెయ్దు
తంద క్కళిర్ బోల్ తానే విళయాడుమ్."

ఆడుకొనవచ్చిన పిల్లల గుంపు నెల్లను జయించివేసి, మదించిన కలభములవలె తామే వేఱై యాడుకొందురు."

కాని, ఈ గుణ మెంత యున్నను, వారి కవితాత్మమాత్ర మిది కాదు.

భావ స్వాతంత్ర్యము

వీరిలో - భావ స్వాతంత్ర్యమును యెక్కువ. నిజమునకు 'భావ స్వాతంత్ర్యము'నకు పరిధిని నిర్ణయించుట కష్టము. ఒకనికి నూత్నముగ నున్న భావము - మఱి యొకనిది ప్రాతది. కారణ మేమనఁగా - అందఱు నన్నింటిని జదివియుండరుగదా! కాని, సంప్రదాయమే నూత్నముగను, ఇప్పుడు మాత్ర మది క్రొత్త భావముగను తోచి తీరును.

తమిళ సాహిత్యమున 'స్త్రీల జఘనము'ను - నాగము యెక్కఁ బడగకు బోల్తురు. ఈ భావము 'శిలప్పధికారమున' నున్నది. 'సంగ' సాహిత్యమునం దిది సర్వ సామాన్యము. కాని, మనకు క్రొత్తది.

ఇల్లో, సుబ్రహ్మణ్యుని వేలాయుధము కన్నకి రెండు కన్నులయ్యే నని 'శిలప్పధికార' మనను. తమిళములో - 'మురుకన్' - రూపమున కధి దేవత. 'సంధ్య' నొక రాజుగా - 'శిలప్పధికారము' వర్ణించును. ఇవి యన్నియు మనకు నూత్నములు. కారణ మే మనఁగా - మన సంప్రదాయమే మాఱిపోయినది. మళఁగుశేరిమున - 'చింతా విశిష్టయా సీత' అనునది ఒక చక్కని కావ్యము. కుశలవులు వాల్మీకి వెంట రాముని యజ్ఞమునకు బయలుదేర వెళ్ళినారు. వాల్మీకుల యాశ్రమమున ఏకాంతమున సీత - గడచిన గాథ నంతయు పసవు చున్నది. అవు డామె యెడమ భుజము శుభసూచకముగా పురుగు తొలిచినట్లు కంపించిన దట! నా కీ యుపమానము విచిత్రముగ నున్నది. మన కిది నీచోపమ. వారికిఁ గాదు. ఉచ్చ నీచములు మనోధర్ములేగదా! ఈ తర్కమునకు కొంత స్వస్తి జెప్పి, రమణీయములైన విష్ణుచిత్తుల భావములను గ్రహింతముగాక!

శృంగారము

ఒక గోపిక. దానికి సరిగా మాటలుకూడ రావట! ఆమె కృష్ణునిపై మరులు గొన్నది. అవు డా గోపిక తల్లి - తన తనయ దుస్థితిని నలుగురితోఁ జెప్పుకొనుచున్నది :-

"పేచవుం తెరియాత పిణ్ణైయిన్ "పేత్తై" యెన్ పేత్తైయివళ్
కూచ మిన్నిని ఱార్కుళ్ తమ్మిదిర్ కోల్కళింతాన్ మూళైయాయ్
కేశవ నెన్రుం కేటలీ యెన్నుం కింకుకవాయ్ మొడియాళ్
వానవా ఱ్కుడల్ మంగై మీర్! ఇవళ్ మాలుఱు కిన్ఱాళ్."

చక్కని వాసనతోఁ గూడిన కురులుగల పడఁతులారా! ఈ బిడ్డ - కృష్ణునిపై మరులు గొన్నది. దానికి సరిగ మాటలు కూడ

రావు. అమాయకురాలు. కాని, నే నేమి నేతును ! ఈ కృష్ణుని విషయమున దాని సిగ్గంతయు - కొయ్యగరిశెకు కోల దీసివేసిన-చో లో నున్న పదార్థ మంతయు రంధ్రమునుండి జాఱిపోవునట్లు జాఱి పోయినది.

"సెయతలై యెడు నాట్టు పోల్ అవన్ సెయ్వన సెయ్తు కొళ్ళ
మైత్తట ముకిల్వణ్ణన్ పక్కల్ వళర నిడు మిన్నళే."

కృష్ణుని విరహములో ఈ వనిత కళావిహీన యైనది. నాటుకు సిద్ధమై, యెఱ్ఱబాఱిన తలలోనున్న మొలకవలె నున్నది. దీనిని గైకొనిపోయి, కృష్ణుని ప్రక్క నాటినచో - అప్పుడు పసిమికిఁ దిరుగును."

ఇట్టి భావములు తెనుఁగువారికి క్రొత్తవై నవి. విష్ణుచిత్తులలో కొల్లలు.

ముక్తకములు

పెరియాళ్వార్ల రచన మొక కావ్యము కాదు. పది పడ నైదు వృత్తములు నేరి, ఒక యర్థమును, ఒక ఘట్టమును తెలుపును. వాని యనంతర మొక ఫలశ్రుతి. ఈ రచనల నొక రీతిగా 'ముక్తకము' లన వచ్చును. కొన్ని సంభాషణాత్మకములైన రచనలును అక్కడక్కడ నున్నవి. 'కృష్ణ - యశోదల సంభాషణము', యశోదమ్మకు గోపికలు దూఱులు సెప్పట మొదలైనవి. 'ఆరాధ అంతాది'యు నొకటి ప్రవాసిరి. అనఁగా - తొలటి వృత్తమునందు చివర జెప్పి విడచిన ఒక పదమును ఆదిలో నుంచి - 'మలుపటి' పద్యమును బలుకుట. ఇది మన ముక్తపదగ్రస్తమే. ఈ సందర్భమున, కేశవాది నామములను జోడించుటయు - వారు సూపిన మనోజ్ఞమగు మఱి యొక దక్షత.

వర్ణన విశేషములు

వారు తమ దైవమును చిత్ర విచిత్రముగ చిలతురు. శ్రీ రామ కృష్ణు లన్నట్లు, భగవంతుఁ డన్నంతనే శరీరమును మఱచు చిత్త వృత్తి యగుటచే, వా రూహింపకయే క్రొత్త విశేషణములు విష్ణు చిత్తులకు దోచును. 'ఇరాక్కడర్ వాళ్ ఇలంగై, పాడా భాహప్పడై ప్పొరుదానుక్కు'[17] అని, ఒకపరి గంభీర దీర ముగ నూహింతురు. 'అంతియం పోది లరియురు వాకి యరియో యళి తవనై'[18] అని భయంకర రూపమును చిత్రింతురు. 'కొత్తత్త వైవన్ నుడి కెడ త్రొనియ అత్తన్'[19] అని, రావణుని పది తలలను రాముని యొక బాణ ముతోనే కూలవేయింతురు. 'తేనె లినియ పిరానే!' అని మనోహర ముగా బిల్తురు. 'ఎన్నుయిర్ కావలనే యెన్న ప్పా!' అని కన్నీరు వెట్టుకొందురు. ఇట్టి వెన్నియో! వారే యన్నట్లు,[20] 'గట్టు తెగ గొట్టుకొని పాఱు సౌందర్య లహరిపై మరల గురియునట్లు' మనోహర విశేషణములను పై పైని గురియుదురు.

పుణ్య భూమి

ఆర్యావర్తము పుణ్య భూమియే. దాని నెవరును కా దనరు. కాని, దక్షిణముగూడ దానికిఁ దీసి పోలేదు. భారతమున పుణ్య క్షేత్రము గాని దేది? భారతమే గాదు - ఏ ప్రదేశమైనను మన మనస్సును బట్టి మాఱుచుండును. కాని, చాల కాలము నుండియు

17. రాక్షసులు వసింను లంక పాడగునట్లు నైన్యములు నడపినవానికి.

18. సంధ్య యందు నృసింహావతార మెత్తి, శత్రువును జంపినవానికి.

19. తలల గుత్తి గల రావణుని లంకలో జొఱబడినవాఁడు.

20. ఇంబెళ్కత్తిన్ మేల్ పిన్నెయ్యుం పెయ్గు పెయ్దు.

ఆర్యావర్తమే పుణ్యక్షేత్ర మనియు - ఆర్యులే సర్వోత్కృష్టు లనియు నొక భావము మనలో పాదుకొని పోయినది. ద్రావిడ నాగరికత, సంస్కృతి - ఆర్య సంస్కృతివలెనే - ప్రాచీనము, ఉదారము అను నూహ ఈ నాఁటికిని మనకుఁ గలుగలేదు.

కన్నడమున వీరశైవ కాలమందును, మహారాష్ట్రమున వైష్ణవ భక్తుల కాలమునను 'దక్షిణావర్తమును పుణ్య భూమియే' యను వాదము మొలకెత్తినది. తమిళమున నంతకు మున్నే యున్నది. విష్ణుచిత్తులకు ఆర్యావర్తమున ద్వేషము లేదు.[21] వారి కెవ్వరితోను విరోధము లేదు. భక్తి సాధన - రాజకీయముల వంటిది కాదు గదా! అందుకే వారి కృష్ణుఁడు - ఉత్తరము వలెనే దక్షిణమునను తిరుగును. 'వేంగడమున[22]' వసించును. కుంభకోణమున[23] శయనించును. శ్రీరంగమున వెలయును. కృష్ణుఁడు పుట్టుక జరిగినది - తిరుక్కోట్టియూరునందట! విష్ణుచిత్తుల యశోద - ఇట్లు పనవుచున్నది :-

"కొంగుం కుడై యందయుమ్ కోట్టి యూరుం పేరుమ్
యెంగుం తిరందు విళైయాడుం యన్మగన్."

ఇన్ని క్షేత్రములను దడవిన పెరియాళ్వార్లు - నరసింహావతారమును పలు మారులు ప్రశంసించినను, అహోబలక్షేత్రమును ఎందువలన స్పృశింపలేదో!

---

21. పట తిళై శాలక్కి రామం వై హొందం తువరై యియోత్తి
ఇట ముడైవ కరియవరై యుడైయ యన్బురుషోత్తమ విరక్కై.

22. కడియా ర్కొడి లణి వేంగడవా!

23. కుడం దై క్కిడన్ దానే.

భక్త్యావేశము

వారి రచనలను జదివినపుడు - విష్ణుచిత్తులు ఎంత యుద్రిక్త హృదయులుగా దోతురు ! కాని, వారి యావేశము భగవత్ప్రేమగుటచే, ఆత్మికమై, పవిత్రమైపోయినది. తిరుక్కోట్టియూరున కృష్ణజన్మ మైన దఁట ! అపు డా సంతోషమున నొడలు మఱచిన గోపికలు ఎట్లు ప్రవర్తించుచున్నారో చూడుడు :-

"ఓడువార్ విడువార్ ఉహంద లిప్పార్
నాడువార్ నంపిరాన్ ఎంగుట్రా నెన్పార్
పాడు నార్పళం పల్వారై కొట్టు నిన్రు
ఆడువార్పళం ఆయిట్రు ఆయ్ ప్పాడియే."

అపుడు గోపకు లందఱు పరుగిడువారు, పరుగెత్తుచు - పడెడు వారు, సంతోషమున వెదకువారు, డోళ్ళు కొట్టి కొట్టి, సంతోషమున నర్తించువారు."

"పేణి చ్చీరు పై ప్పిశ్చై పిరంతనిల్
కాణ త్తాం వుకువార్ వుక్కు పోదువార్
ఆణోతాప్పార్ ఇవన్ నే రిల్లై
గాణ్ తిరువోణత్తాన్ ఉలకాళు మెర్పొర్పశే."

భాగ్యశాలియైన కృష్ణుని వలచి, చూచుటకై వచ్చువారు, చూచి పోవువారు, వీని సమాన మెవ్వరును లేరు. తిరువోణమున జన్మించినవాఁడు వీఁడే. వీఁడు నిశ్చయముగా భూమి నేలు ననువారు."

"ఉరియై ముట్ట త్తు ఉరుట్టి నిన్నాడువార్
నరునెయ్ పాల్ తయిర్ నన్నాక త్తూవునార్
పెరిమెన్ కూన్దల్ ఆవిళ తిశైతి యెంగుం
ఆఱి వళ్ందవర్ ఆయ్ పాడి యాయిరే."

ఇండ్ల ముంగిళ్ళలో ఉట్లు దొర్లించి, నిలిచి యాడువారు, పాలు, పెరుగు, మజ్జిగ, నేయి మొదలైనవి సంతోషమున దొర్లించువారు, నిడుదలైన కురులు ప్రవేలాడ, ఒడలు తెలియనివారు."

ఇంతటి యావేశము - 'వక్తవ్య మేవ వక్తవ్యమ్' అన్న పదతియు నున్నది గనుకనే, ఒకసారి మన మనోచిత్య మనుకొను[24] పరిధులను గూడ వారు స్పృశింతురు.

దాస్య భక్తి

విష్ణుచిత్తులు వాత్సల్య మధుర భావములను పుష్కలముగ్ జెప్పినను, మూలాధారమైన దాస్యభక్తిని మాత్రము మఱచిపోలేదు. ఎవరే మన్నను, సఖ్య వాత్సల్యాది భావములు దాస్య భక్తి యను మహా సముద్రముపైని వచ్చుచు బోవుచుండు అలలు మాత్రమే.

వారు స్వభావతః అమాయకులు. ఆ చిత్తవృత్తి - యెవరేది జెప్పినను నమ్మునది.[25] వారికి ప్రాక్తన సంస్కార బలమున, అష్టాక్షరీ మహామంత్రము లభించినది. అది సర్వోత్కృష్టమను విశ్వాసమును వేఱులు బాదుకొన్నది.[26] వారి భక్తి సాధన - త్యాగరాజాదులవలె మానసికమై, ఆత్మార్పణాత్మకమైనదేగాని, కాలద్రవ్యాపేక్ష గల తాంత్రికము కాదు. భక్తి[27] యనెడు కోవెల గట్టి, మాధవుడనెడు దైవమును ప్రతిష్ఠించి, ఆశ యను పూలచే పూజించిన మహా

---

24. తిహ ళ్ళు యెంగుం వుడైయుర
పెరు పేర్ తిరు యెళు గంగయిఱుం పెరియదోర్ తీర్థ ఫలమ్
25. వన్నై తీమై కణ్ణు మరియేన్.
26. మూల మాకి యగి యత్తై మూన్ను మా త్తిరై ఉళ్ళె వాంగి
వేఱై వణ్ణనై మేవు తిరాకిల్ విణ్ణ కత్తవిల్ మేవఱా మాపే.
27. మూవ్వ మెన్పతోర్ కోలాల మైత్తు
మూతవ నెన్నుడై నిత్తై నాట్టి
ఆర్వ మెన్ప తోల్ పూలిట వల్లార్కు

యదృష్టశాలి యాయన. 'కూరై శోరివై వేండువ దిల్లై' యని భగవంతునికోసమే ప్రేమించిన నిష్కామభక్తి వారిది. ఇంత నిష్కామమైనను, వారి భక్తి - మన మనుకొనునంత సులభముగ, భగవంతుడు స్వీకరింపలేదు. విష్ణుచిత్తుల భగవద్ధ్యేదన, సాధన - కొన్ని సంవత్సరములపాటైన నుండి యుండును.

ప్రేమ భక్తి

సూక్ష్మముగ గమనించినచో - విష్ణుచిత్తుల దాస్యభక్తిలో కొన్ని పరిణామ భేదములను మనము గమనింపవచ్చును. మూలాకార వృత్తిలో వైధముగ నారంభమైన వారి సాధన - పోను పోను, ప్రేమ భక్తిగ మారిపోయినది. కడకు, ఏ రందుకొన్న స్థితి యిది :-

"వాక్కు త్తూయ్ మెయిలా మైయినాలే మతవా ! ఉన్నైవాయ్ కొట్ట మాట్టేన్
నాక్కు నిన్నై యల్లాందియాతు, నాన తఞ్చవన్ ఎన్ వశ మిరు
మూర్కు పేచు కిరానిన నెన్ను మునివా యేలుం యెన్ నావిను క్కరైన్
కాక్కై వాయిలుం కట్టురై కొళ్గర్ కారణా ! కరుళ క్కడియానే."

దేవా ! నా వాక్కు అశుద్ధమైనది. అందుచే, నీ నామమును దలచు యోగ్యత నాకు లేదు. కాని, నా నాల్క నా వశమున లేదు. నే నేమి సేతును ! ఈ మూర్ఖుడు నా నామ మెందుకు జపించుచున్నాడని కోపగింతు వేమో ! నా భయమదే ! వల్లనైన కాకిని జూచినను, నీ వని భ్రమింతును. గరుడధ్వజా ! నారాయణా !"

"వెళ్ళై వెళ్ళత్తిన్ శేరుం పాంబై మెత్తై యాకవిరుత్తు ఆనేత్మలే
కళ్ళ నిత్తిరై రొళ్కిన మార్గం కాణ లాజొలై నాపైయినాలే
ఉళ్ళుళ్ళోర ఉకంతె తిరివిమ్మి ఉరోమ కూపంగళామ్ కణనీర్ట్ట్
తుళ్ళం చోరతు యిలజై కొళ్నేన్ చొల్లాయ్ యానునై న్ను త్తిరుమాలే."

ఇది - భక్తిభావముయొక్క పరాకాష్ఠ. ఈ సందర్భముననే వారిట్లనుచున్నారు :-

'రంగనాథా ! స్వచ్ఛమైన పాలసముద్రమే పడకయై, కల్ల నిదుర గొను నీ బాలకమును జూత మనకు ఆశచే, నా మనసు కరగును. అదే ధ్యానమై పోవును. పులకల పరపుగ లేచును. కన్నీటిబొట్లు ధార గట్టును. కంటికి తూగు లేదు స్వామీ ! దయచేసి, నిను జూచు మార్గ మేమియో తెల్పుమా.'

ఈ భావము హృదయ ద్రావకమైనది. దాస్యభక్తిని వెల్వరించిన ఒక్కొక్క పాశురము - ఒక్కొక్క రత్నము.

మానవునకు వచ్చు మృత్యువు - విష్ణుచిత్తులకు భయంకరముగ దోచినది. కనుకనే, మృత్యు తాండవమును వారు బీభత్సముగ వర్ణించిరి.

"కొల్లలాం పోలే ఉన్ నామ మెల్లామ్ కొల్లినేన్."

'నారాయణా ! పలుకఁ దగిన నీ నామము లన్నియుఁ బల్కితిని. నీవు రాక పోతివి. ఇఁక నా కేమి గతి ? యమదూతలు వచ్చి, నన్ను బలియ్రదొక్కునపుడు నేను నిన్నెట్లు దలఁతును ? '

"ఆప్పోతై కిప్పోతే కొల్లి వైత్తాన్."

'అందుకే - ఇప్పుడే చెప్పుకొనుచున్నాను.'

ఇట్లు అనేక సారులు - ఆ రంగశాయి కడ మనవి చేసిరి.

"నిన్ను మినెన్ను మపాయ మిల్లై."

'నీవు దప్ప, వేరుపాయము లేదు' అని భయపడిరి.

'ఇని ప్పోగ విడువ డులదే.'

'కనుగొన్నానులే ! ఇంక నిన్ను విడుతునా ?' అని, ఒకసారి ధైర్యము దెచ్చుకొనిరి.

"వలైత్తు వైత్తాన్."

'భక్తి యను వలతో నిన్ను బంధించితిని' అని, సంతసించిరి.

"తిన్నై కొండెన్నై వైత్తాన్
యునై్నయు మున్ని లిట్టేన్."

'నన్ను శరణాగతుండుగ జేసి వైచితిని. నీ దివ్య రూపమును నా యందు ప్రతిష్ఠించు కొంటిని.'

అనెడు ఆత్మార్పణ రూప మైన శరణాగతి — అనుభవమునకు వచ్చులోపల, విష్ణు చిత్తు లనుభవించిన భావభేదము లెన్నో ! ఇన్ని కష్టములు బడి, ఆ భగవ ద్దర్శనము లభించినపుడు — 'ఏక స్వాదు న భుంజీత' అనునట్లు —

"మాణిక్క ప్పుడార్ కండీర్."

అని, ప్రపంచము నంతయును ఆహ్వానించిరి. అది వారి పరమ కారుణ్య భావము.

యశోదమ్మ భావనలు

"వరుహ ! వరువా ! ఇంగ ! వామనంబి !"

ఎవరది ! మాతృత్వ మంతయు గూడు గట్టుకొని పిలుచు చున్నది ! ఆమె యశోద. విష్ణుచిత్తులు తమ కవితా లోకమున సృష్టించిన యశోదమ్మ. ఆహా ! పిలుపు ఎంత బా గున్నది ! ఆమె కృష్ణుడు శ్రీవిల్లి పుత్తూరునందు తిరుగుచున్నాడు.[28] అతడు పవ్వళించునది 'తిరుప్పే నగరున' నట ![29] కృష్ణుని గన్నందుకు —

యశోదమ్మకు జనులు సేయు బాగడలు అంత యింతని గాదు. ఆ బాగడల కామె మురిసిపోవును.[30] ఆమెకు కృష్ణునిపై అమితానురాగ ముండదా ? కన్నతల్లుల కుండవలసిన గుణము లన్నియును సర్వాత్మనా ఆమె కున్నవి. ఈ కృష్ణుఁ డూరకుండఁడు. వీని దుర్మార్గములు వయసుమించినవి. ఇంటి పరువును మించినవి ఊరు వారామెతో దూరులు జెప్పుదురు. ఆ దూరు లామె నమ్మదు. నమ్మినను — ఎవ్వరేగాని వాని నేమియు ననగూడదు. తానును అనగూడదు. ఇది యామె ప్రేమ. ఊరువా రెంతకని యూరకుందురు ? ఇంటితన మెంత పెద్ద దైనను, దుర్మార్గమునకును ఒక హద్దున్నది గదా ! వారు వచ్చి, 'అమ్మా! [31] ప్రభుత్వ మున్నది — అన్యాయము సేయుటకేనా ?' అని ప్రశ్నింతురు. 'బలే[32] మంచి కొడుకును గన్నావులే ! వట్టి పోకిరీ పిల్లవాఁ' డని, తెగించి యందురు. యశోదమ్మకు కోపము వచ్చును. ఆమె[33] తనపైనను, వారిపైనను కోపగించి, పరుషోక్తు లాడును. అప్పటికిని ఆమె కీ దుర్మార్గములు కృష్ణుఁడు చేసినాఁ డన్న విశ్వాసము లేదు. ఎవరో [34] కొంటెపిల్ల లందఱు చేరి, చేసి, వాని నిన్నటిని కృష్ణుని తలపై వేయుచున్నారని ఆమె యూహ. భాగవతము నందలి యశోదమ్మ ఒకసారి కృష్ణుని కట్టి

---

28. విల్లి పుత్తూర్ ఇని తమర్నాకు.

29. తెల్తెరై చ్యూళ్ తిరుప్పేర్ క్కిడన్ద తిరునరణా :

30. ఎన్నప్పోమ్బు నోత్రార్కళో : ఇవనై పెట్రవ యిరుదైయ్యాళ్ ఎన్నుం వారై యైదు విత్త యిరుదీరేవా : ముయిరుణాపే.

31. ఆరుపిరుందోర్ తమ్మై అనియాయం సెయ్వదు తాన్ వరక్కో ఆళోదాయ్.

32. పుళ్ళిర్ పుళిప్పేయ్ తాలొక్కుం తీమై పురై పురైయాల్ ఇవై సెయ్య వల్ల అణ్ణర్ కణ్ణనోన్ మహనై పెట్ర ఆళోద నంగాయ్ : ఈ నహనై కువాయ్.

33. కొల్లి లర చిన్నదు దినంగాయ్.

వేసినది. ఈమె కా భావన గూడ భయంకరము. ఆమెకు కోపము వచ్చినప్పుడు గట్టిగా సరచును. అంతే. ఇక నామె తన కుమారుని బిలుచు పిల్పులు ! ఓహో ! వాని నిండ, నూదన మరందార మధూక ధార ! ఒక్కొక్క విశేషము మొక్కొక్క భక్తిభావ స్రోతస్విని. వాని నన్నిటిని చదివి యానందింపవలె నంతే ! ఈ యశోదమ్మకు[35] శ్రవణ పాండిత్య మెక్కువ.

యశోదకు కృష్ణుడు పరబ్రహ్మ మని భాగుగా దెలియును. ఆయన లీలార్థమై తన యింట నవతరించినవాడనియు, ప్రతి కల్పమునను ఇట్లే లీల సాగుచుండునని యు యశోదమ్మ యెఱిగిన విషయమే. అందుకే ఆమె[36] బాణాసురుని కథ తడవును.[37] బలిని గట్టిన గాథ పనవును. మత్స్య[38] కూర్మా ద్యవతారముల వృత్తాంతములు ప్రవ్వును. ఇంతే[39] గాదు - శ్రీకృష్ణుడు చేయబోవు గాథలను గూడ ఆమె ముందే చెప్పి వేయును. కృష్ణుని లీల వలెనే, యశోదమ్మ లీలయును చిత్ర మైనది. ఆమె కృష్ణుని తల దువ్వి, జడ వేయుటకే బిలచును. వాని నాడించుటకై చందు నాహ్వానించును.

---

34. వల్లాయిరవర్ : ఇ వ్యూరిర్ ఏశ్వై గళ్ తీమైగళ్ సెయెవార్ ఎల్లాం ఉన్నేలవిప్పోదు యెంబిరానే : నీ యంగే వారాయ్.

35. వలపేచువపుత్త కత్తుక్కుళ కేట్టేన్.

36. మున్నులోర్ వెళ్ళువరుమవై కుట్టన్ మొదు మొదు విరం దోడ ఏనైవై తొడందోర్ కరుమవై కుట్టన్ పెయర్త్తు అడియాడు వదు బోల్. బాణాసురుని యుద్ధమున ఈశ్వరుడు పరు గెత్త గా అతని దరిమి కొని పోయినట్లు.

37. మువరి యడై చ్చెన్ఱ కేళ్.

38. వట్టియుం, ఆమెయ్యుం, మీనము మహాయ పార్కుడ ల్వణ్ణా.

39. నాంకళ్ మేంతియ నంబి ! కరణెన్ను, తాళ్ళ ధనంజయ రాజాధిరాజ్. శేంతర్కుటుక్క విజయన్ పణ్ణితిన్ శేర్, ఈర్త్తువన్ యన్నై పురం పుల్లువాన్."

శ్రీకృష్ణుఁడు శంఖ చక్రాద్యంకితములైన పాదములతో భూమిపై వింత చిత్రములు స్ఫురింపఁజేయుచు వచ్చి, వెనుక నుండి తన్నెప్పుడు కాగలించునో యని యబ్బి పోవును. కృష్ణునకు తలంటు పోయుటకై యాహ్వానించును. కాని, పెద్ద విచిత్ర మేమన, అన్ని భావములందును కృష్ణుఁడు శ్రీమన్నారాయణమూర్తి యనుట ఆమె మఱువనే లేదు. రెండు విరుద్ధములైన ఈ మహాభావములను ఆమె ఎట్లు పోషించుకొనుచువచ్చినదా! అని యొక ప్రశ్న. కృష్ణుని యశోద ఆడించుచున్న ఒక ఘట్టమును చూడుడు :-

"పెంగమల క్కడలిన్ బిడ్డిదల్ బొర్ విరళిల్
సిర్తిహ్ అదహళం కింకిణియుం ఆరెయిల్
తంగియ పొన్వెటయుం తాళన న్మాదులయన్
పూవాడు పొన్మణియుం మోదికముం దిరయమ్

మంగల ఐంబడియుం తోళ్వళయుం కుడైయుం
మకరముం వాకటం చుట్టియుం ఐత్తి లిన

ఎంగక్కుడ క్కరుసే! ఆడువా! శంకి రై
ఏ డుంపం ఉదయాట్! ఆడుపా! ఆడుపవే!"

ఎట్టి తలతో సమానమైన పాదములును, - దాని వేళ్ళతో సమానమైన కాలి వ్రేళ్ళును, ఉంగరములు - కింకిణులు - పీతాంబరము - ప్రవాళ మాల - దోనిమ్మ పూ మాల - మండలములు - ఝంకీలు మొదలైనవి ప్రకాశింప, కృష్ణా! ఒక సారి చేతులు గట్టుము!

ఇట్టి పరమ లలితమైన పీతాంబరుని శైశవమును దలంచుచునే యామె -

40"కోళరియన్ ఉరువంకొండు అవుణ నుదలం కురుది
కుళంబి యెళ కూర్మహిరాల్ కుడైవాయ్ !
మీళ అవన్ మహనై మేన్మై కొళ క్కరిది."

స్వామీ ! నీవు మున్ను ప్రహ్లాదుని రక్షించి, గౌరవము గల్గించుటకై నరసింహరూప మెత్తి, కఱకు రక్కసుని యొడలు వాడి గోళ్ళచేఁ జీల్చి, గండి వేసితివి. అపుడు రక్తము జిల్లు మని పై కెగిరెను.'

అనెడు నొక బీభత్స రూపమునుగూడి మన యెదుట నిల్చి నది. ఇంతకును చెప్పవచ్చిన దేమనఁగా - యశోదమ్మను ప్రోసి వచ్చి, పై పాశురము నందు నిల్చినది - విష్ణుచిత్తుల చిత్త ప్రవృత్తి యనియే. పై దానియం దొక చోటనే గాదు - ప్రతి సందర్భము నందును ఇంతే. విష్ణుచిత్తుల కవితలలోని యశోదమ్మ - ఆడువేషము వేసికొన్న విష్ణుచిత్తులు. 'అయ్చి యుయిర్ తన్' 'అశోదన్ మహన్ తన్నై కాప్పిట్ట మాట్రం' అనుచు, వారు అంతములందుఁ జెప్పిన మాటలు ఔపచారికములు మాత్రమే.

పెరియాళ్వార్లు 'యశోద' - తాను విష్ణుచిత్తుల నని మఱువక పోవుట పెద్ద ఆశ్చర్య కరము కాదు. కాని, పెరియాళ్వార్లు మాత్రము- తాము విష్ణుచిత్తు మని మఱచినది పెద్ద చిత్రము. 'వారికి వాత్సల్య భక్తి' యెద లోతుల కంటినది. కొన్ని భావములు వారు చెప్పినపుడు 'పురుషుఁ డిట్లు చెప్పఁగలఁడా ?, అని సందేహము దోచును. ఈ

---

40. ఆముక్త మాల్యదలో - రాయలు పల్కిన ఈ క్రింది పద్యము - భావము యొక్క పెంపకమే.

"అసురేం ద్రాశయ కుండి కాప్త రుధిర వ్యాప్త స్వక చ్ఛాయఁగా
చి, సముద్య త్త్రిది సింహ మత్సర మిళ చ్ఛేష్టన్ ద దుద్ధామ దీ
ర్ఘ సటా ధూటము చెల్లగించు గతి నాంత్రశ్రేణిఁ గిన్కన్ వెరం
జాసిత క్రూర భవ న్నృభావజుల ట్రోచున్ మర్త్య పంచాననా-:"

క్రింది భావము జూడుఁడు. యశోద – శ్రీకృష్ణుని చనుబాలు త్రాపు టకై పిలచుచున్నది :—

"ఎన్నమ్మలేరి
అరు మలై యై వాయ్ ముడుత్తు ఒరుములై యై నెరుటి క్కొండు
ఇరుములై యుం మురై మురై యా ఏంగి ఏంగి యిరుం తుణాయే.

'కృష్ణా ! నా తొడ నెక్కి, ఒక్క కుచమును నోట జేర్చి, మఱియొక దానిని చేతితో నులుముచు, రెండు స్తనములను మార్చి మార్చి, దూటి దూటి త్రాపుము.'

ఒకవైపు త్రాపుచున్నప్పుడు, వే ఱొక వైపును చేత నలు పుట శిశువుల స్వభావము. దానిని వీ రెంత బాగుగఁ బసికట్టిరి ! ఎంత బాగుగఁ జెప్పిరి ! కవి తాను వర్ణించు నన్ని వేశమున సంపూ ర్ణముగ లీన మైననే దప్ప, ఇట్టి యూహలు తట్టవు. 'వాత్సల్య భావ' వర్ణనమున నిట్టి యూహలు కొల్లకొల్లలుగా నున్నవి. స్థాలీ పులాక న్యాయముగఁ జూపితి నంతే !

గోపికలు - గోపకులు

యశోదకు తరువాత విష్ణుచిత్తులలో మన భావము నాచికొను వారు గోపికలు. వారిలో గోపాలురు గూడ గలరు. గోపకులు పెద్ద వారు గూడ నున్నారు. [41]వారి స్వరూపమును ఒక్క చోట మాత్రమే పెరియాళ్వార్లు వర్ణించిరి. ఇఁక చిన్న చిన్న గోపకులు – కృష్ణుని సమ వయస్కులు, చిన్నవారు, పెద్దవారు కోకొల్లలు. వారితో కృష్ణుఁ డాడుకొనును. ఈ యాటలలో – అనేక దశ్యాలు. పిల్లాటలు మొదలుకొని, పెద్దాటల వఱకు కృష్ణుఁడు చేసిన చేతలలో – గోప

41. కొండ తాకకోలకొండు, తండినర్, వరియాళై యవత్తన్ వింద మల్లై యరుం పన్న వల్లినర్, అందర్ మిడింపుహందు నెయ్యాడినార్."

కులకు భాగము కద్దు. మొదటినుండి కడవఱకు విష్ణుచిత్తుల కవితలలో, కృష్ణునితోఁగూడ వీరు హాజరు.

గోపకులలో అనేక చిత్ర వృత్తాంతను పెరియాళ్వార్లు సృష్టించిరి. కొందఱు ప్రౌఢలై నన్ను, నందనందనుని వాలకములకు మరులు గొని, తమ మరులునకై తామే ఆశ్చర్యపడువారు. కొందఱు చాడీలు చెప్పి నను, మనసున కృష్ణునిపై వలపుఁ గొన్న వారు. ఒక తెయ్యోదమ్మతో 42 'అమ్మా! మీ వాఁడు మా యింటిలో దూరి, ధుర్మార్గములు చేయుచున్నాఁడు. కొంచెము పిల్చుకోవమ్మా' అనుచున్నది. ఈమెకు మాత్రము నందరాజుపై ఏ వలపు గిలపు లేదు. ఇల్లాలి ధర్మము లన్నియు గల యొక సామాన్యపు యిల్లాలు. శ్రీకృష్ణుఁడొక గోపిక నెలయించి, లేవ దీసికొని వెళ్ళినాఁడు. ఆమె తల్లి — ఈ విషయ మందరితోడను చెప్పుచున్నది. ఒక తె తన బిడ్డ కృష్ణునిపై వలపు గొన్నది. ఆ వలపు పోవ్రాట కేది మంచి యడుగుచున్నది. ఇట్లు గోపికలలో అనేక రకములు.

ప్రజ కాంతలలో మన మనసు బాగుగ నాకర్షించువారు — పెరియాళ్వార్లు సృష్టించిన ప్రేమోన్మాదినులు. వీరి చిత్తవృత్తులను విష్ణుచిత్తులు అతి కరుణముగ వర్ణించిరి. ఒక గోపిక దాని యెడ లెల్లను భూభిభూనరితమైనది. ఆమె యెవరితోడను మాటాడ నేర్వదు. చీర గట్టను నేర్వ దట! ఇల్లు దాటి యెఱుఁగదు పాపము! కృష్ణుని శరీరచ్ఛాయవంటి రంగుగల నల్లని అవిసెపూవును చేత ధరించి, అట్లే యేడ్చు చున్న దట! వే ఱొక తె — మంటిలో నెప్పుడును శంఖ చక్రము లాదిగా గల బొమ్మలు చిత్రించుచు, విలపించుచున్న దట!

---

42. కూతి కొడ్డాయే ఇవైయ్యా ఎలవే.

మఱియొక గోపిక, కృష్ణునకు తాను తగినదాననని భావించుకొనుచు, సొగసుగ నలంకరించుకొన్నది. చేతుల వంకి, కరముల కంకణములు బెట్టుకొన్నది. అద్దమున తన కులుకు జూచుకొని, చక్కని చీర గట్టి, ఇంతలో నేమి దోచినదో ! వేడిగా నిట్టూర్చినట ! మరల ధైర్యము గూడ దెచ్చి, వాని గుణములు పనవు కొనుచు, ఓదార్చుకొనుచున్నది. ఈరీతిగా అనేక దశాభేదములు.

గోపాల కృష్ణుడు

శ్రీరాముడు మొదలగు ఇత రావతారములపై విష్ణుచిత్తునకు మన సున్నను, వారికి నూరులు కృష్ణునిపైననే. ఆ కృష్ణుడు — చాల దుర్మార్గుడు. వాడు తల్లి మాట వినడు. ఊరి ప్రేతలలో వయసు చిన్న దైనను, పెద్ద నేతలు నేయును. ప్రక్కింటి — పోరు గింటి పిల్లలను యేడ్పించును.[43] వారిని కన్ను లెర్ర జేసి బెదరించును.[44] ఆవు దూడల చెవ్వులలో ఎర్ర చీమలను బట్టి వేసి యెడ్పించును.[45] యశోదమ్మ — తలకుఁ బోయుటకై యొడలికి నూనె బూయఁగా — దానిపై మన్ను రాచుకొని తిరుగు లాడును. కనఁబడిన యీడువారికి సైగలు నేయును. అందులో — వయసు తారతమ్యముగూడ లేదు. ఈ చేతలలో — దిన మొకరు యశోదమ్మ యింటిపైకి వత్తురు.

---

48. ఇళం పిళ్ళై కిళ్ళి యెఱుప్పి, కణ్ణై పురట్టి విత్తుక్కళ్ళ కణ్ణుం నెయ్యుంపిరానే.

44. కన్ను గళ్ శివప్పాగ్ పణ్ణి, కట్టెరుంబు పిడిత్తిట్టాల్ తిన్నిక్కుం మాకిల్, వెణ్ణెయ్ తిరట్టి విళ కుమా కొల్విన్.

45. వెణ్ణె యరైంద కుళంగుం, విళైయాడు పుళుదియుం కొండు.

ఎమెగు కొంకుపై అభిమానము గంపె డంత. విష్ణుచిత్తుల కృష్ణుడు - దక్షిణ దేశమున మాత్రమే తిరిగెను. బృందావనము వైపు అడుగే పెట్టలేదు.

వేణుగానము

కృష్ణునిలో ఎన్ని పిల్లాట లున్నను, వాడు 'వాయి మడచి' పిల్లన గ్రోవి పలికించెనా! ఆ స్వామియే వేరై పోవును. శ్రీకృష్ణునిపై ఇన్ని దూరులు జెప్పిన గోపికలు - యెదలు జాఱ, ఒడలు మఱచి, లోక నీతిని విడచి, చెమటలు గాఱ వచ్చి, వారి యెదుట నిల్తు రట![46] వారి కవుడు - కొప్పులు వదలిపోయినదియు తెలియదు.[47] వీరు మాత్రమేగాదు - ఆకాశమున రంభాదులైన యప్సరలు గూడ నిల తురు.[48] వారు తమ నర్తనములనే మఱచిపోదు రట! నారదుడు,తుంబు రుడును తమ తమ వీణెల కథ మఱచి, నిర్విణ్ణులై నిలచిపోదురు.[49] చెట్లపై నున్న పక్షులు కూడు మఱచి, గూళ్ళలోనే యుండి, నిశ్శబ్ద ముగ వినునట! [50]హరిణములు మేత మఱచి, నగము కొరికిన గడ్డి యట్లే నెలవులం దుండగా - వ్రాయఁబడిన చిత్రముల వలె నిలచి, వాని వేణుగాన మాలించు నఁట! చిత్రమైన సృష్టినంటి వాని వేణుగానము - సర్వ సమ్మోహనము.

---

46. ఇకన్ కొంగైకుతుక లిప్ప, ఉడలుఁ విక్కు యోగమ్
కావలుం కడంచు కయిరుమాలై యాహి కనిత్తు నిన్తయరే.

47. మలర్ కూందల్ ఁవిఁ.

48. ఆటల్ పాటలై మా ర్తి నణ్ణమే.

49. తుంబురువోడు నారదనుం తంతమ్ వీజై మఱంతు.

50. మాన్కుంగళ్ మేయ్దై మరందు, మేయ్త పుల్లుం కళైవాయె వళితోడ. ఇరండు పాడుం తుడుం కాప్పుడై పెయరా, ఎవుదు నిత్తిరంగళ్ పోల విన్దనవే.

కస్తూరీతిలకం లలాటఫలకే వక్షస్థలే కౌస్తుభం
నాసాగ్రే నవమౌక్తికం కరతలే వేణుం కరే కంకణమ్
సర్వాంగే హరిచందనం చ కలయం కంఠే చ ముక్తావళిం
గోపస్త్రీ పరివేష్టితో విజయతే గోపాల చూడామణిః ॥

ఉపదేశములు - సందేశములు

అశోకవనమున నున్న సీతను హనుమంతుడు చూచినపుడు, అతడు వల్కిన 'అడియాలము'ను కొన్ని వృత్తములలో పలికిరి. కొన్ని ఉపదేశాత్మకములును వారి రచనలో నున్నవి. స్త్రీలకును కొన్ని ఉపదేశములు గలవు. మన యిండ్లలో - మన సంతానములకు భగవన్నామములనే యుంచవలె ననియు - విష్ణు చిత్తుల మఱి యొక ప్రబోధము.

వేణుగాన మాధుర్యము - కవిత్వగాన మాధుర్యము

శ్రీకృష్ణుని వేణుగానము విన్నపుడు - చేతనములే గాక, అచేతనములైన వృక్షములుగూడ నిష్కంపములై, మధుధారలు గార్చును.[51] పుష్పము లవశములై, జలజలరాలును. చెట్ల కొమ్మలు కృష్ణుడున్న వైపునకు వంగి, భావావేశముచే పర్ణములు ముడిచి కొనును.

ఈ మాటలు విష్ణుచిత్తు లన్నవే. పెరియాళ్వార్ల కవిత్వము గూడ నిట్టిదే. వారి హృదయ మను కృష్ణ వేణువునుండి బయలుదేరిన కవితాగానము సర్వమును మోహింపఁజేయునది మాత్రమే గాదు. పవిత్రీకరించునది గూడ. దాని సారస్యమును నిజముగా ఆస్వాదించు వారు వీతరాగులు, భగవదున్మాదనపరులు. మన మా వేణుగాన మును వినలేము. ఒకవేళ యేదో పూర్వ పుణ్య వశమున కొంచెము వినుట తటస్థించినను, దాని మాధుర్య మర్థముగాదు. మన యధికార మంతే. మనము చేసికొన్న పుణ్య మంతే.

—o—

51. మకంగళ్ నిస్తుమతు తాళైగళ్ పాయుమ్
మలర్గళె వీడుం, వళర్కొంబు తాళు.
ఇరంకుం, కూంపుం, తిరుమాల్
విన్న నిన్న పక్కం నోక్కి.

కవి పండిత పరిచయము

శ్రీమాన్ వానమామలై వరదాచార్యులు



జననము :- పరీధావి సంవత్సర శ్రావణ బహుళ ఏకాదశి (16-8-1912) **జన్మస్థలము :-** మడికొండ. వరంగల్ జిల్లా. **నివాస స్థలము :-** చెన్నూరు. ఆదిలాబాదు జిల్లా. **జననీ జనకులు :-** సీతమ్మ, నరసింహాచార్యులు.

విద్యార్హతలు :- సంస్కృతాంధ్రములలో వీరు ఉద్దండ పండితులు, సహజ పాండిత్య సంశోభితులు, సాహిత్య - సంగీత - జ్యోతిష్య - యోగ విద్యా విశారదులు. ఉరుదు, హిందీ, ద్రావిడము, ఆంగ్లము, మురారి మున్నగు భాషలలో విశేష పరిజ్ఞాన సంపాదించిన ప్రతిభా సంపన్నులు.

కొన్ని ముఖ్య విశేషాంశములు :- వీరు తమ 8 - యేట శ్రీరామతారక మంత్రోపదేశమును, 13 - వ యేట శ్రీ వాగీశ్వరీ మహామంత్రోపదేశమును పొందిరి. అనంతరము కొలది కాలమున వాగీశ్వరీదేవి సాక్షాత్కరింప, కవితా రచనను ప్రారంభించిరి. 14 . యేట, హరికథా - పురాణ కాలక్షేపములు, కావ్య గానములు, వేదాంతోపన్యాసములు ప్రారంభించిరి.

ఉద్యోగములు :- (1) 16-11-1954 నుండి 30-7-1961 వరకు - నిజామాబాదు జిల్లా దోమకొండ జనతా కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమ నిర్వాహకులుగను, (2) 1-10-1961 నుండి 1972 వరకు చెన్నూరు ఉన్నత పాఠశాలలో ఆంధ్రాధ్యాపకులుగను ఉద్యోగములను కడు సమర్థతో నిర్వహించిరి. **పదవులు** - 1972 నుండి 78 వరకు - ఆం. ప్ర. విధాన పరిషత్సభ్యులుగా వెలసిల్లిరి. ఆం. ప్ర. సాహిత్య అకాడమీ విశిష్ట సభ్యులుగా చిరకాలము వ్యవహరించిరి.

బిరుదులు :– కాశీ సంపూర్ణానంద సంస్కృత విశ్వవిద్యాలయమువారు 'విద్యా వాచస్పతి', D. Litt. అను బిరుదము లొసంగిరి. మఱియు, వివిధ సందర్భములలో – అభినవ పోతన, అభినవ కాళిదాస, మహాకవి శిరోమణి, ఉత్ప్రేక్ష చక్రవర్తి, ఆంధ్ర కవి శిరోవతంస, కవి కోకిల మున్నగు బిరుదము లనేకములు వీరికి లభించినవి.

సన్మానములు :– (1) ఆం. ప్ర. ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహా రావుగారు వీరి కాలికి సువర్ణ గండ పెండేరమును సమర్పించిరి. (2) ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆంధ్ర శాఖాధ్యక్షు లగు శ్రీ దివాకర్ల వేంకటావధానిగారు సువర్ణ ఘంటా కంకణమును సమర్పించిరి. (3) ఆం. ప్ర. అగ్రతుక్కులగు శ్రీ వర్ధినేని వెంకటేశ్వరరావుగారిచే సువర్ణాభిషేకమును, రత్నాభిషేకమును పొందిరి. (4) కరీంనగర్ జిల్లా కలక్టరు అగు శ్రీనివాసన్‌గారిచే రత్నాంబరములను స్వీకరించిరి. (5) 1977 మార్చి 25, 26 తేదీలలో కోరుట్లలో షష్టిపూర్తి సన్మాన మహోత్సవము అత్యంత వైభవముగా జరిగినది

కృతులు :– (ముద్రితములు) (1) మణిమాల (ఖండకావ్య సంపుటి) (2) ఆహ్వానము (66 కవితల సంపుటి) (3) జయధ్వజము (గేయ కవితా సంపుటి) (4) పోతన చరిత్ర (నాలుగువేల పద్య గద్యములతో నొప్పారు మహా ప్రబంధము) (5) శ్రీ సత్యనారాయణ వ్రత కల్పము (అనువాదము) (6) విప్రలబ్ధ (గేయ కావ్యము) (7) స్తోత్ర రత్నావళి (అనూదిత స్తోత్రముల సంపుటి) (8) భోగిని లాస్యము (పోతన చరిత్రలోని భోగినీ నృత్య ఘట్ట వర్ణనము) (9) వైశాలిని (పౌరాణిక మహా నాటకము) (10) గీతరామాయణము (అనువాద కావ్యము) (11) శ్రీ హనుమాన్ చాలీసా (అనువాద గ్రంథము) 12) కూలిపోయే కొమ్మ (వచన కవితా సంపుటి) (13) సూక్తివైజయంతి (సుభాషిత సప్తశతి.)

అముద్రితములు :– (14) నవరాజ పంచాశతి (ఐదు శతకముల సంపుటి) (15) మానవు లంతా మనవాళ్ళే (16) దాగుడు మూతలు (17) శ్రీ మార్కండేయ సుప్రభాతము (18) శాకీర్ గీతాంజలి - ఈ గ్రంథములే గాక, ఇంకను ఖండ కావ్యములు, గేయ నాటికలు, నృత్య నాటికలు, ఆకాశవాణి నాటికలు, బుఱ్ఱ

కథలు, హరికథలు మున్నగునవి మఱికొన్ని కలవు. ఈ రీతిగా వీరు వివిధ సాహిత్య ప్రక్రియలలో రచించిన గ్రంథముల సంఖ్య మొత్తము నలువది.

వీరు 31-10-1984 తేదీన అస్తమించిరి.

శ్రీమాన్ నిడమర్తి కందాడ గోవిందరాజ శ్రీభాష్యకారాచార్యులు

జననము :- విశ్వావసు మార్గశీర్ష శుద్ధ నవమి (1905). జన్మస్థానము :- శ్రీరామ తీర్థము. విశాఖ పట్టణము జిల్లా. జననీ జనకులు :- లక్ష్మమ్మ, రామానుజాచార్యులు.

విద్యాభ్యాసము :- స్వతండ్రిగారివద్ద సంస్కృతములో పంచకావ్యము లధ్యయనము చేసిరి. అనంతరము శ్రీమాన్ కోయిల్ కందాడై వేంకట రామాచార్యుల వారి వద్ద శ్రీభాష్యగ్రంథ కాలక్షేపము చేసిరి. అటు పిమ్మట - పెద తండ్రిగారయిన శ్రీమాన్ నిడమర్తి కందాడై తిరువేంగళ రామానుజాచార్యులవారివద్ద భగవద్విషయము, సంప్రదాయ గ్రంథముల కాలక్షేపము గావించిరి. సత్కారములు :- (1) పితాపురము రాజావారి ఆస్థానము నందలి శ్రీభాష్య పరీక్షలలో - ప్రథములుగా ఉత్తీర్ణులై, గౌరవ సత్కారము ప్రతి సంవత్సరము పొందుచుండెడివారు. (2) ఉభయ వేదాంతాచార్య పీఠమువారిచే 'ఉభయ వేదాంతాచార్య' బిరుదమును పొందుటేగాక, గౌరవ సత్కారమును ప్రతి సంవత్సరము పొందియున్నారు. (3) లాల్ బహదూర్ శాస్త్రిగారి గౌరవ వేతనము భారత ప్రభుత్వమునుండి ప్రతి సంవత్సరము పొందుచుండెడివారు.

ఉద్యోగములు :- (1) శ్రీరామతీర్థ దేవస్థానమువారి సంస్కృత పాఠశాలలో కొంతకాలము సంస్కృత పండితులుగా నుండిరి. (2) శ్రీ సింహాచల దేవ

స్థానమువారి ఆగమ పాఠశాలాధ్యక్షులుగా సుమారు ఇరువది సంవత్సరములు ఉన్నత పదవి నధిష్ఠించి విశ్రాంతి నొంది. సిద్ధార్థి సంవత్సర వైశాఖ బహుళ ఏకాదశి (21-5-1979) నాడు పరమపదించిరి.

శ్రీమాన్ చెలమచెర్ల రంగాచార్యులు

జననము :- 1912. జన్మస్థానము కృష్ణాజిల్లా - ఉంగుటూరు. జనని తండ్రులు:- వేంకటనరసమ్మ, శేషాచార్యులు.

వీరు మద్రాసు విశ్వవిద్యాలయమునకు సంబంధించిన 'వ్యాకరణ శిరోమణి' 'విద్వాన్' పట్టముల నలంకరించిరి. ఉస్మానియా విశ్వవిద్యాలయమున కాళీ పత్ర గ్రంథ పరిశోధకులుగా, ఓరుగల్లు నందలి ప్రభుత్వ కళాశాలలో సంస్కృతాంధ్రోపన్యాసకులుగా, మఱల - ఉస్మానియా విశ్వవిద్యాలయమున సంస్కృతాంధ్రోపన్యాసకులుగా, రీడరుగా ఉద్యోగమును మిక్కిలి సమర్థతతో నిర్వహించి, ఉద్యోగ విరమణ గావించిన యనంతరము - యు. జి సి. వారిచే మఱల ఆ విశ్వవిద్యాలయమందే ప్రొఫెసర్యుగా నియుక్తులైరి.

రచనలు :- హాలికుడు (నాటకము) (2) ఆంధ్రప్రతాపరుద్రీయ భూషణము (అలంకార శాస్త్రము) (3) అలంకార వసంతము (4) ఆంధ్ర ముత్తుండమాల (5) ఆదర్శ భారత కథావళి (6) ఆంధ్ర లక్ష్మీ వైభవోపాఖ్యానము (7) ఆంధ్ర లక్షణ రత్నాకరము (8) కావ్యోద్యానము (9) కావ్య వుష్పాంజలి (10) ఆంధ్రవీరులు (బాల వాఙ్మయము) (11) కాశీదాస కావ్యోద్యానము (12) ఆంధ్రౌచిత్య విచారచర్చ (13) సోమనాద్రి విజయము (14) వాల్మీకి (15) భక్తి భూషణ చంపువు (సంస్కృతము) (16) వ్యాఖ్యాత చక్రవర్తి మల్లినాథుడు (సంస్కృతము) మున్నగునవి.

వీనిలో – హాలికుడు (నాటకము) మద్రాసు, బెనారస్ విశ్వవిద్యాలయము లలో కొంతకాలము పాఠ్యముగా నిర్ణయింపబడినది. ఆంధ్ర ప్రతాపరుద్ర యశో భూషణము (అలంకార శాస్త్రము) ఆంధ్ర విశ్వవిద్యాలయములో కొంతకాలము పాఠ్యగ్రంథముగా నిర్ణయింపబడినది.

ఏలూరులో రెండు సంవత్సరము లుండి, వేంకట్రామా అండుకోవారి కోరిక పై, 'ఆంధ్ర శబ్ద రత్నాకరము' అను గొప్ప నిఘంటువును రచించిరి. ఇది రెండు భాగములుగా ప్రచురింపబడి, బహుళ ప్రచారమును పొందియున్నది.

వివిధ విషయములపై హైదరాబాదు రేడియో కేంద్రము నుండి వీరు చేసిన ప్రసంగములు – శ్రోతల ప్రశంసలకు పాత్రములైనవి. హైదరాబాదు, సికింద్రాబాదులలో గల అనేక సాహిత్య – ఆధ్యాత్మిక సంస్థలందు వీరు సభ్యులుగా, ఉపాధ్యక్షులుగా, అధ్యక్షులుగా వివిధ పదవుల నధిష్ఠించి, ఆ యా సంసలను విశేషముగా విలసిల్ల చేసిరి. 1972 ఏప్రిల్ 14 వ తేదీన, జంట నగరములలోని అనేక సాహితీ సంస్థలు, అనేక ఆధ్యాత్మిక సంస్థలు షష్టిపూర్తి సందర్భమున వీరిని ఘనముగా సన్మానించినవి. అభిమానులు, బంధుమిత్రులు, కవి పండితులు, శిష్య ప్రశిష్యులు మున్నగు వా రవేకులు వీరిని మహోన్నత స్థాయిలో సమ్మానించి, వీరి యందు వారికిగల గౌరవ భావమును అవ్యక్తము గావించిరి.

డాక్టర్ : జి. టి. గోపాలకృష్ణ నాయుడు



జననము :– 20–6–1000. జన్మ స్థానము :– తమిళనాడులోని తిరుచిరాపల్లి జిల్లా – కరూరు గ్రామము. వీరు – ఉన్నత విద్యను కరూరు లోనే అభ్యసించి, 1918లో ముగించిరి. 1918 నుండి 1921 వరకు కళాశాలలో ఉన్నతవిద్య నభ్యసించిరి. ఆటుపిమ్మట 1921 నుండి 1925 వరకు మద్రాసులో 'రాజపురం' మెడికల్ కాలేజిలో వైద్య విద్య నభ్యసించి, ఆ విద్యలో ఉత్తీర్ణు లైరి. అనంతరము మద్రాసు పబ్లిక్ హెల్త్ & మెడికల్ డిపార్టుమెంటులో మెడికల్ ఆఫీసరుగా పని చేసిరి. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (న్యూఢిల్లీ) లో – కొంతకాలము అధ్యక్షులుగా వ్యవహరించిరి.

1940 లో వీరిని తిరుమల – తిరుపతి దేవస్థానముల వారు - తిరుమలలోని దేవస్థానము ఆసుపత్రిలో మెడికల్ ఆఫీసరుగా ప్రభుత్వానుమతితో నియమించిరి. అచ్చట కొంత కాలము పని చేసిన పిమ్మట, సుప్రసిద్ధ వైష్ణవ క్షేత్ర మగు శ్రీరంగమునందును, సుప్రసిద్ధ శైవ క్షేత్ర మగు చిదంబరమునందును హెల్త్ ఆఫీసరుగా పని చేసిరి. తదువరి 1952 నుండి 1960 వరకు మున్సిపల్ హెల్త్ ఆఫీసరుగాను, జిల్లా హెల్త్ & మెడికల్ ఆఫీసరుగాను వని చేసి, 1960 లో ఉద్యోగ విరమణ చేసిరి.

వీరు ఉద్యోగ విరమణ చేసిన అనంతరము, శైవ – వైష్ణవ మతములకు సంబంధించిన 12 గ్రంథములను రచించిరి. వానిలో చివరి దగు 'స్వామి పట్టి నాథన్' అను గ్రంథమును తిరుమల – తిరుపతి దేవస్థానములవారు తమ దేవస్థాన ముల పక్షమున వెలువరించిరి.

డాక్టర్: పుట్టపర్తి నారాయణాచార్యులు

వీరు బహు భాషా వేత్తలు. బహు గ్రంథ కర్తలు. మహా వక్తలు. అనేక మహా సన్మానము లొందిన విద్వత్కవులు. రాష్ట్రపతి బహుమాన గ్రహీతలు. వీరి కావ్యము లనేకములు కొన్ని విశ్వవిద్యా లయములలో కొంతకాలము వఱకు పాఠ్య గ్రంథములుగా నిర్ణయింపబడినవి. ప్రభుత్వ స్థాయిలో వీరు వివిధ భాషా సాహిత్యములలో విశేషమైన పరిశోధన గావించి, ప్రముఖ పండితులచే బహు భంగులుగా ప్రశంసల నందుకొనిరి. సరస్వతీ పుత్రులుగా, కళా ప్రపూర్ణులుగా, మహా కవులుగా, 'పద్మశ్రీ' బిరుదాలంకృతులుగా విలసిల్లుచు – జ్ఞాన వృద్ధులై, 74 సంవత్సరముల వయో వృద్ధులై, ప్రస్తుతము కడప పట్టణమున – సాహిత్య వ్యాసంగముతో, ఆధ్యాత్మిక చింతనతో కాలము గడుపుచున్నారు.

—o—

VUORI LIBRARY

కౌముదీ ప్రశంస

శ్రీ రాజీవ దళాయతేక్షుని జగ
ద్రక్షైయోనుసంధాయకా
పారావార చరాచరప్రకృతి త
త్త్వజ్ఞాన సామ్రాజ్య వి
స్తారాలోక మయూఖికా తరళ ప
ద్మ జ్యోత్స్నలం దీర్చు మీ
శ్రీ రామానుజ కీర్తి కౌముది కివే
చేతః ప్రహర్షాంజలుల్.

గహన వేదాంత తర్క- సంగ్రహ విచార
వహన నుత విశిష్టాద్వైత మహిత సార
మృదుతర ద్రావిడోపనిష దమృతమ్ము
తృప్తి పంచెద రిది మా యదృష్ట దీప్తి !

విడని దీక్షస్ఫూర్తి నిడగ రామానుజ
కీర్తి కౌముది తుంకింపజేయ
ర్తకి శ్రీ ధనకుధరం వరదాచార్య
వర్య ! ప్రణుతి గనుడు - ప్రణతి గనుడు.

—ఆసూరి మరింగంటి పురుషోత్తమాచార్యులు